ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 296 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | గురువారం 22 జనవరి 2026 | పేజీలు : 8 | వెల : 3

Circulated by: Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతున్న వెండి!

వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది.గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది.

### భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం

అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు.

## 91.74కు చేరిన రూపాయి



- ట్రేడింగ్‌లో రూపాయి భారీగా నష్టపోయి, ఒక దశలో 91.74 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది.
- రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది.
- టేడింగ్ సాగుతున్న కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో రూపాయి విలువ అంతకంతకూ దిగజారింది.
- పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిశాయి.

## మాపై అధిక పన్ను విధించండి

- ప్రపంచ కుబేరుల ఆసక్తికర ప్రతిపాదన
- టైమ్ టు విన్ పేరిట సంతకాలు చేసి బహిరంగ లేఖ విడుదల
- సంపన్నులకు, సామాన్యులకు మధ్య అంతరం పెరుగుతోందని ఆందోళన
- ప్రపంచంలో అసలు సిసలైన ప్రజాస్వామ్య వ్యవస్థలను కోరుకుంటున్నామని వెల్లడి



## సింగరేణి భవిష్యత్తు అంధకారమే!



- నైనీ కోల్ బ్లాక్ టెండర్లలో అవినీతి, అక్రమాలు: కిషన్‌రెడ్డి
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి
- టెండర్ల విషయాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని నివేదికలు వస్తున్నాయి
- ఎక్కడా లేని సైట్ విజిట్ అనే కొత్త నిబంధన పెట్టారు
- ‘తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణి సంస్థ అనేక సమస్యల్లో కూరుకుపోయింది
- కేంద్రానికి సింగరేణిలో 49 శాతం వాటా ఉన్నా నిర్వహణలో జోక్యం చేసుకోలేదు
- తెలంగాణ చేతిలో ఒక్క నైనీ కోల్ బ్లాక్ పెడితే అక్రమాలకు తెర లేపారు



## కర్ణాటకపై కాషాయ పార్టీ గురి

- రాంమాధవ్‌కు కీలక బాధ్యతలు
- దేశ వాణిజ్య రాజధాని ముంబై మహానగరంలో 28 ఏళ్ల శివసేన ఆధిపత్యానికి ముగింపు పలికిన కమలం పార్టీ
- బెంగళూరులోనూ పాగా వేయాలని ప్లాన్
- మరో నాలుగైదు నెలల్లో జరగనున్న స్థానిక ఎన్నికలకు కసరత్తు మొదలు
- బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌ను గ్రేటర్ బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికల ఇంచార్జిగా నియమించింది

## హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు

**ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్‌లో దీన్ని నిర్వహించాలి**

**సీఎం ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు మద్దతు**



- తెలంగాణలో రష్మీ గ్రూప్ రూ.12,500 కోట్ల పెట్టుబడి
- దావోస్‌లో కుదిరిన ఒప్పందం
- దావోస్ సదస్సులో పెట్టుబడులను ఆకర్షిస్తున్న తెలంగాణ
- వరుస భేటీలతో బిజీబిజీగా గడుపుతున్న సీఎం రేవంత్ రెడ్డి
- క్లీన్ ఎనర్జీ రంగంలో 6వేల కోట్ల పెట్టుబడికి స్లోవేకియా ఒప్పందం
- హోటళ్లు, రిసార్ట్స్‌పై టాటాగ్రూప్ ఆసక్తి
- బీర్ల తయారీ యూనిట్ల విస్తరణ

దావోస్

వరల్డ్ ఎననామిక్ ఫోరం ఫాలోఅప్ సదస్సును ఏటా నిర్వహించాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్‌లో దీన్ని నిర్వహించాలని కోరారు. సీఎం ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డితో బ్లైజ్ కో ఫౌండర్ సీఈవో దినకర్ మునగాల భేటీ - మిగతా3లో



## గ్రీన్‌ల్యాండ్ మంచు కింద అమెరికా రహస్య స్థావరం

- నాసా రాడార్‌లో గుర్తింపు
- గ్రీన్‌ల్యాండ్ మంచు కింద బయటపడ్డ అమెరికా రహస్య సైనిక స్థావరం
- నాసా రాడార్ స్కానింగ్‌లో అనూహ్యంగా గుర్తింపు
- ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో ‘ప్రాజెక్ట్ ఐస్‌వర్మ్‘ కింద నిర్మాణం
- ‘మంచు కింద నగరం‘గా పిలిచే ఈ బేస్‌లో అణు క్షిపణుల నిల్వకు ప్లాన్
- వాతావరణ మార్పులతో వ్యర్థాలు బయటపడతాయని శాస్త్రవేత్తల ఆందోళన

# ఇంటి వద్దకే పోలీస్ అధికారి

- ఇంటి నుంచి కేసు నమోదు చేసే అవకాశం
- పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు చేసుకొనే విధానానికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర పోలీస్‌శాఖ
- ప్రత్యేక సందర్భాల్లో పోలీసులే బాధితుల ఇంటికి వెళ్లి కేసు నమోదు
- బాధితుల గౌరవానికి భంగం కలిగించకుండా పోలీస్ సేవలు




హైదరాబాద్

బాలికలు, మహిళలు చదువుకోవడానికి పాఠశాలకు, కార్యాలయాలకు వెళ్లే సందర్భాల్లో ఆకతాయిల నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులను చూస్తూనే ఉన్నాం. ఇలాంటి సందర్భాలలో వారిలో వారే బాధపడుతూ విషయాన్ని ఎవరికీ చెప్పలేక, ఏం చేయాలో తెలియక ఎందరో వనితలు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. ఇలాంటి వారికి అండగా నిలిచేందుకు పోలీస్ శాఖ ముందడుగు వేసింది. కొన్ని ప్రత్యేక నేరాల్లో బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఫిర్యాదు చేసుకొనే విధానానికి శ్రీకారం చుట్టింది. ఇలాంటి ప్రత్యేక సందర్భాల్లో పోలీసులే బాధితుల ఇంటికి వెళ్లి కేసు నమోదు చేయాలని రాష్ట్ర పోలీస్ శాఖ నిర్ణయించింది. తీవ్రమైన నేరం బారిన పడినప్పుడు బాధితులు మానసిక ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని పోలీస్ శాఖ ఈ సౌలభ్యాన్ని కల్పించబోతోంది. ఈ విధానం అమలుకు సీఐడీ ప్రామాణిక కార్యాచరణ విధానం (ఎస్‌వోపీ) - మిగతా3లో



## కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తివేయటం ఖాయం

- మున్సిపల్ ఎన్నికలపై చిట్‌చాట్‌లో కేటీఆర్
- సర్పంచ్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేసినా కాంగ్రెస్ సాధించింది ఏమీ లేదు
- జిల్లా పరిషత్ ఎన్నికలు పెట్టే అలోచనలో ప్రభుత్వం లేదు
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల తర్వాత అసెంబ్లీ ఎన్నికలే

హైదరాబాద్

మున్సిపల్ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కేసీఆర్, నేను ప్రచారం చేసేదేమీ ఉండదని.. సర్పంచ్ ఎన్నికల్లో ముఖ్యమంత్రి ప్రచారం చేసినా కాంగ్రెస్ సాధించింది ఏమీ లేదని అన్నారు. తెలంగాణలో మీడియాతో చిట్‌చాట్‌లో కేటీఆర్ మాట్లాడుతూ.. పంచాయతీ ఎన్నికల్లో 40 శాతం సర్పంచులను గెలిచామని.. మున్సిపల్ ఎన్నికల్లో కూడా మెజారిటీ సీట్లు గెలుస్తామని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల - మిగతా3లో


## సంపాదకీయం

# ఆరోగ్యం కోసం 'డిజిటల్ ఉపవాసం'

సాంకేతిక విప్లవం మూడు ట్యాబులు ఆరు స్మార్ట్‌ఫోన్లుగా విస్తరిస్తోంది. కంప్యూటర్ యుగంలోంచి డిజిటల్ యుగంలోకి అడుగిడిన నవ్య ఏఐ నరుడి జీవనశైలి సమూలంగా మారిపోయింది. డిజిటల్ వెలుగులు మానవాళి కళ్లకు నీలి తెరలు కప్పేస్తున్నాయి. అంతర్జాలం విశ్వవ్యాప్తం అయ్యింది. భూమి కుగ్రామంగా రూపాంతరం చెందింది. దేశ సరిహద్దులు రేఖామాత్రంగా మిగిలిపోయాయి. స్మార్ట్‌ఫోన్ ఉపకరణం మనవ శరీరంలో మరో అంగమై తిష్ట వేసింది. స్మార్ట్‌ఫోన్ లేకుండా బతుకులు అంధకారమయం అయ్యాయి. సమాచార సేకరణ, కమ్యూనికేషన్, వ్యాపారం, విద్య, వినోదాల కోసం తెరలను ఆశ్రయిస్తున్నాం. స్మార్ట్‌ఫోన్ నీలి తెరలకు బానిసలుగా మారిపోతున్నాం. ప్రపంచ మానవాళి రోజుకు సగటున 6.5 – 7.0 గంటల పాటు స్క్రీన్ టైమ్ గడుపుతున్నారు. ఇండియాలో సహితం సగటున 5.0 – 7.4 గంటల పాటు స్మార్ట్ తెరలకు అతుక్కుపోతున్నారు. స్మార్ట్‌ఫోన్ దూరమైతే ప్రాణం పోయినంత పని అవుతున్నది. స్మార్ట్ తెరలు దూరమైతే ఊపిరి ఆగినంత అనుభవం కలుగుతోంది. మన జీవితాలు సాంకేతిక తెరలకు అంకితమై పోయాయి. స్మార్ట్‌ఫోన్, ఐప్యాడ్, ల్యాప్‌టాప్, కంప్యూటర్, టివీ, టాబ్లెట్ లాంటి స్మార్ట్ ఎలక్ట్రానిక్ ఉపకరణాలు మన ఇండ్లల్లో నిత్యావసరాలు అయ్యాయి. పని పిల్లల నుంచి పండు ముసలి వరకు అందరూ ప్రతి రోజు గంటల పాటు అవసరం ఉన్నా లేకున్నా ఆయా కాంతివంతమైన తెరలకు అతుక్కుపోతున్నారు. రోజులు, వారాలు, మాసాలు, ఏండ్ల పాటు స్క్రీన్ టైమ్ పెరగడంతో మన శరీరాలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. స్క్రీన్ టైమ్ పెరగడం కారణంగా మానసిక ఒత్తిడి పెరగడం, ఏకాగ్రత తగ్గడం, నిద్రలేమి, పనిలో ఉత్పాదకత పడిపోవడం, కంటి జబ్బులు కమ్ముకోవడం, మయోపియా, మెడనొప్పులు, భుజంనొప్పులు, తలనొప్పి, మెదడుపై తీవ్ర ప్రభావాలు చూపడం లాంటి ప్రమాదకర ప్రతికూల లక్షణాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగాల్లో భాగంగా రోజుకు 8 – 10 గంటలు నీలి తెరల ముందు స్మార్ట్ వర్క్ చేసే ఉద్యోగుల ఆరోగ్యాలు గాల్లో దీపాలు అవుతున్నాయి. పిల్లలు, విద్యార్థులు, యువత, మహిళలు సహితం అనవసరమైన, ప్రయోజనం లేని సామాజిక మాధ్యమాల్లో తలదూర్చి తమ విలువైన సమయం, ఆరోగ్యాలకు కోల్పోతున్నారు. ఈ ప్రమాదకర సమస్యకు విరుగుడుగా వచ్చిందే "డిజిటల్ ఉపవాసం" లేదా "డిజిటల్ ఫాస్టింగ్" అనబడే సానుకూల ప్రక్రియ అని తెలుసుకోవాలి. ఒక వ్యక్తి నిర్దిష్ట సమయం (గంటలు లేదా రోజుల పాటు) పాటు డిజిటల్ తెరలను దూరంగా ఉండడాన్ని "డిజిటల్ ఉపవాసం" లేదా "డిజిటల్ ఫాస్టింగ్" అని నిర్వచిస్తున్నారు. డిజిటల్ తెరలను విరామం ఇవ్వడం ద్వారా కళ్లకు విశ్రాంతి, మనసుకు ప్రశాంతత, శారీరక ఉపశమనం, సరిగ్గా నిద్రపోవడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. రోజుకు కొన్ని గంటలు లేదా వారంలో ఒకటి లేదా అంత కన్న ఎక్కువ రోజులు స్క్రీన్‌లకు దూరంగా ఉండడం మన దినచర్యలో భాగం కావాలి. 20–20–20 నియమం ప్రకారం, తెరల ముందు 20 నిమిషాల గడిపిన తర్వాత 20 అడుగుల దూరంలో ఉన్న ఏదైనా వస్తువులను కొన్ని సెకన్ల పాటు చూడడం అలవర్చుకోవాలి. తెరల్లో మునిగినపుడు గదిలో సరైన వెలుతురు ఉండే విధంగా చూసుకోవాలి. స్మార్ట్ తెరల్లో మునిగే వారు తరుచుగా నీరు తాగాలి. ఒగ గంట లేదా గంటన్నర తర్వాత ఐదు నిమిషాలు విరామం తీసుకోవడం మరువరాదు. వీటితో పాటు రోజుకు కనీసం 4 – 5 గంటల పాటు తెరలను మూసి వేసి డిజిటల్ ఉపవాస వ్రతం పట్టాలి. స్క్రీన్ టైమ్ తగ్గించడాన్ని 'డిజిటల్ డీటాక్స్'గా అర్థం చేసుకోవాలి. డిజిటల్ ఉపవాసం తీసుకున్న సమయాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడుపుతూ మానసిక శారీరక ఉపశమనం పొందాలి. కరోనా తర్వాత ఆన్‌లైన్ కోర్సులు లేదా తరగతుల ఉద్యమం రావడంతో పరిస్థితులు మన చేయి దాటాయి. పిల్లలు, యువత చేతుల్లో మనమే స్మార్ట్ ఫోన్లు పెట్టాల్సిన అగత్యం ఏర్పడింది. స్క్రీన్ నుంచి విరామం తీసుకోవడం మన జీవనశైలిలో భాగం చేసుకోవాలి. వారానికి కనీసం ఒక రోజు డిజిటల్ ఉపవాసం ఆచరించాలి. రోజుకు కొన్ని గంటలు 'డిజిటల్ ఫాస్టింగ్'ను ఆశ్రయించాలి. 'డిజిటల్ ఫ్రీ జోన్' సమయంలో పుస్తకాలు చదవడం, ఆత్మీయులతో గడపడం, నోటిఫికేషన్లను ఆఫ్ చేయడం, ఆఫ్‌లైన్ కార్యాలకు పూనుకోవడం లాంటివి ఆచరణలో పెట్టాలి. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండడం మంచిది. రాత్రి సమయంలో తెరలకు లొంగితే నీలి కాంతి తెరల వల్ల మెలటోనిన్ హార్మోన్ల విడుదల తగ్గి నిద్రకు అంతరాయం కలుగుతుంది. డిజిటల్ ఉపవాసాలను ఆచరణలో పెడుతూ మనసు, మెదడులను సాంకేతిక విష వలయం నుంచి విముక్తి చేయాలి. డిజిటల్ స్క్రీన్‌టైమ్‌ను తగ్గిస్తూ, శారీరక మానసిక వికాసానికి పునాదులు వేద్దాం. రోజుకు కొన్ని గంటల పాటు తెరలకు విడాకులు ఇద్దాం.

# వ్యావహారిక భాషా పితామహుడు

తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా, అభినవ వాగనుశాసనునిగా పేరెన్నిక గన్న సాహితీవేత్త గిడుగు రామమూర్తి పంతులు రామమూర్తి (1863–1940). ఆధునిక విజ్ఞాన వ్యాప్తికి, వచన రచనకు కావ్యభాష పనికి రాదనీ, సామాన్య జనానికి అర్థమయ్యే సమకాలీన "శిష్టవ్యావహారికం"లో ఉండాలనీ ఆనాటి సాంప్రదాయిక పండితులతో హోరాహోరీగా యుద్ధంచేసి ఆధునిక ప్రమాణ భాషను ప్రతిష్టించటానికి మార్గదర్శకుడైన వారు గిడుగు రామమూర్తి. గిడుగు వారి వ్యవహారిక భాషోద్యమం వల్ల ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకుంది. రచనా వైవిధ్యం, వైశిష్ట్యంతో పుష్టి చేకూరింది. విశ్వ విద్యాలయాలలో వాడుకభాష రాజ్య మేలుతోంది. పత్రికలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. అక్షరాస్యత పెరిగింది. తెలుగు అధికార భాషగా, పరిపాలనా భాషగా కీర్తికెక్కింది. దీనికంతటికీ గిడుగు పిడుగే మూలకారకులు. గ్రాంధికభాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకు వచ్చి, నిత్య వ్యవహారం లోని భాషలో ఉన్న అందాన్నీ, వీలునూ తెలియ జెప్పిన మహనీయుడు. ఆంధ్రదేశంలో వ్యావహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది. శిష్టజన వ్యవహారిక భాషను గ్రంథరచనకు స్వీకరింప జేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమంవల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యావహారిక భాషలో సాగి, అందరికీ అందుబాటు లోకి వచ్చింది. పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి, సృజనాత్మక శక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ వీలైంది. తెలుగు భాష గురించి ఆధునిక పద్ధతిలో ఆలోచించిన తొలి భాషా విజ్ఞాని ఆయన. ఈ వాడుక భాషా వాదాన్ని చేపట్టినందుకు గిడుగువారు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. దీన్ని గ్రామ్య వాదమనీ, గిడుగు వారు గ్రామ్యాచార్యులనీ గ్రాంధికవాదులు హేళన చేస్తూ పద్యాలూ, వ్యాసాలు రాశారు. జయంతి రామయ్య పంతులు, కాశీభట్ట బ్రహ్మయ్య శాస్త్రి, వేదం వెంకటరామ శాస్త్రి, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి మొదలైన వారితో ఢీకొనవలసి వచ్చింది. ఆంధ్రసాహిత్య పరిషత్తు గ్రాంధిక భాషావాదానికి అండగ నిలిచింది. గిడుగువారు 'తెలుగు' పత్రిక ద్వారా గ్రాంధిక వాదాన్ని ఖండిస్తూ వ్యావహారిక వాదాన్ని బల పరిచారు. పండితులే తప్పులు లేకుండా రాయలేని గ్రాంధికం బలవంతాన రుద్దడం ఎందుకంటూ "ఆంధ్ర పండిత బిషక్కుల భాషా భేషజం" అనే పుస్తకం ప్రచురించారు. తెలుగు సాహిత్యంపై పండితుల గుత్తాధి కారాన్ని పోగొట్టారు. ప్రజలలో ఒక్కరు కూడా నిరక్షరాస్యులు కాకూడదని, అందుకు వాడుక భాష సాధనం కానీ... గ్రాంధికమని తమకే రాని, తమకే తెలియని, భాషను పిల్లలు ఉపయోగించాలనీ అందులోనే పుస్తకాలు రాయాలనీ, దానిలోనే పాఠ్య పుస్తకాలుండాలని శాసించడం అవివేకమని ఉద్యమించారు. చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి, తాతా సుబ్బరాయుడు శాస్త్రి వంటి ఉద్దండ పండితులే ఆయన వాదంలోని సబబు గుర్తించారు. బల పరచారు. కుండలాల, శాలువాల పండితుల సాహిత్యాధికారం, అసంబద్ధమైన వ్యాకరణ, ఛందశ్శాస్త్ర దండనాధికారం చెల్లదన్నారు. సాహిత్య ఫ్యూడల్ సంప్రదాయాన్ని ధిక్కరించి, నిరాకరించి, నిర్మూలించి ప్రజాస్వామ్య పద్ధతిని తెలుగు సాహిత్యంలో ప్రతిష్ఠించాడు. తప్పు ఒప్పులు నిర్ణయించే అధికారం ఎవరికీ లేదన్నారు.



భాషకైనా, మనిషికైనా మార్పు కూర్పు చేర్పు సహజమని బోధించారు, నచ్చచెప్పారు. వ్యావహారిక భాషోద్యమం తెలుగు భాషలో వచ్చిన చారిత్రాత్మకమైన మార్పుకు ప్రధాన కారణం గిడుగు రామమూర్తి సారధ్యంలో నడిచిన వ్యావహారిక భాష ఉద్యమం లేదా వ్యావహారిక భాషోద్యమం. ఇది 20వ శతాబ్దపు పూర్వార్ధంలో ప్రాచీనమైన గ్రాంథిక భాషకు... వ్యావహారిక లేదా వాడుక భాషకు మధ్య జరిగిన భాషా ఉద్యమం. పూర్వం తెలుగులో పాఠ్యాంశాలు అన్నీ గ్రాంథిక బాషలోనే ఉండేవి. 1907లో ఉత్తర కోస్తా జిల్లాలకు పాఠశాలాల ఇన్స్పెక్టర్‌గా వచ్చిన జె.ఎ.యేట్స్ అనే బ్రిటీష్ అధికారి ప్రజలు వ్యవహరించే భాష, పుస్తకాల భాష మధ్య ఉన్న తేడాలు చూసి ఆవేదన చెందారు. ఆయన అదే విషయాన్ని గిడుగుతో చర్చించారు. ఆ విధంగా గిడుగు జీవిత ఉత్తరార్ధంలో ఈ విషయాన్ని గురించి గాఢంగా ఆలోచించి తెలుగు విద్యా విధానంలో అన్యాయం జరుగుతున్నదని గుర్తించారు. గురజాడ, గిడుగులు, శ్రీనివాస అయ్యంగారు, యేట్సు ? ఈ నలుగురి ఆలోచనల వల్ల వ్యావహారిక భాషోద్యమం ఆరంభమైంది. 1919–20ల మధ్య వ్యావహారిక భాషోద్యమ ప్రచారం కొరకు 'తెలుగు' అనే మాసపత్రిక నడిపారు. వ్యవహారిక భాషను ప్రతిఘటించిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు సభలో (1925, తణుకులో) నాలుగు గంటలపాటు ప్రసంగించి గ్రంథాల్లోని ప్రయోగాల్ని ఎత్తి చూపి తన వాదానికి అనుకూలంగా సమితిని తీర్మానింప జేసారు "గిడుగు". సాహితీ సమితి, నవ్య సాహిత్య పరిషత్తు మొదలైన సంస్థలు కూడా గిడుగు వాదాన్ని బలపరచాయి. స్కూలు కాలేజీ పుస్తకాల్లో గ్రాంథిక భాషే పాతుకు పోయింది; కొన్నిటిలో వీరేశలింగం ప్రతిపాదించిన సరళ గ్రాంథికం కూడా వచ్చింది. గిడుగు రామమూర్తి ఊరూరా ఉపన్యాసాలిస్తూ గ్రాంథికంలో ఏ రచయితా నిర్దిష్టంగా రాయలేడని నిరూపించారు. 1919లో గిడుగు "తెలుగు" అనే మాస పత్రికను స్థాపించి తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించారు. కాని ఆ పత్రిక ఒక ఏడాది మాత్రమే నడిచింది. చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి, తల్లావజు&ఝుల శివశంకరశాస్త్రి, కందుకూరి వీరేశలింగం, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, వజ&ఝుల చిన సీతారామశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1919 ఫిబ్రవరి 28న రాజమహేంద్ర వరంలో కందుకూరి వీరేశలింగం అధ్యక్షులుగా, గిడుగు కార్యదర్శిగా "వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం" స్థాపించారు. 1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. 1933లో గిడుగు రామమూర్తి సప్తతి మహోత్సవం ఆయన అభిమానులు, శిష్యులు రాజమహేంద్ర వరంలో బ్రహ్మాండంగా జరిపారు. తెలికచెర్ల వెంకటరత్నం సంపాదకుడుగా ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన 46 పరిశోధక వ్యాసాలతో వ్యాస సంగ్రహం అనే ఉద్గ్రంథాన్ని ఆయనకు సమర్పించారు. 1936 లో నవ్యసాహిత్య పరిషత్తు అనే సంస్థను ఆధునికులు స్థాపించి సృజనాత్మక రచనల్లో శిష్ట వ్యావహారికాన్ని ప్రోత్సహించే "ప్రతిభ" అనే సాహిత్యపత్రికను ప్రచురించారు. 1937లో తాపీ ధర్మారావు సంపాదకులుగా "జనవాణి" అనే పత్రిక కేవలం ఆధునిక ప్రమాణ భాషలోనే వార్తలు, సంపాదకీయాలు రాయటం మొదలు పెట్టింది. వాడుక భాష గ్రామ్యభాష కాదు. సజీవ భాష. తెలుగు భాష మారుతోంది. కాబట్టి కొత్త వ్యాకరణాలు, సవరణలు వెలువడ్డాయి. నన్నయ భాషకి, తిక్కన భాషకి, ప్రబంధ బాషకి, దక్షిణాంధ్ర యుగం నాటి భాషకి చాలా భేదాలున్నాయి. వ్యావహారిక భాషావాదం ప్రాచీన సాహిత్యానికి వ్యతిరేకంగా ఏర్పడలేదు. ప్రాచీన కావ్యాలను, వ్యాకరణాలను గౌరవిస్తూనే వాడుక భాషకి ప్రాచుర్యం కల్పించాలి. వాడుక భాషలో కూడా ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించవచ్చును. ఉదాహరణ: గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం. గ్రాంథిక భాష పండితులకే అర్థం కాదు. గొప్ప పండితులు కూడా తప్పులు లేకుండా రాయలేరు. మారుతున్న కాలానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలలో విజ్ఞానం పెంపొందించు కోవాలంటే పాఠ్య గ్రంథాలు వాడుక భాషలోనే ఉండాలి. వాడుక భాష ప్రజల భాష. గ్రాంథిక భాష పండితుల భాష. ఆ రోజుల్లోనే అతనికి దగ్గర అడవుల్లో ఉండే సవరల భాష నేర్చుకొని వాళ్ళకు చదువు చెప్పాలనే కోరిక కలిగి, తెలుగు, సవర భాషలు రెండూ వచ్చిన ఒక సవర వ్యవహర్తను ఇంట్లోనే పెట్టుకొని చాలా ఏళ్ళు సవర భాష నేర్చుకున్నారు. సవర భాషలో పుస్తకాలు రాసి సొంత డబ్బుతో స్కూళ్ళు పెట్టి అధ్యాపకుల జీతాలు చెల్లించి సవరలకు వాళ్ళ భాషలోనే చదువు చెప్పే ఏర్పాట్లు చేశారు. మద్రాసు ప్రభుత్వం ఈ కృషికి మెచ్చి 1913లో "రావ్ బహదూర్" బిరుదు ఇచ్చారు. భాషాశాస్త్రంలో అప్పుడప్పుడే వస్తున్న పుస్తకాలు చదివి వ్యాకరణ నిర్మాణ విధానం నేర్చుకొన్నారు. ముప్ఫై అయిదేళ్ళ కృషితో 1931లో ఇంగ్లీషులో సవర భాషా వ్యాకరణాన్ని, 1936లో సవర–ఇంగ్లీషు కోశాన్ని నిర్మించారు. 1940 జనవరి 15వ తేదీన ప్రజామిత్ర కార్యాలయంలో పత్రికా సంపాదకులను సంబోధిస్తూ చేసిన తన తుది విన్నపంలో వ్యావహారిక భాషా వ్యాప్తికి చాలా సంతృప్తి పొందారు. కాని, ప్రభుత్వ విద్యాశాఖ, విశ్వ విద్యాలయాలు గ్రాంథికాన్ని వదిలి పెట్టక పోవటానికి బాధపడ్డారు. గిడుగు జన్మదినమైన ఆగస్టు 29 ను 'తెలుగు భాషా దినోత్సవము'గా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము పరిగణిస్తున్నది. తెలుగు వ్యావహారిక బాషకు పితామహుడిగా పరిగణించ బడే, తెలుగు బాషకు ఎనలేని సేవ చేసిన గిడుగు 1940, జనవరి 22న కన్ను మూశారు.

# మాడపాటి జీవితమే ఆంధ్ర ఉద్యమ చరిత్ర

మాడపాటి హనుమంతరావు ఒక వ్యక్తి కాదు. ఒక మహా సంస్థ. ఆయన జీవిత చరిత్రమే తెలంగాణ ఆంధ్రోద్యమ చరిత్ర. అందుకే ఆంధ్ర పితామహుడని పేరుపొందిన ప్రజానాయకుడు ఆయన. నాటి నిజాం రాజ్యంలోని తెలుగు వారిలో జాగృతిని కలిగించి, సామాజిక, సాంస్కృతిక రాజకీయ వికాసానికై నిరంతర కృషిచేసిన ప్రముఖుడు, బహు భాషా పండితుడు మాడ పాటి. తెలంగాణలో చైతన్యాన్ని తెచ్చిన తొలి తెలుగు నాయకునిగా ఆయన సుపరిచితుడు. ఆయన ఒక విజ్ఞాన సర్వస్వము. ఆయన బ్రిటీష్, నిజాం రాజ్యాల సరిహద్దు లలో ఉన్న ఎర్రుపాలెం వాస్తవ్యుడు కనుక నిజాం ఆంధ్రులందరిలో ముందు మేల్కొన్నాడు. తన దేశీయుల్ని మేల్కొలిపినాడు. 1904లో హనుమకొండలో శ్రీరాజరాజ నరేంద్ర ఆంధ్రభాషా నిలయంలో సన్నని జాలుగా బయలుదేరిన ఆయన ఆంధ్రోద్యమం గోల్కొండ పత్రికలో పరిపుష్టినందుకుని, ఆంధ్ర మహా సభలలో వాహినిగా ప్రవహించింది. హనుమంతరావు 20వ శతాబ్ది తొలిదశకంలో హైదరాబాద్ రాజ్యంలోని తెలుగు ప్రాంతాల్లో (నేటి తెలంగాణ) ఆంధ్రోద్యమం వ్యాప్తి చేసేందుకు కృషిచేశారు. న్యాయవాద వృత్తిని చేపట్టిన మాడపాటి, విజయవంతమైన లాయరుగా పేరుపొందారు. తీరిక సమయాలన్నిటా ఆంధ్రోద్యమానికి, తెలంగాణాలో గ్రంథాలయాల అభి వృద్ధికి కేటాయించేవారు. ఆంధ్ర జన సంఘం, ఆంధ్ర మహాసభ వంటి ప్రజాసంఘాల స్థాపనలోనూ, వాటి నిర్వహణలోనూ కీలకపాత్ర వహించారు. 1885 జనవరి 22 (తారణ సంవత్సర మాఖ శుద్ధ షష్ఠి)న కృష్ణా జిల్లా, నందిగామ తాలూకా పొక్కునూరులో వెంకట ప్పయ్య, వెంకట సుబ్బమ్మ దంపతు లకు జన్మించారు. వీరు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. ఆయన తండ్రి గ్రామాధికారిగా పనిచేసేవారు. ఐదు సంవత్సరాల వయసులోనే తండ్రి చనిపోగా, సూర్యాపేటలో ఉద్యోగం చేస్తున్న మేనమామ దగ్గర పెరిగారు. హన్మకొండలోని ఉన్నత పాఠశాలలో చేరి మద్రాసు యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణులు అయినారు. వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాల యంలో నెలకు 40 రూపాయల వేతనంపై మీర్‌మున్షీ (హెడ్‌క్లర్క్) ఉద్యోగంలో చేశారు. ఎనిమిది సంవత్సరాలు ఆ ఉద్యోగంలో ఉండి హైదరాబాద్ కొచ్చి 'లా' పరీక్ష పూర్తిచేసి ప్రాక్టీసు పెట్టారు. వకాలత్ విడిచి పెట్టేనాటికి ఆయనకు నెలకు ఆరువందల ఆదాయం వచ్చేది. పంతులు సేవ రాజకీయ పార్టీల ద్వారా జరగ లేదు. నిర్మాణా త్మకమైన సంస్థలద్వారా జరిగింది. ఒకానొక పరాభవాగ్నిలోంచి పుట్టింది నిజాం ఆంధ్రోద్యమం. 1921 సంవత్సరం నవంబరు 12వ తేది వివేక వర్ధనీ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ హిందూ సంస్కార సభ జరుగగా, ఆ సభలో అనేక మంది ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలలో మాట్లాడుతున్నారు. ఆంధ్ర ప్రతినిధులు మాడపాటి హనుమంతరావు, ఆలంపల్లి వెంకటరామారావు, ఇద్దరూ హైకోర్టు న్యాయవాదులు. మహారాష్ట్ర బాహుళ్యమైన సభలో తెలుగులో మాట్లాడినారు. సభలోని వారు విసుక్కున్నారు. నిరసన ప్రకటిం చారు. అల్లరి చేసారు. తమ వీపులు సభావేదిక వైపు తిప్పి వినమన్నారు. ఈ దుశ్చర్య, అవమానం ఆంధ్రులు భరించలేక పోయారు. ఆ రాత్రికి రాత్రే టేకుమల రంగారావు ఇంట్లో సమావేశమై కర్తవ్యం ఆలోచిం చారు. ఆంధ్రుల అభిమాన సంరక్షణ కోసం, ఆంధ్రుల వ్యక్తిత్వ నిరూపణ కోసం ఒక సంఘం స్థాపించు కోవాలని నిర్ణయించు కున్నారు. ఆ సంఘం పేరు నిజాం రాష్ట్ర ఆంధ్ర జన సంఘం. అధ్యక్షుడు రావు బహదూర్ సామల వెంకటరెడ్డి, కార్యదర్శి మాడపాటి హనుమంత రావు. తరువాత మహారాష్ట్ర కన్నడ పరిషత్తులు కూడా ఏర్పాడ్డా యి. నాటి వరకు ఏ ఉద్యమమైనా నగరానికే పరిమితమై ఉండేది. ఆంధ్రులుగా గ్రామ సీమలకు వెళ్లారు. ఆంధ్రులలో ఐకమత్యం, చైతన్యం, విద్య, స్త్రీల వికాసం మొదలైన వాటికి కారకులయ్యారు. తాము మేల్కొని ఇతరులను మేల్కొలి పారు. ఆంధ్రసంఘం పెద్ద ఆశయాలతో బయల్దేరింది. గ్రామీణుల విజ్ఞానం వృద్ధి చేసి, వాళ్ళ కళ్ళు తెరిపించడానికి గ్రంథాలయాలు, రైతుల ఇక్కట్లు పోగొట్టడానికి రైతు సంఘాలు, వ్యాపార పరిస్థితులు బాగు పరచ డానికి వర్తక సంఘాలను స్థాపిం చింది. పటేల్–పట్వారీల జులంతో, భూస్వాముల వెట్టి చాకిరితో, అధికారుల దౌర్జన్యంతో బాధపడుతున్న నిర్భాగ్యపు ప్రజల శ్రేయస్సుకోసం పనిచేసింది. ఆంధ్ర జన సంఘం నాయకులు జిల్లాలు తిరిగి కర్తవ్య ప్రబోధం చేశారు. మాడపాటి గ్రంథాలయోద్యమం లోనూ చెప్పుకోదగ్గ కృషి సాగిం చారు. ఆయన తనకు సన్మానం ద్వారా లభించిన సొమ్మును కూడా గ్రంథాలయాల అభివృద్ధికే అంద జేశారు. హైదరాబాద్ లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, హనుమకొండలోని రాజరాజ నరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం కూడా ఆయన అభివృద్ధి చేసినవే. వీటిలో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం నిజాం పాలిత తెలుగు ప్రాంతంలోని తొలి తెలుగు గ్రంథాలయంగా చారిత్రిక ప్రశస్తి పొందింది. ఆ రోజుల్లో గ్రంథాలయాలు నడ పడం అంత సులభమైన పనికాదు. నాటి ప్రభుత్వ దృష్టిలో గ్రంథాలయా లంటే విప్లవ కేంద్రాలే. అయినా పాలకులతో ఉత్తరాల ద్వారా అను మతులు పొందారు. 4వ ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లా సిరి సిల్లలో 1935 సంవత్సరం జనవరి 26, 27, 28 తేదీలలో జరిగింది. గద్దె నెక్కించడమేకానీ తాను ఎక్కే స్వభావం హనుమంతరావులో లేదు. సభ్యులు పట్టుపట్టాక, పంతులు అధ్యక్ష పీఠం వహించక తప్పలేదు. అప్పుడే అక్కడే జరిగిన మహిళా సభకు పంతులు అర్ధాంగి అధ్యక్షత వహించారు. భర్త, మరొక వైపు భార్య ఒకేసారి ఒక స్థలంలో జంటగా సాగుతున్న ఆంధ్ర మహా సభకు, ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహించడం అపూర్వం, అపురూపం. మాడపాటి షష్టి పూర్తి ఉత్సవం 1946 ఫిబ్రవరిలో రెడ్డి హాస్టల్ ఆవరణలో మహావైభవోపేతంగా జరిగింది. దీనికి రాజ్ బహదూర్ వెంకట్రామి రెడ్డి ఆహ్వాన సంఘాధ్యక్షులు కొండా వెంకటరంగా రెడ్డి కార్యదర్శి. ఇందులో పంతులు కు తులాభారం జరుపగా, సంబంధి త రూ.6400 డబ్బును ఆయన మహిళా కళాశాలకు విరాళంగా ఇచ్చారు. హనుంతరావు బాలికల కోసం నారాయణ గూడలో స్థాపించి న పాఠశాల ఆయన స్మారక కళాశాలగా నడుస్తున్నది. బూర్గుల ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంతులు ఉస్మానియా కు శాశ్వత సెనెటు సభ్యులుగా నియమితులైనారు. తరువాత నాలుగేళ్ళు సిండికేటు సభ్యులుగా ఉన్నారు. భారత దేశములో ప్రప్రథమ బాలికల పాఠశాలలో ఒకటైన మాడపాటి హనుమంత రావు బాలికోన్నత పాఠశాల హైదరాబాదులో నారాయణగూడలో స్థాపించాడు. బాలికల కోసం ఆయన ఎన్నో పాఠశాలలను నెలకొల్పారు. ఆయన విద్యా రంగానికి చేసిన సేవలను పురస్క రించుకొని ఉస్మానియా విశ్వ విద్యాలయం 1956లో డాక్టరేటు బిరుదు నిచ్చి సత్కరించింది. 1955లో కేంద్ర ప్రభుత్వం 'పద్మ భూషణ' బిరుదు ప్రసాదించింది. ఆ బిరుదు పొందిన తెలుగు వారిలో ఆయనే ప్రథములు. అనారోగ్య కారణాలతో ఢిల్లీ వెళ్ళలేక పోగా, మరుసటి సంవత్సరం రాష్ట్రపతి డా.బాబు రాజేంద్రప్రసాద్ హైదరా బాద్ విచ్చేసినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో స్వహస్తాలతో మాడపాటికి 'పద్మ భూషణ్' బహూకరించారు. మాడపాటి మంచి కవి, రచయిత. మొత్తం పదమూడు కథలు రాశారు. వీటిలో హృదయశల్యం, రాణీసారందా, ముసలిదాని ఉసురు, నేనే, అగ్ని గుండం, నాడు నీ పంతం, నేడు నా పంతం, ఆత్మార్పణం, తప్పు, ఎవరికి, విధి ప్రేరణం అనే కథలు 'మల్లికాగుచ్ఛం' పేరుతో 1911 లో పుస్తక రూపం దాల్చాయి. మాడ పాటికి రచయితగా శాశ్వత కీర్తిని అందించిన గ్రంథం 'తెలంగాణ ఆంధ్రోద్యమం'. రాష్ట్రానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత 1951లో హైదరాబాద్ నగర పాలక సంఘానికి పంతులుగ తొలి మేయరుగా ఎన్నికయ్యారు. ఆ పదవికి మూడు సార్లు ఎన్నికవుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ అధ్యక్షునిగా ఆయన ఆరేళ్ళు పదవిలో ఉండి, ఉన్నత ఆదర్శాలతో సభ్యులందరికి మన్ననలు పొందారు. మాడపాటి దూరదృష్టి, స్వార్థ రాహిత్యం, క్రమశిక్షణ, నిర్వహణలో దక్షత వంటివి కలిగిన వ్యక్తి.

# 91.74కు చేరిన రూపాయి



**ముంబై :** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ చరిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఇవాళ ట్రేడింగ్‌లో రూపాయి భారీగా నష్టపోయి, ఒక దశలో 91.74 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠాన్ని నమోదు చేసింది. మార్కెట్‌లో నెలకొన్న పలు ప్రతికూల పరిణామాల మధ్య ఒక్కరోజే 77 పైసల మేర విలువను కోల్పోయింది. నిన్న 90.97 వద్ద ముగిసిన రూపాయి, ఇవాళ ఉదయం 91.05 వద్ద బలహీనంగా ప్రారంభమైంది. ట్రేడింగ్ సాగుతున్న కొద్దీ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో రూపాయి విలువ అంతకంతకూ దిగజారింది. బంగారం, వెండి దిగుమతులు పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఈఎఎలు) దేశీయ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను భారీగా ఉపసంహరించుకోవడం పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది.మరోవైపు అమెరికా, యూరప్ మధ్య వాణిజ్య యుద్ధ భయాలు, గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునేందుకు అమెరికా ప్రయత్నిస్తోందన్న వార్తలు వంటి అంతర్జాతీయ అంశాలు కూడా రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. వీటికి తోడు దేశీయ స్టాక్‌మార్కెట్లు నష్టాల్లో కొనసాగడం రూపాయి విలువను మరింత బలహీనపరిచిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

### 3వ రోజు నష్టాల మార్కెట్టే

అంతర్జాతీయంగా పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు నష్టాల్లో ముగిశాయి. బుధవారం నాటి ట్రేడింగ్‌లో అమ్మకాల ఒత్తిడి అధికంగా కనిపించింది. బీఎస్ఈ సెన్సెక్స్ 270.84 పాయింట్లు క్షీణించి 81,909.63 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 75 పాయింట్లు నష్టపోయి 25,157.5 వద్ద ముగిసింది.మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, ఇది వరుసగా నాలుగో బలహీనమైన ముగింపు. నిఫ్టీకి 25,130 కీలక మద్దతు స్థాయి అని, ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 24,920?24,900 స్థాయిల వరకు పడిపోయే ప్రమాదం ఉందని వారు అంచనా వేస్తున్నారు. అయితే, ఇది ట్రెండ్ రివర్సల్ కాదని, మార్కెట్లలో కన్సాలిడేషన్ మాత్రమేనని అభిప్రాయపడ్డారు.రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ కెమికల్ ఇండెక్స్ 2.12 శాతం, నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ 1.66 శాతం, నిఫ్టీ బ్యాంక్ 1.02 శాతం చొప్పున నష్టపోయాయి. ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్, ఎల్‌డటీ వంటి హెవీవెయిట్ షేర్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. మరోవైపు, అల్ట్రాటెక్ సిమెంట్, అదానీ పోర్ట్స్, ఇండిగో వంటి షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు భారీ పతనం నుంచి కొంత కోలుకున్నాయి.ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా బలహీనపడింది. యూరప్, గ్రీన్‌లాండ్ మధ్య ఉద్రిక్తతలు, అమెరికా టారిఫ్ చర్యలపై ఆందోళనలతో రూపాయి 0.70 శాతం తగ్గి 91.60 వద్ద ట్రేడ్ అయింది. బంగారం ధరలు పెరగడం కూడా రూపాయిపై అదనపు భారం మోపింది. సమీప భవిష్యత్తులో రూపాయి 90.90 నుంచి 92 మధ్య కదలాడవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# కర్ణాటకపై కాషాయ పార్టీ గురి

మహారాష్ట్ర పురపాలక ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన కాషాయ పార్టీ ఇప్పుడు కర్ణాటకపై గురి పెట్టింది. దేశ వాణిజ్య రాజధాని ముంబై మహానగరంలో 28 ఏళ్ల శివసేన ఆధిపత్యానికి ముగింపు పలికిన కమలం పార్టీ బెంగళూరులో నూ పాగా వేయాలని ప్లాన్ చేస్తోంది. మరో నాలుగైదు నెలల్లో జరగనున్న స్థానిక ఎన్నికలకు కసరత్తు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా ముగ్గురు కీలక నేతలకు బెంగళూరు ఎన్నికల బాధ్యతలు అప్పగించింది. బీజేపీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి రాంమాధవ్‌ను గ్రేటర్ బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికల ఇంచార్జిగా నియమించింది. రాజస్థాన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు సతీశ్ పూనియా, మహారాష్ట్ర ఎమ్మెల్యే సంజయ్ ఉపాధ్యాయ్‌లను సహ-ఇంచార్జిలుగా బాధ్యతలు అప్పగిస్తూ నూతన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించిన అధికార ప్రకటనను జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ ప్రధాన కార్యాలయం ఇంచార్జి అర్జున్ సింగ్ మంగళవారం విడుదల చేశారు.

### అసెంబ్లీ సమరం లాంటిదే..

గ్రేటర్ బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికల ఇంచార్జిగా తనను నియమించినందుకు నితిన్ నబీన్‌కు 'ఎక్స్'లో రాంమాధవ్ ధన్యవాదాలు తెలిపారు. మే నెలలో జరగనున్న బృహద్ బెంగళూరు మహానగర్ పాలికె (బీబీఎంపీ) ఎన్నికల్లో తమ పార్టీని గెలిపించేందుకు అన్నివిధాల ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. 90 లక్షల ఓటర్లు, 369 వార్డులు ఉన్న బీబీఎంపీ ఎన్నికలు.. అసెంబ్లీ సమరం కంటే తక్కువేమీ కాదన్నారు. కర్ణాటక బీజేపీ నాయకులు, స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, బెంగళూరు నగర నేతలు, కార్యకర్తలతో సమావేశం కోసం ఎదురుచూస్తున్నట్టు వెల్లడించారు.



### ఎన్నికలకు సిద్ధం: సీఎం

బెంగళూరు కార్పొరేషన్‌తో పాటు స్థానిక సంస్థల ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇంతకుముందే ప్రకటించారు. జూన్ 30లోపు బీబీఎంపీ ఎన్నికలు జరపాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఆయనీ ప్రకటన చేశారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం నిర్ణీత గడువులోగా ఎన్నికలు నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం, బెంగళూరు నగరాభివృద్ధి మంత్రి డీకే శివకుమార్ (ఙఖ ాష్ట్రఅఝుఎబఝితీ) తెలిపారు. బెంగళూరు కార్పొరేషన్ ఎన్నికల్లో తమదే విజయమని విశ్వాసం వ్యక్తం చేశారు. బీజేపీ-జేడీఎస్ పొత్తు గురించి తమకు బెంగలేదని సిద్ధరామయ్య, శివకుమార్ అన్నారు.

# ఉదయ్ నిధి వ్యాఖ్యలు తప్పే...

**చెన్నై :** మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ జనవరి 20, 2023న సనాతన ధర్మంపై తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యల విషయంలో అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ వివాదానికి సంబంధించి బీజేపీ నాయకుడు అమిత్ మాలవీయపై నమోదైన ఎఫ్ఐఆర్ (ఈఎఫ్)ను కొట్టివేస్తూ కోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ గతంలో చేసిన వ్యాఖ్యలు విద్వేషపూరిత ప్రసంగం కిందికే వస్తాయని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యాఖ్యలను విమర్శిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన బీజేపీ నేత అమిత్ మాలవీయపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కోర్టు కొట్టివేసింది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి 80 శాతం జనాభా అనుసరించే ధర్మాన్ని లక్ష్యంగా చేసుకోవడం సరికాదని, ఉదయనిధి వాడిన నిర్మూలన అనే పదం ఒక జాతి లేదా సమూహాన్ని అంతం చేయాలనే నరమేధం వంటి అర్థాన్ని స్ఫురిస్తుందని జస్టిస్ ఎస్. శ్రీమతి తన తీర్పులో పేర్కొన్నారు.ఉదయనిధి స్టాలిన్ ప్రసంగాన్ని లోతుగా విశ్లేషించిన న్యాయస్థానం, అంతం చేయడం లేదా నిర్మూలించడం అనే పదాలు ప్రస్తుతం ఉనికిలో ఉన్న ఒక వ్యవస్థను పూర్తిగా లేకుండా చేయడాన్ని సూచిస్తాయని అభిప్రాయపడింది. సనాతన ధర్మం అనేది ఒక మతం అయితే, దాని నిర్మూలన పిలుపు మత విధ్వంసం అవుతుందని, అది సంస్కృతిని నాశనం చేయడమే అని కోర్టు వ్యాఖ్యానించింది. ఉదయనిధి ప్రసంగం వల్ల బాధితుడైన ఏ సనాతనీ అయినా దానిని ప్రశ్నించే హక్కు కలిగి ఉంటారని, అమిత్ మాలవీయ చేసిన పోస్ట్ కేవలం ఒక ప్రతిస్పందన మాత్రమేనని కోర్టు సమర్థించింది.భారతీయ సంస్కృతిలో సనాతన ధర్మం ప్రాముఖ్యతను వివరిస్తూ, మహాత్మా గాంధీ



వంటి మహనీయులు కూడా తనను తాను సనాతని హిందువు గా పదేపదే ప్రకటించుకున్నారని కోర్టు గుర్తు చేసింది. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులతో పోల్చడం ద్వారా ఒక వర్గం ప్రజల పట్ల విద్వేషాన్ని రగిల్చే ప్రయత్నం జరిగిందని కోర్టు తప్పుపట్టింది. హిందూ ధర్మంపై గత వంద ఏళ్లుగా ద్రావిడ పార్టీలు నిరంతరం దాడులు చేస్తున్నాయని, విద్వేష ప్రసంగాలు ప్రారంభించిన వారిని వదిలేసి, వాటిని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని న్యాయమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో అమిత్ మాలవీయపై విచారణను కొనసాగించడం వల్ల ఆయనకు కోలుకోలేని నష్టం వాటిల్లుతుందని, ఇది కేవలం రాజకీయ ప్రేరేపితమైన కేసు అని హైకోర్టు తేల్చి చెప్పింది. మంత్రి ప్రసంగంలోని అంతరార్థాన్ని ప్రశ్నించడం నేరం కాదని, వాస్తవానికి ఆ ప్రసంగమే సెక్షన్ 153ం వంటి నిబంధనల కిందకు వస్తుందని పేర్కొంది.

## మాపై అధిక పన్ను విధించండి



ప్రపంచంలోని 400 సూపర్ రిచ్ (అత్యంత సంపన్నులు) వ్యాపారవేత్తలు ఒక ఆసక్తికరమైన ప్రతిపాదన చేశారు. తమపై అధిక పన్నులు విధించాలని వారు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సుకు ప్రముఖ వ్యాపారవేత్తలు హాజరవుతారు. ఈ నేపథ్యంలో, అక్కడకి వచ్చిన 400 మంది సంపన్నులు తమపై భారీగా పన్ను విధించాలంటూ పిలుపునివ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 24 దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సూపర్ రిచ్ బృందం 'టైమ్ టు విన్' పేరిట సంతకాలు చేసిన బహిరంగ లేఖను విడుదల చేసింది. మార్క్ రుఫలో, బ్రియాన్ ఎనో, అబిగైల్ డిస్నీ వంటి సూపర్ రిచ్ ఈ మేరకు డిమాండ్ చేస్తూ బహిరంగ లేఖ రాశారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అసమానత్వాలు పెరుగుతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సంపన్నులకు, సామాన్యులకు మధ్య అంతరం నానాటికి పెరుగుతోందని తెలిపారు. ఆర్థిక అసమానతలను రూపుమాపడానికి సూపర్ రిచ్‌పై అధిక పన్ను విధించాలని వారు పేర్కొన్నారు. సంపన్నులు ప్రజా జీవితాన్ని, రాజకీయ వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరచడమే కాకుండా, ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. అత్యంత సంపన్నులు కొందరు ప్రజాస్వామ్యాలను కొనుగోలు చేశారని, ప్రభుత్వాలను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ప్రపంచంలో అసలైన ప్రజాస్వామ్య వ్యవస్థలను తాము కోరుకుంటున్నామని వారు పేర్కొన్నారు. అధిక పన్నులు విధించడం వల్ల సంపన్నుల జీవన ప్రమాణాలు పడిపోవని గుర్తుంచుకోవాలని అన్నారు. పైగా ఆ నిధులు సామాన్యుల ఆరోగ్యం, విద్య వంటి వాటికి వినియోగించడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. వారు విడుదల చేసిన లేఖ ప్రకారం, ప్రపంచంలోని 1 శాతం సంపన్నుల వద్ద 95 శాతం కంటే ఎక్కువ సంపద ఉంది. జీ20 దేశాలలో నిర్వహించిన ఒక సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. సంపన్నులు రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారని 77 శాతం మంది భావించగా, కొందరి వద్దే అత్యధిక సంపద ఉండటం ప్రజాస్వామ్యానికి ముప్పుగా 62 శాతం మంది భావిస్తున్నారని సర్వేలో తేలింది.

## గ్రీన్‌ల్యాండ్ మంచు కింద అమెరికా రహస్య స్థావరం...



ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా అత్యంత రహస్యంగా నిర్మించిన సైనిక స్థావరం ఒకటి దశాబ్దాల తర్వాత మళ్లీ వెలుగులోకి వచ్చింది. గ్రీన్‌ల్యాండ్ మంచు పొరల కింద కూరుకుపోయిన 'క్యాంప్ సెంచరీ' అనే ఈ బేస్‌ను నాసా శాస్త్రవేత్తలు ఇటీవల రాడార్ స్కానింగ్‌లో అనూహ్యంగా గుర్తించారు. ఇది ఒక సాధారణ శాస్త్రీయ పరిశోధనలో భాగంగా జరిగిన ఆకస్మిక ఆవిష్కరణ కావడం విశేషం. ఈ ఏడాది ఏప్రిల్‌లో, నాసా శాస్త్రవేత్తలు గల్ఫ్‌స్ట్రీమ్ ××× విమానంలో ఉత్తర గ్రీన్‌ల్యాండ్‌పై ప్రయాణిస్తుండగా ఈ ఘటన జరిగింది. ఖాూఝాూ= అనే అధునాతన రాడార్ వ్యవస్థను పరీక్షిస్తున్నప్పుడు, పిటుఫిక్ స్పేస్ బేస్‌కు సుమారు 200 కిలోమీటర్ల దూరంలో మంచు కింద సహజత్వానికి భిన్నంగా, సరళ రేఖల్లో ఉన్న నిర్మాణాలను రాడార్ సిగ్నల్స్ పసిగట్టాయి. చారిత్రక మ్యాపులతో సరిపోల్చగా, అది 'క్యాంప్ సెంచరీ' అని నిర్ధారించుకున్నారు. 1959లో అమెరికా ఆర్మీ ఇంజినీర్లు ఈ బేస్‌ను నిర్మించారు. 'మంచు కింద నగరం' అని పిలిచే ఈ స్థావరం కోసం మంచులో 8 మీటర్ల లోతున సొరంగాలు తవ్వి, పైన మంచుతో కప్పేశారు. సుమారు 200 మంది సిబ్బంది నివసించేలా ల్యాబొరేటరీలు, నివాస గృహాలు నిర్మించారు. దీనికి పోర్టబుల్ న్యూక్లియర్ జనరేటర్‌తో విద్యుత్‌ను అందించేవారు. వాస్తవానికి ఇది 'ప్రాజెక్ట్ ఐస్‌వర్మ్' అనే రహస్య ప్రణాళికలో భాగం. సోవియట్ యూనియన్‌ను లక్ష్యంగా చేసుకుని అణు క్షిపణులను ఇక్కడ దాచి ఉంచాలన్నది అమెరికా వ్యూహం. అయితే, మంచు కదలికలు ఊహించిన దానికంటే వేగంగా ఉండటంతో ఈ ప్రాజెక్టు సురక్షితం కాదని భావించి, 1967 నాటికి దీన్ని పూర్తిగా వదిలేశారు. కాలక్రమేణా మంచు పేరుకుపోవడంతో, ప్రస్తుతం ఈ స్థావరం అవశేషాలు సుమారు 30 మీటర్ల (100 అడుగులు) లోతులో కూరుకుపోయి ఉన్నాయి. అణు రియాక్టర్‌ను తొలగించినప్పటికీ, రసాయనిక, జీవ, రేడియోధార్మిక వ్యర్థాలు అక్కడే మిగిలిపోయాయి. వాతావరణ మార్పులతో మంచు కరుగుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో ఈ వ్యర్థాలు బయటపడి పర్యావరణానికి ముప్పుగా మారవచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సరిహద్దులో కాల్పులకు తెగబడ్డ పాక్.. ధీటుగా జవాబిచ్చిన భారత్

దాయాది దేశం పాకిస్తాన్.. భారత సరిహద్దులో కాల్పులకు పాల్పడింది. మంగళవారం రాత్రి పాక్ దళాలు.. భారత సరిహద్దుపైకి రెండు రౌండ్ల కాల్పులు జరిపాయి. వెంటనే అప్రమత్తమైన భారత దళాలు కూడా ఎదురు కాల్పులకు దిగడంతో పాక్ తోక ముడిచింది. ఈ ఘటన కాశ్మీర్ ప్రాంతం, కుప్వారా జిల్లా, కేరన్ సెక్టార్లో జరిగింది. ఈ సరిహద్దు ప్రాంతంలో భద్రతను మరింత పెంచేందుకు 6 రాష్ట్రీయ రైఫిల్స్ కు చెందిన సిబ్బంది రాత్రిపూట హై టెక్నాలజీ సీసీ కెమెరాల్ని ఏర్పాటు చేస్తున్నారు. శత్రువులు చొచ్చుకొచ్చే వీలున్న కొన్ని బ్లైండ్ స్పాట్స్ లో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించి సామగ్రి తరలించి, వాటిని అమరుస్తుండగా పాక్ సైన్యం తేలికపాటి ఆయుధాలతో రెండు రౌండ్ల కాల్పులు జరిపింది. సీసీ కెమెరాలు అమర్చే పనుల్ని అడ్డుకునే ఉద్దేశంతో పాక్ ఈ పని చేసినట్లు తెలుస్తోంది. అయితే, వెంటనే భారత భద్రతా బలగాలు ధీటుగా స్పందించాయి. పాక్ వైపు సింగిల్ షాట్స్ కాల్పులకు దిగింది మన సైన్యం. దీంతో పాకిస్తాన్ ఆర్మీ ఆగిపోయింది. కాగా.. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హానీ కలగలేదని రక్షణ అధికారులు తెలిపారు. మరోవైపు ఇది చాలా దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ప్రాంతంలో సైన్యం కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేస్తోంది ఇండియన్ ఆర్మీ. మన సైన్యం దృష్టి మళ్లించేందుకే పాక్ ఈ కాల్పులు జరిపిందా అనే అనుమానంతో ముందు జాగ్రత్త చర్యగా ఈ ప్రాంతాన్ని సైన్యం పూర్తిగా గాలిస్తోంది. పైగా.. రాబోయే రిపబ్లిక్ డేను దృష్టిలో ఉంచుకుని భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.

ధర్మఘంట

# హైదరాబాద్‌లో ఫాలోఅప్ సదస్సు

-మొదటిపేజీ తరువాయి

అయ్యారు. హైదరాబాద్ బ్లైజ్ ఆర్ అండ్ డీ సెంటర్ విస్తరణకు తెలంగాణ ప్రభుత్వంతో ఆయన ఎంవోయూ కుదుర్చుకున్నారు.

రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు తెలంగాణ రైజింగ్-2047 విజన్‌ను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటన కొనసాగుతోంది. పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలతో బిజీగా గడిపారు. రాష్ట్రంలో పెట్టుబడులకు పలుసంస్థలు ముందుకొచ్చాయి. డీఐ పైపుల సంస్థ రష్మీ గ్రూప్ రూ.12,500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. స్టీల్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో 12 వేల వరకు ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వం తెలిపింది. రష్మీ గ్రూపు ఆసియాలోని 40 దేశాలు, యూరప్, ఆఫ్రికా, ఉత్తర, దక్షిణ అమెరికా దేశాల్లో కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

క్లీన్ ఎనర్జీ రంగంలో స్లోవాకియాకు చెందిన ఐక్యూ క్యాపిటల్, భారత్‌కు చెందిన గ్రీన్ హౌస్ ఎన్విరో సంయుక్త భాగస్వామ్యంలో ఏర్పాటైన న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ రూ. 6 వేల కోట్ల పెట్టుబడితో స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ (ఎస్ఎంఆర్) ఆధారిత విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధికి ముందుకొచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో న్యూక్లర్ ప్రొడక్ట్స్ సంస్థ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) సమర్పించింది.

హైదరాబాద్‌లో స్టేడియాల అప్‌గ్రేడేషన్‌కు టాటా గ్రూప్ సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్‌లో టాటా గ్రూప్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్‌లో స్టేడియాల అభివృద్ధికి సహకరించాలని టాటా గ్రూప్ ఛైర్మన్‌ను సీఎం కోరారు. మూసీ నది పునరుజ్జీవనంలో భాగస్వామ్యానికి రాష్ట్రంలో హోటళ్లు, రిసార్ట్స్ ఏర్పాటుపై చంద్రశేఖరన్ ఆసక్తి చూపారు. రాష్ట్రంలో కొత్త మానుఫాక్చరింగ్ యూనిట్లు ఏర్పాటు కోసం చర్చలు జరిపారు. విజన్2047 లక్ష్యాలు పెట్టుబడులకు ఉన్న అనుకూల విధానాలను ఈ సందర్భంగా టాటా గ్రూప్ ఛైర్మన్‌కు సీఎం వివరించారు.

బీర్ల తయారీ యూనిట్ల విస్తరణ : రాష్ట్రంలోని బీర్ల తయారీ యూనిట్లను ఏబీ ఇన్‌బెవ్ సంస్థ విస్తరించనున్నట్లు దావోస్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో వ్యాపారం నిర్వహిస్తున్న ఏబీ ఇన్‌బెవ్ రాష్ట్రంలో రెండు బీర్ల తయారీ యూనిట్లను నడుపుతోంది. రాష్ట్రంలో సుమారు 600 మందికి ఉపాధి కల్పిస్తోంది. సర్క్యులర్ వాటర్ వినియోగం, మహిళా సాధికారత, విద్య, నైపుణ్యాభివృద్ధి కోసం సీఎస్ఆర్ వ్యయాలు వంటి అంశాల్లో రాష్ట్రంతో కలిసి పనిచేసే అవకాశాలపై కూడా చర్చించారు. స్థిరమైన పాలసీలు, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, వ్యాపార సౌలభ్యంతో తెలంగాణలో పెట్టుబడిదారుల్లో దీర్ఘకాలికంగా విశ్వాసం పెరుగుతోందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డి బృందంతో న్యూక్లర్ సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2047 నాటికి నెట్‌జీరో అభివృద్ధి లక్ష్యాన్ని సాధించడంలో సుస్థిర అభివృద్ధే తెలంగాణకు ముఖ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సుమారు 300 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్ ప్రాజెక్టును ఏర్పాటు చేసే అవకాశాలను న్యూక్లర్ సంస్థ పరిశీలిస్తోంది. సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఐక్యూ క్యాపిటల్ గ్రూప్ ఛైర్మన్ డా. జాన్ బాబిక్, గ్రూప్ సీఈఓ, డైరెక్టర్ అనిల్ కుమార్ బావిసెట్టి, గ్రీన్ హౌస్ ఎన్విరో సీఈఓ , డైరెక్టర్ మొలుగు శ్రీపాల్ రెడ్డి, స్లోవాక్ రిపబ్లిక్ కాన్సుల్ మాటుస్ జెమెస్ పాల్గొన్నారు.

### సర్గడ్ సంస్థ ఎంవోయూ

విమానయాన రంగంలో పేరొందిన అమెరికాకు చెందిన సర్గడ్ సంస్థ రూ.వెయ్యి కోట్లతో తెలంగాణలో మెయింటెనెన్స్ అండ్ రిపేర్ యూనిట్(ఎమ్ఆర్‌వో) నెలకొల్పనుంది. రాబోయే 3 నుంచి 5 ఏళ్లలో దశలవారీగా వెయ్యి కోట్ల వరకు పెట్టుబడులు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో సర్గడ్ సంస్థ ఎంవోయూ కుదుర్చుకుంది. దావోస్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో సర్గాడ్ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీనివాస్ తోట భేటీ అయ్యారు. ఏరోస్పేస్, రక్షణ, ఆటోమొబైల్, అడ్వాన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో అనుభవం ఉన్న సర్గాడ్ సంస్థ రాష్ట్రంలో విమానాల నిర్వహణ, మరమ్మత్తులు, పునరుద్ధరణ కేంద్రం ఏర్పాటు చేయాలన్న ఆసక్తిని సంస్థ ప్రతినిధులు వ్యక్తం చేశారు.

### అత్యధిక ప్రోత్సాహకాలు

వరంగల్, ఆదిలాబాద్‌లలో రెండు కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తున్నామని , ఈ ప్రాంతాల్లో ఏదైనా ఒక చోట ఎంఆర్వో కేంద్రం ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సంస్థ ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. వరంగల్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అత్యధిక ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఏడాది జులై నెలలో హైదరాబాద్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఫాలో-అప్ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. దావోస్‌లో జరిగిన జాయిన్ ది రైజ్ కార్యక్రమంలో సీఎం ప్రతిపాదనకు గ్లోబల్ బిజినెస్ లీడర్లు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. ఈ రోజుల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వ్యాపార వాణిజ్య నిర్ణయాలకు ఒక సంవత్సరం చాలా ఎక్కువ సమయమని ముఖ్యమంత్రి అన్నారు.

### ఆకర్షణగా చిరంజీవి

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి తో కలిసి ప్రముఖ నటుడు మెగాస్టార్ చిరంజీవి పాల్గొన్నారు. చిరంజీవి ఆ దేశంలోని జ్యూరిక్‌లో ఉన్నారని తెలుసుకున్న సీఎం సదస్సుకు రావాలని వెంటనే ఆహ్వానించారు. దీంతో ఆయన సదస్సుకు హాజరయ్యారు. వేదికపై ఆవిష్కరించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్‌ను చిరంజీవి ఆసక్తిగా వీక్షించారు. అంతర్జాతీయ వేదికపై తెలంగాణ అభివృద్ధి దృక్పథాన్ని ఈ డాక్యుమెంట్ ప్రతిబింబించింది.

అనంతరం చిరంజీవితో సీఎం రేవంత్ మాట్లాడుతూ తమ కుటుంబసభ్యులతో కలిసి మన శంకరవరప్రసాద్ గారు సినిమా వీక్షించానని, ఎంతో ఆస్వాదించానని చెప్పారు. ఈ సందర్భంగా చిరంజీవికి ఆ చిత్రం పట్ల సీఎం అభినందనలు తెలిపారు. చిరంజీవి తన కుటుంబంతో కలిసి విహారయాత్ర కోసం స్విట్జర్లాండ్ వెళ్లారు. ఈ సమయంలోనే దావోస్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సు జరుగుతుండటంతో సీఎం రేవంత్‌రెడ్డి చిరంజీవిని అక్కడికి ఆహ్వానించారు.

### భారత సీఈవోలకు ట్రంప్ విందు

దావోస్ పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేయనున్న ప్రత్యేక విందుకు ఏడుగురు భారతీయ సీఈఓలకు ఆహ్వానం అందినట్లు సమాచారం. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వివిధ దేశాధినేతలు, వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు తరలి వస్తున్నారు. ఆరేళ్ల తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ సదస్సులో పాల్గొననుండటం విశేషం. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన పాల్గొనడం ఇది మూడోసారి.ట్రంప్ ఏర్పాటు చేయనున్న ఈ విందుకు టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ మిట్టల్, విప్రో సీఈఓ శ్రీని పల్లియా, ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్, బజాజ్ ఫిన్ సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్, మహీంద్రా గ్రూపు సీఈఓ అనీశ్ షా, జుబిలెంట్ భర్తియా గ్రూప్ సహ వ్యవస్థాపకుడు హరి భర్తియాలు హాజరయ్యే అవకాశం ఉంది. ప్రపంచ ఆర్థిక సదస్సుకు 130 దేశాల నుంచి 3 వేలకు పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తివేయటం ఖాయం

-మొదటిపేజీ తరువాయి

తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు జరుగుతాయి. జిల్లా పరిషత్ ఎన్నికలు పెట్టే అలోచనలో ప్రభుత్వం లేదు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత అసెంబ్లీ ఎన్నికలేనన్నారు. మున్సిపల్ ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నామని.. శివరాత్రి లోపలే మున్సిపల్ ఎన్నికలు ముగిస్తారని కేటీఆర్ పేర్కొన్నారు.

### జిల్లాలను ఎత్తేసే ప్రయత్నం..

బస్తీబాట కార్యక్రమంతో క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకుంటున్నాం . పదేళ్లలో మేము చేసినవి.. కాంగ్రెస్ రెండేళ్లుగా చేయనివి గుర్తు చేస్తున్నామని కేటీఆర్ తెలిపారు. సర్వేలు, అభ్యర్థి బలాలు ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. ఎన్నికల్లో జనసేన సహా ఎవరైనా పోటీ చేయొచ్చు. క్షేత్రస్థాయిలో బలముంటే తప్ప.. స్థానిక ఎన్నికల్లో గెలవటం ఈజీ కాదు. జిల్లాలను ఎత్తేసే ప్రయత్నం జరుగుతుంది. జనగాం, నారాయణ పేట, వనపర్తి, సిద్దిపేట, సిరిసిల్ల, నిర్మల్, మంచిర్యాల జిల్లాలను ఎత్తేస్తారనే ఆందోళన ఉంది .జిల్లాలు ఉండాలా.. పోవాలా..? అనేది మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే జిల్లాలు ఎత్తివేయటం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. స్థానిక సమస్యల ఆధారంగానే మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేస్తారని.. ఫార్ములా ఈ, ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆధారాలు చూపలేకపోయారు. ఫార్ములా ఈ కేసులో దోషులుగా చెప్తోన్న గ్రీన్ కోతో దావోస్లో రేవంత్ చర్చలు జరుపుతున్నారు . బొగ్గు కుంభకోణంపై సీబీఐ విచారణ కోరే దమ్ముందా..? రేవంత్ రెడ్డి చేస్తోన్న తుగ్లగ్ పనులతో జంట నగరాల అస్థిత్వం దెబ్బ తింటుంది . సినిమా టిక్కెట్లు పెంచేది లేదని యూ టర్న్ తీసుకున్నారు. మున్సిపాలిటీల వారీగా బీఆర్ఎస్ ఇంచార్జ్‌లు నియమిస్తున్నాం. మున్సిపల్ ఎన్నికల కోసం ప్రతీ ఉమ్మడి జిల్లాకు ఇంచార్జ్ నియమించామని.. 8 ఉమ్మడి జిల్లాల సన్నాహక సమావేశాలు పూర్తి చేశామని పేర్కొన్నారు.

### జిల్లాల అంశమే ప్రధాన అస్త్రంగా మున్సిపల్ ఎన్నికల ప్రచారం..

జిల్లాల తొలగిస్తారని ప్రచారం జరుగుతుంది. దీనితో చాలా చోట్ల ప్రజల్లో ఆందోళన ఉన్నదని కేటీఆర్ అన్నారు. కొత్త జిల్లాలు చేసిన పట్టణాల్లో జిల్లాలు ఎత్తేసారు అనే భావనలో ఉన్నారు. ప్రజలు అంతా కూడా ఆందోళనలో ఉన్నారు. జిల్లాల అంశాన్ని ప్రధాన అస్త్రంగా మున్సిపల్ ఎన్నికలలో ప్రచారం చేస్తామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఎన్నికల కో ఆర్డినేటర్లను పెడుతున్నాం.స్థానిక నాయకులు ఎవరికి టికెట్ ఇవ్వాలని డిసైడ్ చేస్తారు.ఎన్నికలు లేని నాయకులు, ఎమ్మెల్యేలను మున్సిపల్ ఎన్నికల దగ్గర ఇంచార్జ్ లుగా నియమిస్తాం.లోకల్ ఎన్నికలు కాబట్టి లోకల్ వాళ్లే ప్రచారం చేస్తారు.స్థానికత ఆధారంగా ప్రచారం నిర్వహించనున్నట్టు కేటీఆర్ వెల్లడించారు.స్థానిక సమస్యలను ఎజెండాగా ముందుకు తీసుకొని ముందుకు వెళ్తాం. ముఖ్యమంత్రి హార్వర్డ్ వెళ్లి మంచిగా తిరిగి వస్తారు అనుకుంటున్నా. పఠాన్ చెరువు ఎమ్మెల్యే కూడా మా బీఆర్ఎస్ పార్టీనే గెలిపించాలి అంటున్నారు. మేము కూడా అదే అంటున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.పార్టీ మారిన తర్వాత ఆయా నియోజకవర్గాలలో వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాటం చేస్తున్నారు. సింగరేణిపై మంత్రులు మాట్లాడడం లేదు.సింగరేణిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి.ఒక్క వైపు ఫార్ములా ఈ అంటాడు. అందులో ప్రూవ్ చెయ్యి.ఇక్కడ ఫార్ములా ఈపై విచారణ అంటాడు. అక్కడ దావోస్‌లో గ్రీన్ కోతో చర్చలు జరుపుతున్నారు. ఒక్క దగ్గర మంచోళ్ళు అవుతారు. మరో దగ్గర చెడ్డోళ్లు అవుతారు ఎలా..? హైద్రాబాద్ కార్పొరేషన్ ఒక్కటే ఉండే మేమేం మార్చలేదు. రేవంత్ రెడ్డి జవాబు చెప్పాలి. రేవంత్ రెడ్డి తుగ్లక్, సమాధానం చెప్పే వరకు ఆయన వెంబడి పడుతాం.

### రేవంత్‌లో రాము, రెమో ఉన్నారు

రేవంత్‌లో రాము ఉన్నాడు.. రెమో ఉన్నాడని కేటీఆర్ అన్నారు. ఉదాహరణకు సినిమా టికెట్లు పెంచం అంటాడు , మరోవైపు సినిమా టికెట్లు పెంచుతూ జీవో ఇస్తారు. సర్వాయి పాపన్న పేరు మీద జనగామ జిల్లా చేస్తాం అన్నారు కానీ ఇప్పుడు మళ్ళీ అదే జిల్లాను తొలగిస్తాం అన్నారు. అందుకే ఆయన రాము రెమో అని అన్నానని చెప్పుకొచ్చారు కేటీఆర్.

# కాళేశ్వరం రిపేర్లు సాధ్యమేనా..

**కరీంనగర్ :** కాళేశ్వరం లో బ్యారేజీల మరమ్మతులు ఇప్పట్లో జరిగేలా కనిపించడం లేదు. అసలు జరుగుతాయో లేదో కూడా అర్థం కావడం లేదు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లో లోపాలు బయటపడ్డాయి. వీటికి మరమ్మతులు చేయడానికి నిర్మాణ సంస్థలు ముందుకు రావడం లేదు. పైగా ఇప్పుడు ఆ సంస్థలు సర్కార్ తోనే న్యాయపోరాటానికి దిగుతున్నాయి.కాళేశ్వరం లో బ్యారేజీలను నిర్మించారు. అయితే వీటిని రిజర్వాయర్లుగా ఉపయోగించడం వల్లే ఈ సమస్య ఏర్పడిందని నిర్మాణ సంస్థలు వాదిస్తున్నాయి. మరోవైపు బ్యారేజీల డిజైన్ల లోనే లోపాలు ఉన్నాయని.. బ్యారేజీలను రిజర్వాయర్లుగా ఉపయోగించడం వల్లే కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో లోపాలు బయటపడ్డాయని.. మాజీ ముఖ్యమంత్రి నిర్ణయాల వల్ల ఇవన్నీ జరిగాయని వివిధ నివేదికలు బయటపెట్టాయి. ఇదే విషయాన్ని నిర్మాణ సంస్థలు బలంగా వాదిస్తున్నాయి. " ఇందులో మా బాధ్యత లేదు. మేము చేసిన తప్పు కూడా లేదు. ప్రభుత్వం క్రిమినల్ కేసులు పెడితే లొంగేది లేదు. మేడిగడ్డ నుంచి మొదలు పెడితే సుందిళ్ల వరకు మరమ్మతు, పునరుద్ధరణ.. ఇలా ఏ పనులు చేయాలన్నా సరే కొత్తగా ఒప్పందాలు కుదుర్చుకోవాల్సిందేనని" నిర్మాణ సంస్థలు చెబుతున్నాయి.మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యం కావడంతో.. దానికి నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి కారణమని.. సొంత నిధులతో



ఆ బ్యారేజీకి మరమ్మతు చేయకపోతే క్రిమినల్ కేసులు పెడతామని ప్రభుత్వం హెచ్చరించింది. అంతేకాదు నోటీసులు కూడా పంపింది. మిగతా బ్యారేజీలు నిర్మించిన సంస్థలకు కూడా ప్రభుత్వం ఇదేవిధంగా నోటీసులు పంపించింది. మేడిగడ్డలో సమస్య తీవ్రత అధికంగా ఉంది. అన్నారం, సుందిళ్ల లో మాత్రం చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి.. అన్నారంలో గేట్ల నుంచి విడుదలయ్యే వరద విస్తరణకు.. ఇతర రక్షణ చర్యలు తీసుకుంటే బ్యారేజీ పూర్వస్థితికి వస్తుందని అధికారులు చెబుతున్నారు. సుందిళ్ల ప్రాంతంలో సీ పేజీ కట్టడి చేస్తే బ్యారేజీ వినియోగంలోకి వస్తుంది. మేడిగడ్డతోనే ప్రభుత్వానికి ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. దీనిని నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థ మీద క్రిమినల్ కేసులు పెట్టి.. బ్యారేజ్ కి సంబంధించిన పునరుద్ధరణ వ్యయం మొత్తం ఆ సంస్థ నుంచి రాబట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో జరిగిన అవకతవకలకు సంబంధించి ప్రభుత్వ నియమించిన జస్టిస్ పినాకి చంద్ర గోష్ కమిషన్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. దీనికంటే ముందు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం కూడా ఇదే విషయాన్ని ప్రకటించింది. అయితే బ్యారేజ్ లు నిర్మించిన సంస్థలు సర్కార్ కు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావడంతో అధికారులు తలలు పట్టుకున్నారు. మరోవైపు తుమ్మిడి హెట్టి వద్ద బ్యారేజ్ నిర్మించాలని ప్రభుత్వం భావిస్తోంది.కాళేశ్వరం లో బ్యారేజీల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కాగా, ప్రభుత్వం బ్యారేజీ నిర్మాణం పూర్తయిందని.. సర్టిఫికెట్లు జారీ చేసింది. డిఫెక్ట్ లయబులిటీ కాలం కూడా గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయింది. దీంతో నిర్మాణ సంస్థలతోనే బ్యారేజీలకు మరమ్మతులు చేయించే దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారని తెలుస్తోంది

## ఇంటి వద్దకే పోలీస్ అధికారి

-మొదటిపేజీ తరువాయి

రూపొందించింది. తెలంగాణ వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌వో)లు ఈఎస్‌వోపీని అనుసరించాలని సీఐడీ చీఫ్ చారుసిన్హా ఆదేశించారు.

### పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు

నేరం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే స్పందించి జీరో ఎఫ్ఐఆర్ సహా ఏ రూపంలోనైనా కేసు నమోదు చేయాలని భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) నిబంధనలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో బాధితుల గౌరవానికి, హక్కులకు భంగం కలిగించకుండా పోలీస్ సేవలందించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు సీఐడీ ప్రకటించింది. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని నిర్ణయించడం దేశంలోనే తొలిసారి కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఫోన్ కాల్‌తో ఇంటివద్దకే పోలీస్ అధికారి

కొన్ని ప్రత్యేక నేరాలు జరిగిన సమయంలో బాధితులు ఫోన్ చేసి సమాచారం ఇస్తే పోలీసులే వారి వద్దకు వెళతారు. ఫిర్యాదు స్వీకరించి కేసుకు సంబంధించిన విరాలను పోలీస్‌స్టేషన్‌కు పంపించి ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తారు. ఆ ఎఫ్ఐఆర్ కాపీని బాధితులకు అందజేస్తారు. అక్కడికక్కడే సాక్ష్యాల సేకరిస్తారు. దీనితో పాటు బాధితుల వాంగ్మూలం నమోదు వంటివి చర్యలు తీసుకుంటారు.

ఈ కేసుల్లో ఎస్‌వోపీ అమలు చేస్తారు :

మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు

శారీరక దాడులు

పోక్సో చట్టం కేసులు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కేసులు

బాల్య వివాహాల నిషేధ చట్టం

ర్యాగింగ్ నిరోధక చట్టం

ఆస్తి సంబంధ వివాదాల్లో బాధితులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనైనప్పుడు

సి-మిత్ర ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు : ప్రస్తుత డిజిటల్ యుగంలో సాంకేతిక విప్లవంతో పాటే సైబర్ నేరాలు కూడా రోజుకో రూపంతో ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఓవైపు ఓటీపీ మోసాలు, మరోవైపు డిజిటల్ అరెస్టులతో పాటు ఇన్వెస్ట్‌మెంట్, ట్రేడింగ్ ఫ్రాడ్స్ వంటివి తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ బాధితులకు అండగా నిలిచేందుకు హైదరాబాద్ పోలీస్ ముందడు వేసింది. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే శ్రమలేకుండా త్వరితగతిన న్యాయం అందించేందుకు దేశంలోనే తొలిసారిగా విప్లవాత్మక అడుగు వేసింది. సి-మిత్ర ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు అయ్యే వరకూ అంతా ఇంటి నుంచే పూర్తి చేసే చర్యలను ప్రారంభించింది.

### గత సంవత్సరం రూ.251 కోట్ల కాజేసిన నేరగాళ్లు

రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. నేరగాళ్లు నిత్యం బాధితుల నుంచి రూ. కోట్లలో సొమ్ము కాజేస్తున్నారు. కేవలం హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే గత సంవత్సరం రూ.251 కోట్లు కొట్టేశారు. వీటిలో ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్, ఐడెంటిటీ థెఫ్ట్ వంటి కేసుల్లోనే అత్యధిక మోసాలు జరిగాయి. అయితే సైబర్‌నేర బాధితుల సౌలభ్యం కోసం హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని సీపీఎస్ కార్యాలయంలో సి-మిత్రను హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రారంభించారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఫిర్యాదు ప్రక్రియ పూర్తి చేయడం సి-మిత్ర ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.

## సింగరేణి భవిష్యత్తు అంధకారమే!

ఢిల్లీ: సింగరేణిని రాజకీయ ప్రయోగశాలగా మార్చారని కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నైనీ కోల్ బ్లాక్ విషయంలో కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ తరహాలోనే పనిచేస్తోందన్నారు. టెండర్ల విషయాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని నివేదికలు వస్తున్నాయి. ఎక్కడా లేని సైట్ విజిట్ అనే కొత్త నిబంధన పెట్టారు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. 'తెలంగాణ వచ్చిన తర్వాత సింగరేణి సంస్థ అనేక సమస్యల్లో కూరుకుపోయింది. కేంద్రానికి సింగరేణిలో 49 శాతం వాటా ఉన్నా నిర్వహణలో జోక్యం చేసుకోలేదు. నైనీ బొగ్గు గనులకు చివరి అనుమతులు వచ్చాక పనులు ఎందుకు ఆలస్యం చేశారు?. తెలంగాణ విద్యుత్ సంస్థలకు బొగ్గు కోసం కేంద్రం నైనీ కోల్ బ్లాక్‌ను సింగరేణికి అప్పగించింది. టెండర్లను ఆహ్వానించి వాటిని రద్దు చేశారు. దేశంలో ఎన్నో టెండర్లు నిర్వహిస్తుంటాం.. కానీ, ఎక్కడా ఎలాంటి ఆరోపణలు రాలేదు. ఒడిషాలో బీజేపీ వచ్చాక అక్కడి ప్రభుత్వంతో అనుమతులపై చర్చించాను. నేను సింగరేణికి 683 ఎకరాల అటవీ భూమిని అప్పగించేందుకు ఒడిశా ప్రభుత్వం ఒప్పించాను. టెండర్ల విషయాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని నివేదికలు వస్తున్నాయి. రాష్ట్ర పెద్దల ఆదేశంతోనే ఇది జరిగింది. దేశంలో అనేక గనులను కేంద్రం పారదర్శకంగా వేలం నిర్వహిస్తోంది. తెలంగాణ చేతిలో ఒక్క నైనీ కోల్ బ్లాక్ పెడితే అక్రమాలకు తెర లేపారు. ఈ వివాదంలోకి నన్ను లాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి 32వేల కోట్ల బకాయి పడింది. గతంలో బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ సింగరేణిని వాడుకుంటున్నాయి. బీఆర్ఎస్ లాగే కాంగ్రెస్ పనిచేస్తోంది. సింగరేణిని బంగారు బాతుగా కాంగ్రెస్ చూస్తోంది. 12 ఏళ్లుగా నైనీ బ్లాక్ విషయంలో సమస్యలు సృష్టిస్తున్నారు. సీబీఐ అనుమతి కోరుతున్నారు. దానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కావాలి. బీఆర్ఎస్ హయాంలోనూ అనేక అక్రమాలు జరిగాయి. సింగరేణి బొగ్గు క్వాలిటీ పడిపోయింది. దీనిపై దృష్టి పెట్టే పరిస్థితి లేదు. కాంగ్రెస్, బీఆర్ఎస్ సింగరేణిని కలుషితం చేశాయి. సింగరేణి భవిష్యత్ అంధకారంగా మారే పరిస్థితి ఉంది. అనేక జిల్లాలో సింగరేణి భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు ఎవరికి నచ్చిన విధంగా వారికి భూములు ఇస్తున్నారు. అవినీతి, అక్రమాలతో సింగరేణిని నాశనం చేయవద్దు. సింగరేణిలో ఒక్క అధికారిని కూడా బదిలీ చేసే అధికారం కేంద్రానికి లేదు. సింగరేణి సంపూర్ణ ప్రక్షాళన జరగాలి. సింగరేణి అన్ని వ్యవహారాలపై దర్యాప్తు జరగాలి. నైనీ కోల్ బ్లాక్ టెండర్ల రద్దు వ్యవహారంపై సీబీఐ దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేస్తే పరిశీలిస్తాం. మంత్రుల మధ్య వాటాల తేడా వల్లే నైనీ కోల్ బ్లాక్ టెండర్ల రద్దు జరిగింది. సైట్ విజిట్ నిబంధన పెట్టాలనే విషయం కేంద్రానికి తెలియదు. దేశవ్యాప్తంగా సెల్ఫ్ డిక్లరేషన్ నిబంధన ఉంటే.. ఇక్కడ మాత్రం వేరుగా పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణిని కేంద్రానికి అప్పగిస్తే లాభాల్లోకి తీసుకువస్తాం అని అన్నారు.

## వివాదాల్లో కొండా సురేఖ...

**హైదరాబాద్ :** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వివాదాలలో చిక్కుకోవడం పరిపాటిగా మారిపోయింది. అయితే తొలిసారిగా ఆమె ప్రమేయం లేకుండానే ఈసారి ఆమె శాఖలో వివాదం ఏర్పడింది. అది కాస్త ఏకంగా ఉద్యోగుల నిరసనకు దారి తీసే అవకాశం కనిపిస్తోంది. దీనికి సంబంధించిన కథనాలు మీడియాలో విస్తృతంగా కనిపిస్తున్నాయి.కొండా సురేఖ అటవీశాఖ తో పాటు దేవాదాయ శాఖను కూడా పర్యవేక్షిస్తున్నారు. దేశదేశాలలో ఇతర విభాగాల అధికారుల వలసలను నివారించడానికి ఆమె డిప్యూటేషన్ల ప్రక్రియను రద్దు చేశారు. గత ఏడాది జూన్లోనే సురేఖ ఆదేశాలు జారీ చేశారు. సొంత శాఖ అధికారుల ప్రయోజనాలను కాపాడేందుకు ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. కానీ దేవాదాయ శాఖలో ఇతర విభాగాల అధికారులు వలసలు మొదలుపెట్టారని తెలుస్తోంది. సురేఖ ఇచ్చిన ఆదేశాలను సైతం ఉన్నత అధికారులు పక్కన పెట్టారని.. డిప్యూటేషన్లను వేగవంతం చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారం దేవాదాయ శాఖలో చర్చనీయాంశంగా మారింది.సచివాలయం స్థాయిలో ఈ దస్త్రాలు కదులుతున్నాయని.. ఆలయ కార్య నిర్వహణ అధికారి నుంచి మొదలు పెడితే సహాయ కమిషనర్ వరకు ఇలా అనేక రకాల పోస్టులలో ఇతర విభాగాల వారిని డిప్యూటేషన్ మీద తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. సొంత శాఖలో అధికారుల ప్రయోజనాలు కాపాడేందుకు గతంలోనే డిప్యూటేషన్ల ప్రక్రియను రద్దు చేస్తూ మంత్రి సురేఖ నిర్ణయం తీసుకున్నారు. ఆమె నిర్ణయాన్ని పక్కనపెట్టి కొంతమంది ఉన్నతాధికారులు పంచాయతీరాజ్, మున్సిపాలిటీ, రెవెన్యూ విభాగాలలో పనిచేస్తున్న వారిని.. దేవాదాయ శాఖలకు తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.సచివాలయం స్థాయిలో దస్త్రాలు కదులుతున్న నేపథ్యంలో దేవాదాయ శాఖ ఉద్యోగుల జేఏసీ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. సంవత్సరాలుగా ఒకే హోదాలో పనిచేసిన తమకు ఉద్యోగ ఉన్నతి కల్పించకుండా.. ఇతర శాఖల సిబ్బందితో భర్తీ చేయడం ఎంతవరకు సమంజసమని జేఏసీ ఆరోపిస్తున్నారు. సీనియార్టీ ఉన్నప్పటికీ పదోన్నతి కల్పించకుండా.. సర్వీస్ రూల్స్ అమలు చేయడం లేదని ఉద్యోగుల జేఏసీ ఆరోపిస్తోంది.



# రాత్రి భోజనానికి ఏది ప్రయోజనకరం

రాత్రి పూట అన్నం తింటే బాగుంటుందా? లేదా రోటీ తింటే బాగుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతుంటుంది. రాత్రి పూట ఈ రెండింటిలో ఏదీ తీసుకుంటే మంచిది? వీటి శరీరానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి? దీనిపై నిపుణులు కీలక విషయాలు వెల్లడించారు. రాత్రి భోజనంలో అన్నం తినాలా లేక రోటీ తినాలా అనేది తరచుగా ప్రజలను కలవరపెట్టే ప్రశ్న. నిపుణులు సమాధానం మీ జీవనశైలి, జీర్ణ సామర్థ్యం, ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుందని అంటున్నారు. రెండూ పోషకమైనవి. కానీ కొన్ని తేడాలు ఏ విందు ఎంపిక ఉత్తమమో నిర్ణయిస్తాయి. పోషకాహార నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ కంటే బియ్యం వేగంగా జీర్ణమవుతాయి. రాత్రిపూట జీర్ణశక్తి బలహీనంగా ఉంటుంది. అందుకే బియ్యం శరీరంపై ఎక్కువ ఒత్తిడిని కలిగించదు. తెల్ల బియ్యం తేలికగా ఉంటుంది. అలాగే కడుపు, ప్రేగులపై ఒత్తిడిని కలిగించదు. ఇది నిద్రకు కూడా సహాయపడుతుంది. కానీ జాగ్రత్తగా ఉండండి. వడ్డించే పరిమాణాలను అదుపులో ఉంచండి. ఎల్లప్పుడూ పప్పుధాన్యాలు, కూరగాయలను పక్కన పెట్టుకోండి. బ్రెడ్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ముఖ్యంగా గోధుమ, జొన్న లేదా మల్టీగ్రెయిన్ పిండి అయితే. రాత్రిపూట రోటీ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులకు, బరువును నియంత్రించుకోవాలనుకునే వారికి రోటీ మంచిదని నిపుణులు భావిస్తున్నారు. ఇక రోటీలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల మిమ్మల్ని ఎక్కువసేపు కడుపు నిండి ఉండేలా చేస్తుంది. అన్నం త్వరగా జీర్ణమవుతుంది. అందుకే రాత్రిపూట ఆకలిగా ఉన్నవారికి 1-2 రోటీలు మంచి ఎంపిక. బియ్యంలో ఉండే ట్రిప్టోఫాన్ తేలికపాటి విశ్రాంతినిస్తుంది. అందువల్ల రాత్రిపూట తేలికపాటి భోజనాన్ని ఇష్టపడేవారు కొంచెం అన్నం తినవచ్చు. బరువు తగ్గాలనుకుంటున్నారా ? అయితే రాత్రిపూట రోటీ మంచిది. జీర్ణశక్తి బలహీనంగా ఉందా లేదా తేలికైన భోజనం కావాలనుకునేవారికి అన్నంమంచి ఎంపిక.నిపుణుల అభిప్రాయం ప్రకారం.. రోటీ- అన్నం రెండూ రాత్రిపూట మంచివి. అది మీ ఆరోగ్యం, అవసరాన్ని బట్టి ఉంటుంది.

# ఈ ఆహారాలు తింటే రోగనిరోధక శక్తి డబుల్



మన శరీరంలో రెండో మెదడు ఎక్కడ ఉంటుందో తెలుసా? అది మన పొట్ట. పొట్ట ఆరోగ్యంగా ఉంటేనే మన మూడ్ బాగుంటుంది. అన్ని పనులు సజావుగా చేయడానికి శరీరం కూడా సహకరిస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చివరికి చర్మం కూడా కాంతివంతంగా మెరుస్తుంది. కానీ ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు ప్రతి ఒక్కరినీ వేధిస్తున్నాయి. వీటన్నింటికీ ప్రధాన కారణం మనం తీసుకునే ఆహారంలో ఒక ముఖ్యమైన అంశం తగ్గిపోవడమే. అదే 'ఫైబర్' (పీచు పదార్థం). ప్రముఖ గ్యాస్ట్రో స్పెషలిస్ట్ డాక్టర్ పాల్, మన వంటింట్లో దొరికే సాధారణ పదార్థాలతోనే పొట్టను ఎలా క్లీన్ చేసుకోవచ్చో వివరించారు. ఆయన సూచించిన ఆ ఐదు సూపర్ ఫుడ్స్ ఏంటి? ఫైబర్ అనేది జీర్ణవ్యవస్థకు ఒక క్లీనర్ లాగా పనిచేస్తుంది. ఇది మనం తిన్న ఆహారం సాఫీగా కదలడానికి సహాయపడటమే కాకుండా, మన పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందిస్తుంది. ఫైబర్ అందించడంలో వేయించిన శనగలు అగ్రస్థానంలో నిలుస్తాయి. ప్రతి 100 గ్రాముల శనగలలో సుమారు 17 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇందులో ఉండే ఇన్‌సోల్యూబుల్ ఫైబర్, ప్రోటీన్ మిమ్మల్ని ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంచుతాయి. వీటిని చిరుతిండిగా నేరుగా తీసుకోవచ్చు లేదా సలాడ్లలో కలుపుకోవచ్చు. మన ఇళ్లలో సాధారణంగా వాడే నల్ల మినుములలో ఒక కప్పుకు 16 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇందులో కరిగే, కరగని ఫైబర్స్ రెండూ ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, మన పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పోషిస్తాయి. పప్పు మఖానీ లేదా అన్నంలో కలిపి తీసుకోవడం వల్ల గుండెకు కూడా మేలు జరుగుతుంది. చియా విత్తనాలు ఇప్పుడు సూపర్ ఫుడ్‌గా ప్రాచుర్యం పొందాయి. కేవలం రెండు టేబుల్ స్పూన్ల చియా విత్తనాల్లో 10 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఇవి పొట్టలోకి వెళ్ళగానే జెల్ లాగా మారి జీర్ణక్రియను సులభతరం చేస్తాయి. బ్లడ్ షుగర్ లెవల్స్ స్థిరంగా ఉండటానికి కూడా ఇవి తోడ్పడతాయి. డాక్టర్ పాల్ వీటిని పెరుగుతో కలిపి తీసుకోవాలని సూచిస్తున్నారు. చూడటానికి చాలా చిన్నవిగా ఉన్నా, రాస్ప్‌బెర్రీస్ ఫైబర్ పవర్‌హౌస్‌లు. ఒక కప్పు రాస్ప్‌బెర్రీస్‌లో 8 గ్రాముల ఫైబర్ లభిస్తుంది. ఇవి మంచి బ్యాక్టీరియాకు మద్దతు ఇవ్వడమే కాకుండా, శరీరానికి కావాల్సిన యాంటీ ఆక్సిడెంట్లను అందిస్తాయి. వీటిని స్మూతీలలో లేదా ఓట్స్‌లో కలిపి తీసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆరోగ్యాన్ని ఇచ్చే పండు జామ. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. మలబద్ధకంతో బాధపడేవారికి ఇది ఒక దివ్యౌషధంలా పనిచేస్తుంది. రోజూ ఒక జామ పండు తినడం వల్ల జీర్ణవ్యవస్థ మొత్తం శుభ్రపడుతుంది. ఆరోగ్యకరమైన పొట్టే సంతోషకరమైన జీవితానికి ఆధారం. డాక్టర్ పాల్ సూచించిన ఈ ఐదు పదార్థాలను మీ రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల జీర్ణ సమస్యల నుండి శాశ్వత ఉపశమనం పొందవచ్చు. ఇవి కేవలం మీ పొట్టనే కాకుండా, మీ పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

# ప్యాకేజీ ఫుడ్‌తో క్యాన్సర్ ముప్పు!



ఆధునిక జీవనశైలిలో మనకు సమయం దొరకడమే కష్టమవుతోంది. అందుకే త్వరగా తయారయ్యే ఇన్స్టంట్ ఫుడ్స్, ప్యాక్ చేసిన పానీయాలు, ఎక్కువ కాలం నిల్వ ఉండే ఆహార పదార్థాల వైపు అందరం మొగ్గు చూపుతున్నాం. కానీ మనం సౌకర్యవంతంగా భావిస్తున్న ఈ ఆహారమే మన ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం ఉందని మీకు తెలుసా?ఆహారం పాడవకుండా, ఎక్కువ కాలం తాజాగా ఉంచేందుకు కంపెనీలు వాడే కొన్ని కెమికల్స్.. నిశ్శబ్దంగా మన శరీరంలో క్యాన్సర్ కణాలను పెంచుతున్నాయని తాజా అంతర్జాతీయ పరిశోధనలో తేలింది. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్, పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్‌లకు ఈ నిల్వ కారకాలే ప్రధాన శత్రువులని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు ఆ ప్రమాదకరమైన ప్రిజర్వేటివ్స్ ఏంటి? ఫ్రాన్స్‌లోని 'యూనివర్సిటీ పారిస్ సిటీ' పరిశోధకులు సుమారు 1,05,260 మందిపై సుదీర్ఘ కాలం పాటు జరిపిన అధ్యయన ఫలితాలను 'ది బిఎమ్?జె (ఃఓఏ)' జర్నల్‌లో ప్రచురించారు. ప్యాక్ చేసిన ఆహారాల్లో వాడే 17 రకాల ప్రిజర్వేటివ్స్ గురించి వారు పరిశీలించగా, అందులో కొన్ని సాధారణ కెమికల్స్ క్యాన్సర్ రిస్క్‌ను విపరీతంగా పెంచుతున్నట్లు గుర్తించారు. పొటాషియం సోర్బేట్: ఇది మొత్తం క్యాన్సర్ ముప్పును 14 శాతం, రొమ్ము క్యాన్సర్ ముప్పును 26 శాతం పెంచుతున్నట్లు తేలింది.సోడియం నైట్రైట్: మాంసం నిల్వ ఉంచేందుకు వాడే ఈ కెమికల్ వల్ల ప్రోస్టేట్ క్యాన్సర్ వచ్చే అవకాశం 32 శాతం ఎక్కువగా ఉంది.పొటాషియం నైట్రేట్: దీని వల్ల రొమ్ము క్యాన్సర్ ముప్పు 22 శాతం పెరుగుతోంది.సల్ఫైట్లు: ఆహారంలో వీటి పరిమాణం ఎక్కువైతే సాధారణ క్యాన్సర్ రిస్క్ 12 శాతం పెరుగుతుంది.అసిటేట్లు: ఇవి రొమ్ము క్యాన్సర్ ముప్పును 25 శాతం పెంచుతాయని పరిశోధనలో వెల్లడైంది. ఆహారం నిల్వ ఉండటానికి వాడే ఈ రసాయనాలు మన శరీరంలోని రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తాయి. ఇవి శరీరంలో ఇన్ఫ్లమేషన్ (వాపు)ను పెంచి, క్యాన్సర్ కణాలు వృద్ధి చెందడానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తాయి. సహజమైన యాంటీ ఆక్సిడెంట్ ప్రిజర్వేటివ్స్ పెద్దగా నష్టం చేయకపోయినా.. సోడియం ఎరిథోర్బేట్ వంటి కొన్ని రసాయనాలు మాత్రం అనారోగ్యానికి కారణమవుతున్నాయి.

# మటన్‌లోని ఈ పార్ట్ తింటే ఇక తిరుగుండదంతే



మేక మెదడు (మటన్ బ్రెయిన్) కూర బలహీనంగా ఉన్న పిల్లలకు, ఆపరేషన్ల నుండి కోలుకుంటున్న వారికి, కండరాల నిర్మాణానికి అద్భుతమైన పోషకాహారం. ఇందులో తక్కువ కార్బోహైడ్రేట్లు, ఎక్కువ ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా చేసి, జ్ఞాపకశక్తిని పెంచుతుంది. నాన్ వెజ్ ప్రియులు మటన్ (మేక మాంసం) ను ఎంతో ఇష్టంగా తింటారు.. అయితే.. మేకలోని పలు భాగాలు.. ఎన్నో ప్రత్యేకతలను కలిగి ఉంటాయి.. ఒక్కో పార్ట్.. ఒక్కో ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది.. మటన్ తిల్లి, తలకాయ, లివర్, పాయా అన్ని స్పెషలే.. అయితే.. మేక మెదడు కూడా ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలను చేకూరుస్తుంది.. మేక మెదడులో ప్రోటీన్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ః12, ఐరన్, భాస్వరం వంటి పోషకాలు అధికంగా ఉంటాయి.. ఇవి మెదడు ఆరోగ్యం, జ్ఞాపకశక్తి, రక్త ఉత్పత్తి, కండరాల బలానికి మేలు చేస్తాయి. కణాల మరమ్మత్తుకు సహాయపడటమే కాకుండా.. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. నాన్-వెజ్ ఆహారాన్ని ఇష్టపడేవారికి, ప్రత్యేకించి ఆరోగ్య ప్రయోజనాలను కోరుకునేవారికి మేక మెదడు కూర ఒక అద్భుతమైన ఎంపిక అని డైటీషియన్లు చెబుతున్నారు. ఈ వంటకం కేవలం రుచిని మాత్రమే కాకుండా, అనేక పోషక విలువలను కూడా అందిస్తుంది. ముఖ్యంగా, ఎదుగుతున్న పిల్లలకు, శారీరకంగా బలహీనంగా ఉన్నవారికి, ఇటీవల ఆపరేషన్ల నుండి లేదా గాయాల నుండి కోలుకుంటున్న వారికి, అలాగే కండరాల నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని వ్యాయామం చేసేవారికి ఈ కూర చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. మేక మెదడులో కార్బోహైడ్రేట్లు తక్కువగా ఉంటాయి. అయితే ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, ఐరన్, ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు అధికంగా ఉంటాయి. ఈ పదార్థాలు శరీరానికి శక్తిని అందించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హృదయ ఆరోగ్యానికి ఎంతో అవసరం. ఐరన్ శరీరంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి తోడ్పడుతుంది. తద్వారా రక్తహీనతను నివారిస్తుంది. ప్రోటీన్ కండరాల మరమ్మత్తుకు, పెరుగుదలకు కీలకం. అంతేకాకుండా, మేక మెదడు రక్తం గడ్డకట్టకుండా చేసి, శరీరంలో రక్త ప్రవాహాన్ని సక్రమంగా నిర్వహించడానికి సహాయపడుతుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని కూడా పెంచుతుంది. తద్వారా ఆక్సిజన్ రవాణాను మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచే గుణాలు కూడా దీనిలో ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అయితే కొలెస్ట్రాల్, కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల గుండె జబ్బులు ఉన్నవారు మితంగా తీసుకోవాలి. ఈ రుచికరమైన కూరను తయారుచేయడానికి, ముందుగా తాజా మేక మెదళ్లను పసుపు, ఉప్పు వేసిన నీటిలో 2-3 నిమిషాలు ఉడికించి, శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత, నూనెలో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కరివేపాకు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించాలి. శుభ్రం చేసిన మెదళ్లను వేసి, పసుపు, ఉప్పు, కారం కలిపి నిదానంగా వేయించుకోవాలి. లవంగాలు, దాల్చినచెక్క, యాలకులు, మరాఠీ మొగ్గ, అనాస పువ్వు, జీలకర్ర, ధనియాలు, గసగసాలతో తయారుచేసిన మసాలా పేస్ట్‌ను వేసి, తగినంత నీళ్లు పోసి ఉడికించాలి. మెదళ్లు మెత్తబడిన తర్వాత ముక్కలుగా కట్ చేసి, మూతపెట్టి పది నిమిషాలు ఉడికించి, చివరగా కొత్తిమీరతో గార్నిష్ చేస్తే సరిపోతుంది..

ధర్మఘంట

# రేవంత్‌పై కవిత సెటైర్లు



**హైదరాబాద్ :** మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పక్కదారి పట్టించేందుకే గుంపు మేస్త్రీ ,గుంటనక్క కలిసి ఫోన్ ట్యాపింగ్ డ్రామాలు ఆడుతున్నారని కవిత తీవ్రంగా విమర్శించారు. పట్టణాల్లో జరిగే ఈ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, దీనిపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదని ఆమె నిలదీశారు. ఈ రెండు పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని, బాధితులకు ఈ విచారణల ద్వారా న్యాయం జరుగుతుందన్న నమ్మకం తనకు లేదని వ్యాఖ్యానించారు.తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో కల్వకుంట్ల కవిత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముచ్చర్ల సత్యనారాయణ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ వద్ద ప్రతిష్టించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ కూడా ట్యాంక్ బండ్ పై మన తెలంగాణ వారి విగ్రహాలు లేవు. ఆంధ్రా నాయకుల విగ్రహాలు తీసేయమనటం లేదు. అవసరమైన నాడు తప్పకుండా తీసేద్దాం. కానీ మన తెలంగాణ వారి విగ్రహాలు కచ్చితంగా ట్యాంక్ బండ్ పై ఉండాలన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఎందరో అన్‌సంగ్ హీరోల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, తాము అధికారంలోకి వస్తే అమరవీరుడు శ్రీకాంతా చారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తామని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరిగిన కులగణనలో బీసీల సంఖ్యను తక్కువగా చూపి కాంగ్రెస్ మోసానికి పాల్పడిందని, కేంద్రం చేపట్టబోయే కులగణన ద్వారా ఆ మోసాన్ని బయటపెట్టే అవకాశం వచ్చిందని కవిత పేర్కొన్నారు. బీసీ ఉపకులాలకు అన్యాయం జరగకుండా ప్రతి కులానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తెలంగాణ జాగృతి సేకరిస్తుందని, దీనిపై త్వరలోనే మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలు మరియు యువత రాజకీయాల్లోకి రావాలని, వారికి జాగృతి తరపున పూర్తి మద్దతు ఇస్తామని ఆమె పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు డిమాండ్‌పై స్పందిస్తూ, గత పదేళ్లుగా ఈ డిమాండ్‌ను అణిచివేసిన కేటీఆర్, ఇప్పుడు దాని గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయడంతో పాటు, ప్రొఫెసర్ జయశంకర్ గారి పేరును ఒక జిల్లాకు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా ఇంకా పూర్తిస్థాయిలో అవతరించకపోయినప్పటికీ, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే వారికి అండగా ఉంటామని కవిత స్పష్టం చేశారు.

## మంథని చరిత్రను రూపుమాపే ప్రయత్నం చేస్తున్న శ్రీధర్ బాబు

**చరిత్రను కాపాడాలంటూ మేధావులకు లేఖలు రాస్తున్నా**
**నిలదీయకపోతే మంథని మూలాలను మట్టిలో కలిపేస్తడు**
**రూపురేఖలుమార్చి తండ్రి పేరు పెట్టాలని కుట్ర చేస్తుండు**
**అన్యాయాలను అక్రమాలను నిలదీయకపోతే చరిత్ర క్షమించదు**
**తమ హాయాంలో ఇబ్బందుల్లేకుండా అభివృద్ధి చేశాం**
**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**




**మంథని :** మన పూర్వీకులు పొందుపర్చిన మంథని పట్టణాన్ని ద్వంసం చేసి చరిత్రను రూపుమాపేందుకు మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శ్రీకారం చుట్టారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. బుధవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ తాత ముత్తాతల కాలం నుంచి మంథనికి ఒక చరిత్ర ఉందని ఆ రోజుల్లోనే ఏది ఎక్కడ ఉండాలో ఆలోచన చేసి పొందుపర్చిండ్లని తెలిపారు. మంథని పట్టణ పరిధి అబాదీ స్థలంలో ఉందని పరిధి దాటితేనే రెవెన్యూ స్థలం మొదలవుతుందన్నారు.ఆనాడు టౌన్ మున్సిపాలిటీగా ఉన్న సమయంలో చైర్మన్‌గా సువర్ణ చంటయ్య, ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేగా గులుకోట శ్రీరాములు ఉండేవారని, అలాంటి గ్రామాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేసే విధంగా మంత్రి శ్రీధర్ బాబు తన సొంత కుటుంబం పేరు కోసం ఆయన తండ్రి పేరు పెట్టుకోవడానికి వందల కోట్లను వృధా చేస్తూ మంథని చరిత్రను మట్టిలో కలుపే ప్రయత్నం ప్రారంభించారని అన్నారు. అయితే ఎమ్మెల్యే ప్రయత్నాలను, కుట్రలను అరికట్టాల్సిన బాధ్యత ఈ మట్టిలో పుట్టిన ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈనాడు మున్సిపాలిటీని తీసేసి పక్కకు కదుతాండ్లని, ప్రస్తుతం మున్సిపాలిటి కార్యాలయానికి వెళ్లకుండా అన్నీ ఆన్‌లైన్‌లోనే చేసుకుంటున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. చరిత్ర ఉన్న మున్సిపాలిటీని అక్కడి నుంచి తొలగించడం, సివిల్ ఆస్పత్రిని చెరువులో నిర్మించడం, జడ్జిల క్వాటర్లను కూలగొట్టడం,ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌ను ఎక్కడో నిర్మించడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మంథనిలో ఉన్న మా చరిత్రను చెడిపేసి దుద్దిళ్ల కుటుంబ చరిత్రను రాసుకోవడానికి ఇవ్వాల చరిత్ర గల మంథనిని రూపుమాపుతున్నాడని ఆయన విమర్శించారు. ఈ విషయంలో పట్టణంలో ఉన్న మేధావులకు లెఖలు రాస్తున్నట్లు ఆయన చెప్పారు. నూతనంగా రింగ్‌రోడ్ నిర్మాణం చేపట్టి దానికి శ్రీపాద రింగ్‌రోడ్ అనిపేరు పెట్టిండ్లని, దానితో ఎవరికి అవసరం ఉంటదో ఎవరికి ప్రయోజనం చేకూర్చుతుందో అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఆర్టీసీ బస్సు ఉచితంతో వ్యాపారాలు క్షీణించి పోయి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రమంలో ఈ రింగ్‌రోడ్‌తో ఇంకా ప్రమాదం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. మంథని ప్రజలు, సీనియర్ సిటిజన్లు నోరు మెదక పోతే మంథని చరిత్రను మట్టిలోకలుపతారని, ఎంతసేపు తన తండ్రి పేరు పెట్టుకోవాలని ఆలోచన చేస్తున్నారని అన్నారు. తాను మంథనిలో ఉన్న మేధావులు, సీనియర్ సిటిజన్‌లైన గంగాధర్ సార్, సీనియర్ న్యాయవాది సువర్ణ చంద్రశేఖర్, నాటి టౌన్ మున్సిపాలిటి చైర్మన్ మాదాటి ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొండపాక సత్య ప్రకాశ్ అడ్వకేట్‌ప్రభాకర్‌రెడ్డి, గంగాశంకర్, వార్డు మెంబర్‌గా పని చేసిన అట్టెం మల్లయ్య, తాటి బుచ్చయ్య, రిటైర్డ్ అధికారి కుక్కడపు రామయ్య, పత్రికారంగంలో సీనియర్ పాత్రికేయులు కొమురోజు మారుతి, సీనియర్ న్యాయవాది అవధానుల రమేష్‌బాబు, లైన్‌గడ్డలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగి బాబాయ్, వార్డు మెంబర్‌గా పని చేసిన పినగాని రాజమల్లుకు స్వయంగా తమ నాయకులు కలిసి లేఖలు అందిస్తారని తెలిపారు.మంథని చరిత్ర గురించి దుద్దిళ్ల శ్రీధర్ బాబును నిలదీయకపోతే మన మూలాలు తీసిపారేస్తూ వందల కోట్లు వృధా చేస్తూ స్థలాలను వృధా చేస్తాడన్నారు. తాజాగా ఆర్అండ్‌బీ, ఐబీ కార్యాలయాలు లేకుండా చేసిండన్నారు. ఆనాడు తమ హాయాంలోమంథని అభివృద్ధిలో ఎవరికి ఇబ్బంది పెట్టలేదని, రింగ్‌రోడ్డు నిర్మాణంలోఒక్క ఇల్లు పోకుండా నిర్మించామన్నారు. గ్రౌండ్‌ను తీర్చిదిద్దామని, ఇంటర్నేషనల్ స్థాయిలో చేయాలనే ఆలోచనతో ప్లాట్ ఫాంలు తయారు చేశామన్నారు. బర్రెకుంటను తీసేసి స్టేడియం చేయాలని ఆనాడు ఇదే ఎమ్మెల్యే చూస్తే బర్రెకుంట కాదని అంబేద్కర్ నగర్ కుంట అని దానిని అభివృద్ధి చేసేందుకు బన్నెచెరువుకు లింక్ చేసి నీళ్లను తీసుకువచ్చినట్లు తెలిపారు. కూచిరాజ్‌పల్లి గొల్లగూడెం బోయిన్‌పేటను అభివృద్ధి చేయాలని చూశామన్నారు. ఇప్పుడు మంథని గ్రామ రూపురేఖలు లేకుండా పట్టణాన్ని ద్వసం చేయాలని చూస్తున్నాడని, 80ఏండ్ల పైబడి ప్రజాజీవితంలో ఉద్యోగ రంగంలో పని చేసి అనుభవం ఉన్న వాళ్లు స్పందించాలన్నారు. మనం నోరు విప్పకపోతే మంథని పేరును మార్చే ప్రమాదం ఉందని, అన్యాయాలను అక్రమాలను నిలదీయకపోతే చరిత్ర క్షమించదని ఆయన ఈ సందర్బంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు యెగోళపు శంకర్ గౌడ్, తగరం శంకర్ లాల్, ఆరెపల్లి కుమార్, మాచిడి రాజు గౌడ్,కాయితి సమ్మయ్య, కనవేన శ్రీనివాస్ యాదవ్, పుప్పాల తిరుపతి, ఆసిఫ్ ఖాన్, ఫోలు కనకరాజు, ఓదెలు లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## 6 గ్యారంటీలు 420 హామీలను అమలు చేయాలి

**బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట అంబేత్కర్ సెంటర్ లో ప్రజా నిరసన ర్యాలీ......**
**.భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు......**
**అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రం ఇచ్చిన మాజీ ఎమ్మెల్యే.... పెద్ది**




**నర్సంపేట :** మాయ మాటలు చెప్పి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినప్పటికి ఆనాడు ఇచ్చినా 6 గ్యారెంటీలు 420 హామీలు నెరవేర్చకుండా స్థానిక ఎమ్మెల్యే,ముఖ్యమంత్రి తప్పించుకు తిరుగుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విమర్శించారు.బుధవారం నర్సంపేట పట్టణంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలంటు బిఆర్ఎస్ఎస్ పట్టణ అధ్యక్షులు నాగెల్లి వెంకట్ నారాయణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన పెద్ది మాట్లాడుతూ,మున్సిపాలిటీ ఎన్నికలు వస్తున్నాయనే నేపథ్యంలో ప్రజలు నిలదీస్తారనే భయంతో పునాదిరాళ్ల పేరు మీద వందల చోట్ల గుర్తింపు లేనటువంటి పనులకు శిలాఫలకాల వేస్తున్నారని అన్నారు.అవన్నీకూడా మోసపూరితమైన శిలాపలకలే నంటూ,రెండేళ్ల కిందట కాంగ్రెస్ పార్టీ మార్పు అని చెప్పి నినాదం ఇచ్చి ప్రజలను మోసం చేసిందని,మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే మోసానికి కాంగ్రెస్ పార్టీ ఒడిగడుతుందన్నారు.ఈ నిధులన్నీ నేను శాసనసభ్యుడిగ కెసిఆర్ నాయకత్వంలో నర్సంపేట అభివృద్ధి కోసం ప్రతి ఇంచు సిసి రోడ్డు గ్యాపు లేకుండా తీసుకొచ్చిన నిదులేనని అన్నారు.నాడు మిషన్ భగీరథ పైప్లైన్ మంచినీటి సరఫరా కోసం పైపులను తవ్వకాలు, ఇంటర్నెట్ కొరకు పైపు, నేచురల్ గ్యాస్ మూడు పైపులైన్లు వేసి పనులు ప్రారంభించలనుకున్నాం,ఇంతలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని,బిఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయిన తర్వాత ఆ పనులను కొనసాగించకుండా ఎమ్మెల్యే దొంతి మాధ రెడ్డి నిధులను పక్కకు పెట్టిండన్నారు.నేను తీసుకువచ్చిన నిధులనే కొత్త కాగితం పెట్టి ఆయనే తీసుకొచ్చినట్లు శంకుస్థాపన చేస్తున్నాడన్నారు.రెండేళ్ల నుంచి అభివృద్ధి కుంటుపడిందని నేను శాసనసభ్యులుగా ఉన్నప్పుడు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నీ ఒప్పించి పాకాల ఆడిటోరియం ఏసీ ఫంక్షన్ హాల్ ఏడు కోట్ల రూపాయల తో తీసుకువచ్చి పని పూర్తి చేసి నర్సంపేట ప్రజలకు పెళ్లిళ్లకు అన్ని రకాల ఫంక్షన్లకు అన్ని రకాలుగా ఉపయోగపడే అవకాశాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రజలకు రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు.ఎన్నిసార్లు నిరసన వ్యక్తం చేసిన నోరు విప్పి మాట్లాడడం లేదు ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్ కూడా ఎక్కడికక్కడ ఆగిపోయింది,నర్సంపేట లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆపింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అని ఆవేదన వ్యక్తం చేశారు.కుల సంఘాలకు సంబంధించి నాడు నేను శాసనసభ్యుడిగా ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసి ఆ జీవో చెల్లదని చెప్పారని,డిసెంబర్ 30వ తేదీన మున్సిపాలిటీకి బిఆర్ ఓ రిలీజ్ కేటాయిస్తూ ఆ జీవోను పొడిగించిందన్నారు.దీనిపై ఇటీవల నేను ప్రెస్ మీట్ పెట్టి మాట్లాడితే కాంగ్రెస్ నాయకులు రెచ్చగొట్టే మాటలు, చిల్లర మాటలు మాట్లాడుతూ వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, రెచ్చగొట్టే మాటలు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడిస్తున్నారని అన్నారు.జరుగుతున్న పనుల గురించి ఏమాత్రం మాట్లాడకుండా కొత్త డ్రామా కు తెరలేపుతున్నాడని,36 కుల సంఘాలకు సంబంధించిన భవనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయని కొన్ని పూర్తాయి పోయాయాని, కొన్ని టెండర్ల దశలో ఉన్నాయన్నారు, వీటి మీద సమిక్ష లేదు సమావేశం లేదు,కేవలం దుష్ప్రచారం చేసి పబ్బం గడుపుకునే స్థితిలో ఉన్నారని విమర్శించాడు.నాడు మహిళలకు 2500 అని చెప్పి హామీ ఇచ్చారు.25 నెలల పేరు మీద మహిళలకు 62కోట్ల 500 బాకీ ఉన్నారని,రేపు ఎన్నికల్లో నిలబడ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రతి అక్కకు, చెల్లెకు 62,000 500 రూపాయలు ఖాతాలో వేసినాకనే ప్రతి మహిళను ఓటు అడగాలని అన్నారు.రైతులను మోసం చేశారు, విద్యార్థులకు స్కూటీని ఇస్తామని మోసం చేశారు,పెళ్లిలైన అక్క చెల్లెలను తులం బంగారం అని చెప్పి మోసం చేశారు, సిగ్గులేకుండా మళ్ళీ కాంగ్రెస్ పార్టీ ఓట్ల కొరకు కొత్త డ్రామ తెరలేపిందన్నారు. రూల్ ప్రకారం దరఖాస్తు చాలాన్ నిన్ననే సబ్మిట్ చేసాం, పోలీస్ అధికారులు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఒత్తిడి మేరకు నిరసన ర్యాలీ విజయవంతం అయితేమున్సిపాలిటీ ఎన్నికల మీద ప్రభావం పడతదని చెప్పి వారి పట్ల ఉన్న వ్యతిరేకత బయటికి వస్తుందని నిరసన ర్యాలీకి మేము అనుమతి ఇవ్వమని చెప్పారని అన్నారు.ఒకవేళ మీరు నిరసన చేస్తే కేసులు పెడతాం అని తప్పుడు మాటలు మాట్లాడినారు.చట్టంలో అందరికీ సమాన హక్కులు ఉన్నాయి, బిఆర్ఎస్ పార్టీ నక్సలైట్ల పార్టీ కాదు, నిషేధిత పార్టీ కాదు,బిఆర్ఎస్ పార్టీ ప్రాణాలను అడ్డంపెట్టి తెలంగాణ తెచ్చిన పార్టీ, స్వరాష్ట్ర తెలంగాణ కొరకు కొట్లాడిన పార్టీ,ఎవరైతే దొంగలుగా తప్పించుకుని తిరుగుతున్నారో వారికి ప్రజలు అవకాశం కల్పించారని,నిరసన ర్యాలీ నీ అడ్డుకునే ప్రయత్నం చేశారు, వీటన్నిటికీ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధిచెప్తారని,మార్పు నినాదాన్ని ప్రజలు మళ్ళీ ఎత్తుకుంటున్నారన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు భరించలేనీ అరాషకాలను, అక్రమ దందాలను చేస్తున్నారని,నర్సంపేటలో కాంగ్రెస్ వస్తే వ్యాపారాలు నడవవు, ప్రశాంతత వాతావరణము ఉండదు, వార్డుకు ఒక రౌడీ తయారవుతాడు, రౌడీ షీటర్లు పెరిగిపోతారు, రౌడీయిజం పెరుగుతుందాన్నారు.ప్రజలు ఆలోచిస్తున్నారు, కాంగ్రెస్ పార్టీని మున్సిపల్ ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి సరైన బుద్ధి చెబుతారన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, నియోజకవర్గ కోఆర్డినేటర్, పట్టణ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, మాజీ ఎంపీపీ, పట్టణ ప్రధాన కార్యదర్శి, బిఆర్టియు జిల్లా అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్లు, క్లస్టర్ బాధ్యులు, మహిళా అధ్యక్షురాలు, మహిళా కమిటీ బాధ్యులు,అనుబంధ సంఘాల నాయకులు యూత్ నాయకులు, అన్ని వార్డుల అధ్యక్షులు , వార్డు ఇన్చార్జి లు, పట్టణ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు .

## ఏ ఆర్ ఐ హాస్పిటల్ ఘనంగా ప్రారంభోత్సవం


**ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కొప్పుల వేనారెడ్డి**



**ధర్మఘంట, జనవరి 21,సూర్యాపేట:** సూర్యాపేట పట్టణంలోని నిర్మల హాస్పిటల్ రోడ్ లో అలి సాహెబ్(పాషా) ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఆర్ కంటి హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపెద్ద హైదరాబాదు నగరాలలోనే కాకుండా సూర్యాపేట జిల్లా కేంద్రంలో అత్యాధునిక టెక్నాలజీ ద్వారా పిల్లలకు పెద్దలకు కంటి సమస్యలు కంప్యూటర్ ద్వారా కంటి పరీక్షలు కంటి ఆపరేషన్లు కంటికి సంబంధించిన అన్ని రకాల జబ్బులకు ప్రత్యేక వైద్యం డాక్టర్ సమీరా పర్యవేక్షణలో ఈ హాస్పిటల్ లో నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హాస్పిటల్ నిర్వాహకులు హాస్పిటల్ సిబ్బంది కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన లక్ష్యం తెలంగాణలో ప్రపంచ పెట్టుబడులే ...

**తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్ చింతల నిర్మల రెడ్డి వెల్లడి**



**ధర్మఘంట, జనవరి 21, హైదరాబాద్ :** సీఎం రేవంత్ రెడ్డి దావోస్ పర్యటన లక్ష్యం తెలంగాణలో ప్రపంచ పెట్టుబడులను ఆహ్వానించడమేనని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్ చింతల నిర్మల రెడ్డి వెల్లడించారు. నేడు ఆమె వారి నివాసంలో ధర్మఘంట'తో మాట్లాడుతూ ప్రపంచంలోనే తొలి బ్యూటీ – టెక్ జీసీసీ, హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తున్న లోరియల్. ఈ ఏడాది నవంబర్‌లోనే ప్రారంభమని, ప్రపంచంలోనే తొలి బ్యూటీ – టెక్ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ ను హైదరాబాద్లో ఏర్పాటు చేస్తున్నట్లు లోరియల్ సంస్థ ప్రకటించిందన్నారు. ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఈ ఏడాది నవంబర్లో ప్రారంభించనుందని, దావోస్ లో వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ – 2026లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లోరియల్ సీఈవో నికోలస్ హియెరోనిమస్ తో భేటీ అయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో బ్యూటీ – టెక్ జీసీసీ ఏర్పాటు చేసే నిర్ణయాన్ని వెల్లడించారని, ఈ జీసీసీ ఏర్పాటుతో లోరియల్‌కు గ్లోబల్ ఇన్నోవేషన్, టెక్నాలజీ, డేటా, సప్లై చైన్ కార్యకలాపాలకు హైదరాబాద్ కీలక కేంద్రంగా నిలవనుందని పేర్కొన్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఏఐ, అనలిటిక్స్ రంగాల్లో రూపొందించే సాంకేతిక పరిష్కారాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న లోరియల్ యూనిట్లకు అందిస్తామని హియెరోనిమస్ తెలిపారు. దీంతో గ్లోబల్ ఎంటర్‌ప్రైజ్ కార్యకలాపాలకు హైదరాబాద్ ప్రాముఖ్యత మరింత పెరుగనుందని, నవంబర్‌లో జీసీసీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులను లోరియల్ ఆహ్వానించిందని, ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. లోరియల్ జీసీసీని హైదరాబాద్‌కు తీసుకురావాలన్న ఆలోచనపై ముఖ్యమంత్రి ప్రత్యేక ఆసక్తి చూపారని, ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని చెప్పారని స్పష్టంచేశారు. హైదరాబాద్ పెట్టుబడులకు అనువైన ప్రదేశమని మెడ్‌టెక్, హెల్త్‌టెక్ మాత్రమే కాకుండా బ్యూటీ – టెక్ వంటి కొత్త విభాగాల్లోనూ తెలంగాణ ముందుంటోందని మంత్రి అన్నారని, ఇప్పటికే మారియెట్, వ్యాన్ గార్డ్, నెట్ ఫ్లిక్స్, మెక్ డోనాల్డ్స్, హినెకెన్ , జాగర్ , కోస్ట్కో వంటి గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలను ఏర్పాటు చేశాయన్నారు. తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్ గురించి ప్రతినిధి బృందం ఈ సందర్భంగా వివరించిందని, జీసీసీతో పాటు మాన్యుఫాక్షరింగ్ యూనిట్ ఏర్పాటుకు తెలంగాణలో ఉన్న అవకాశాలను పరిశీలించాలని లోరియల్ను ఆహ్వానించారని, రాష్ట్రంలో ఉన్న మౌలిక వసతులు, పరిశ్రమల ఎకోసిస్టమ్‌ను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో తయారీ రంగంలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు హియెరోనిమస్ సానుకూలంగా స్పందించారని ఆమె వెల్లడించారు.

## సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

**జగిత్యాల :** :గత 18 ఏళ్లుగా వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎం ల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలనీ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ఉద్యోగులు మంగళవారం జగిత్యాలలో వినతిపత్రం సమర్పించారు.చాలి చాలని జీతాలతో వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న మా జీవితాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు.మంగళవారం జగిత్యాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి లక్ష్మణ్ కుమార్ కు తెలంగాణ సెకండ్ ఏఎన్ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల మధురిమతో పలువురు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు.ఈ సందర్భంగా మధురిమ మాట్లాడుతూ తెలంగాణ మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ పరిధిలో గత 13 నెలల క్రితం ఎంపిహెచ్ఏ మహిళా ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలను ప్రభుత్వం విడుదల చేసి ఉద్యోగాలను భర్తీచేసి 6 వేల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ లో సెకండ్ ఏ ఎన్ ఎం లను ఆదుకోవాలన్నారు. ఉద్యోగాల్లో ఉండి మరణించిన సెకండ్ ఏఎన్ఎంల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని మధురిమ మంత్రిని కోరారు.ప్రజలకు ముఖ్యంగా గ్రామినా ప్రాంతాల్లో పనిచేస్తున్న సెకండ్ ఏ ఎన్ ఎం ల సమస్యలు పరిష్కరించాలని, అది కాంగ్రెస్ ప్రభుత్వనీ ద్వారానే అవుతుందనే నమ్మకం ఉందని చెబుతూ ప్రభుత్వం మాపై శ్రద్ధ వహించి కోర్కెలు తీర్చాలని మధురిమ కోరారు.మంత్రి లక్ష్మణ్ కుమార్ ను కలిసిన వారిలో మధురిమతో పాటు రజిత భాయి, శారద, రజిత, సౌజన్య, యమున, సరోజ, శిరీష, శైలజ, జయప్రద, జ్యోతి, ఉజ్వల, శ్రవంతి, మహేశ్వరి, మధులత, ఎలిజబెత,మేరీ, సుమలత, చిలుకమ్మ తదితరులున్నారు.

## ముందే కాసిన మామిడి

**రంగారెడ్డి :** వేసవికాలం ప్రారంభం కాకముందే మామిడి పండ్లు బాటసింగారం ఫ్రూట్ మార్కెట్లోకి చేరుకుంటున్నాయి,ఫిబ్రవరి చివరివారం లేదా మార్చి మొదటి వారంలో కొద్దికొద్దిగా రావాల్సిన మామిడి పళ్ళు జనవరి చివరి వారంలోని మార్కెట్లోకి వచ్చాయి ముందటి సంవత్సరాల కంటే ఈసారి కొద్దిగా ముందుగా వచ్చాయని ఫ్రూట్ మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం ఇప్పుడు 50 నుంచి 60 క్వింటాళ్ల మామిడి మార్కెట్ కు వస్తుందని మార్చి తర్వాత భారీగా మామిడి పళ్ళు వచ్చే అవకాశం

బిజినెస్

# అమెజాన్‌లో రిపబ్లిక్ డే సేల్ ఆఫర్లు





ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇటీవల గ్రేట్ రిపబ్లిచ్ డే సేల్‌ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సంస్థ అమెజాన్ బజార్ విభాగంలో కస్టమర్ల కోసం పెద్ద ఎత్తున ఫ్యాషన్, ఎలక్ట్రానిక్ యాక్సెసరీలు, ఇంకా అనేక విభాగాల్లో తక్కువ ధరలో ఉత్పత్తులను అందుబాటులో ఉంచింది. అమెజాన్ గ్రేట్ రిపబ్లిక్ డే సేల్ సందర్భంగా కస్టమర్లు డీల్స్, కొన్ని రకాల ప్రీమియం ఉత్పత్తులపై 80 శాతం వరకు ఆఫర్లను, రూ. 500 వరకు క్యాష్బ్యాక్ పొందవచ్చని తెలిపింది. ముఖ్యంగా రూ. 99 ప్రారంభ ధరలో లభించే వస్తువులపై అమెజాన్ బజార్లో మొదటి ఆర్డర్‌పై రూ.50 వరకు క్యాష్‌బ్యాక్ పొందవచ్చు. ఇదే సమయంలో ప్రైమ్ మెంబర్లకు 5 శాతం క్యాష్బ్యాక్, అమెజాన్ పే ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌పై నాన్-ప్రైమ్ మెంబర్లకు 3 శాతం, రూ. 2,500ల వరకు వెల్ గిఫ్ట్స్ సహా పేమెంట్, రివార్డులతో మరింత ఆదా చేసుకోవచ్చని కంపెనీ వెల్లడించింది. అర్హులైన కస్టమర్లు అమెజాన్ పే లేటర్ ద్వారా రూ. 60,000 వరకు తక్షణ క్రెడిట్ను కూడా యాక్సెస్ చేయవచ్చు. ప్రత్యేకమైన షాపింగ్ రివార్డులను కూడా ఆఫర్ చేస్తున్నట్టు కంపెనీ తెలిపింది. రోజుకు రూ. 99 ఈఎంఐ ద్వారా అమెజాన్ బజార్ నుంచి మొబైళ్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, ఇతర పరికరాలను కొనుగోలు చేయవచ్చు. అంతేకాకుండా ఎంపిక చేసిన బ్యాంక్ కార్డులు, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు, ఈఎంఐ లావాదేవీలపై 10 శాతం వరకు తక్షణ డిస్కౌంట్లను కూడా లభిస్తుంది. అదనంగా క్యాష్బ్యాక్, రివార్డ్స్ లభిస్తాయి. వాటిలో రూ. 799ల కన్నా ఎక్కువ ఆర్డర్లపై ప్రైమ్ మెంబర్లకు 5 శాతం తగ్గింపు, రూ. 499 కన్నా ఎక్కువ విలువ గల ఆర్డర్లపై అందరికీ 10 శాతం క్యాష్బ్యాక్ ఉంటుందని అమెజాన్ తెలిపింది. ఇవి మాత్రమే కాకుండా అనేక రకాల ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డులను అందిస్తున్నట్టు పేర్కొంది.

## బ్రేకుల్లేకుండా దూసుకెళ్తున్న బంగారం



బంగారం, వెండి ధరల పెరుగుదలకు ఇప్పట్లో బ్రేకులు పడే పరిస్థితి కనిపించడం లేదు. అంతర్జాతీయంగా వాటికి ఉన్న డిమాండ్, ఇప్పుడున్న పరిస్థితుల్లో వాటిపైన పెట్టుబడులే సేఫ్ గా భావించి ఇన్వెస్ట్ చేస్తుండటంతో విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మంగళవారం రాత్రి 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,49,780 (చితిబిష్ట్రనీబీబి ఊూ) ఉండగా.. బుధవారం ఉదయానికి ఏకంగా రూ.5 వేలకు పైగా పెరిగింది. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.5020 పెరిగి రూ.1,54,800కు చేరింది. 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర కూడా ఏకంగా రూ.4600 పెరిగి రూ.1,41,900కు చేరింది. 18 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగా పెరిగింది. 10 గ్రాముల ధర రూ.3770 పెరిగి రూ.1,16,110కి చేరింది. వెండిధర స్థిరంగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు వెండి ధర 94 డాలర్ల మార్కును దాటింది. ఔన్సు బంగారం ధర 4849 డాలర్లకు చేరింది. బంగారమే కాదు. ప్లాటినం ధరలు కూడా రోజురోజుకూ భారీగా పెరుగుతున్నాయి. బుధవారం 10 గ్రాముల ప్లాటినం ధర రూ.3460 పెరిగి రూ.71,780కి చేరింది. జనవరి 11 నుంచి నేటి వరకూ 100 గ్రాముల ప్లాటినం ధర రూ.65,460 వరకూ పెరిగింది.

## ఏఐ ప్రయోజనాలు అందరికీ సమానంగా దక్కాలి



కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా కలిగే ప్రయోజనాలు అందరికీ సమానంగా దక్కాలని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. 'విద్య లేదంటే ప్రభుత్వ విధానాల ద్వారా కావచ్చు.. ప్రతి ఒక్కరి జీవన విధానాన్ని మెరుగుపర్చడమే కృత్రిమ మేధ లక్ష్యంగా ఉండాల'ని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో నాదెళ్ల పేర్కొన్నారు. ఏఐపై చర్చంతా సాంకేతిక కంపెనీల కేంద్రంగానే జరిగితే.. అది గాలిబుడగ లాగా అవుతుందని అన్నారు. కీలక ఔషధాలను మార్కెట్లోకి తేవడంలో, క్లినికల్ ట్రయల్స్‌ను వేగవంతం చేయడంలో ఫార్మా కంపెనీలకు కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతుందో చూడాలన్నారు. రోజువారీ జీవితాన్ని ఏఐ ఏ విధంగా మెరుగుపరుస్తుందో పరిశీలించాల్సిన అవసరం ఉందని నాదెళ్ల వివరించారు. కేవలం వినియోగాన్ని పెంచడం పైనే కాకుండా.. ఏఐ ఆధారిత ఆర్థిక వృద్ధిపైనా దృష్టి పెట్టాలని సూచించారు. ఉత్పాదకతను పెంచడంలో, పని విధానాల్లో మార్పులు తేవడంలో ఏఐ, ఇతర అధునాతన సాంకేతికతలు ఎలా ఉపయోగపడుతున్నాయో ఆయన వివరించారు. ప్రజలు, సమాజం, దేశాలు, పరిశ్రమలకు కొంతైనా ప్రయోజనం కలిగేలా మనం ఏఐను వాడుతున్నామా? లేదా? అనే విషయాన్ని గమనిస్తూ ఉండాలని తెలిపారు.

# తన టీవీ వ్యాపారాన్ని చైనా కంపెనీకి అప్పగించిన సోనీ




ప్రముఖ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం సోనీ సంచలన నిర్ణయం తీసుకుంది. తన ప్రఖ్యాత హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యాపారాన్ని చైనాకు చెందిన టీసీఎల్ ఎలక్ట్రానిక్స్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు అప్పగించనున్నట్లు మంగళవారం ప్రకటించింది. ఇందులో భాగంగా సోనీ బ్రావియా టీవీ బ్రాండ్‌తో సహా, తన హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ విభాగంలో 51 శాతం మెజారిటీ వాటాను టీసీఎల్‌కు విక్రయించనుంది. ఈ ఒప్పందం ప్రకారం, ఇరు కంపెనీలు కలిసి ఒక జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయనున్నాయి. ఇది 2027 ఏప్రిల్ నుంచి కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉంది. భవిష్యత్తులో టీవీలు సోనీ, బ్రావియా బ్రాండింగ్‌తోనే మార్కెట్లోకి వస్తాయి. అయితే, వాటిలో ఉపయోగించే డిస్‌ప్లే టెక్నాలజీ మాత్రం టీసీఎల్‌కు చెందినదిగా ఉంటుంది. తక్కువ లాభదాయకత ఉన్న టెలివిజన్ తయారీ రంగం నుంచి వైదొలగడంలో భాగంగానే జపాన్ కంపెనీ అయిన సోనీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఏర్పాటు ద్వారా తయారీ ఖర్చులు, నష్టాలను తగ్గించుకుంటూనే, ప్రపంచవ్యాప్తంగా తమ బ్రాండ్‌కు ఉన్న గుర్తింపును నిలుపుకోవచ్చని సోనీ భావిస్తోంది. ప్లేస్టేషన్ వ్యాపారంతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సోనీ, కొంతకాలంగా సంప్రదాయ ఎలక్ట్రానిక్స్ నుంచి అధిక లాభాలు వచ్చే విభాగాలపై దృష్టి సారిస్తోంది. మరోవైపు, చైనాకు చెందిన అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ సంస్థల్లో ఒకటైన టీసీఎల్, ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్లో వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే అమెరికాలో బడ్జెట్ టీవీ బ్రాండ్‌గా ఎదిగిన ఈ సంస్థ, బ్లాక్‌బెర్రీ, ఆల్కాటెల్ వంటి బ్రాండ్లను కూడా లైసెన్స్ కింద నడుపుతోంది. ఈ ఒప్పందం ద్వారా సోనీ బ్రాండ్ ఇమేజ్‌ను ఉపయోగించుకుని ప్రీమియం టీవీ సెగ్మెంట్‌లో తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవాలని టీసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన అనుభూతిని అందిస్తామని సోనీ, టీసీఎల్ ప్రతినిధులు తెలిపారు.

# అద్భుతమైన ప్లేయర్.. టీమిండియా టీ20 కెప్టెన్‌గా అతడే!




టీ20 ప్రపంచకప్-2026 టోర్నమెంట్లో డిఫెండింగ్ చాంపియన్‌గా టీమిండియా బరిలో దిగనుంది. సొంతగడ్డపై ఈ ఐసీసీ ఈవెంట్ జరుగనుండటం సూర్యకుమార్ సేనకు మరో సానుకూలాంశం. ఇక ఈ మెగా టోర్నీకి సన్నాహకంగా న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత్ పాల్గొననుంది. ఇదిలా ఉంటే.. కివీస్‌తో పాటు ప్రపంచకప్ టోర్నీకి ఎంపిక చేసిన భారత జట్టు నుంచి సెలక్టర్లు శుబ్‌మన్ గిల్‌ను తప్పించిన విషయం తెలిసిందే. టెస్టు, వన్డే జట్లకు కెప్టెన్‌గా ఉన్న గిల్.. చాన్నాళ్ల తర్వాత అంతర్జాతీయ టీ20లలోకి తిరిగి వచ్చి వరుసగా విఫలం కావడమే ఇందుకు కారణం.

**అద్భుతమైన ఆటగాడు**

ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైకేల్ క్లార్క్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. వరల్డ్‌కప్ టోర్నీ తర్వాత గిల్ భారత టీ20 జట్టులోకి తిరిగి రావడమే కాకుండా.. ఏకంగా కెప్టెన్ కూడా అవుతాడని అంచనా వేశాడు. ఈ సందర్భంగా గిల్ అద్భుతమైన ఆటగాడు అని క్లార్క్ ప్రశంసలు కురిపించాడు.

**ఫామ్‌లేమి కారణంగానే**

బియాండ్23క్రికెట్ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ.. "ఇప్పటికీ అతడు పోటీలోనే ఉన్నాడు. ప్రస్తుతం జట్టుకు అవసరమైన రీతిలో అతడు బ్యాటింగ్ చేయడం లేదన్న కారణంగా పక్కనపెట్టారు. అంతేకాదు.. టీమిండియాకు లెక్కకు మిక్కిలి ఓపెనింగ్ బ్యాటర్ ఆప్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం అతడు కెప్టెన్ కూడా కాదు. అందుకే వరల్డ్‌కప్ జట్టు నుంచి అతడిని తొలగించే సాహసం చేశారు. ప్రపంచకప్ టోర్నీకి సన్నాహకంగా భావిస్తున్న న్యూజిలాండ్ సిరీస్‌కు కూడా అతడిని ఎంపిక చేయలేదు. ఫామ్‌లేమి కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు.

**కెప్టెన్సీ చేపట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు**

అయితే, ప్రపంచకప్ టోర్నీ ముగిసిన తర్వాత గిల్ జట్టులోకి తిరిగి రావడమే కాదు.. కెప్టెన్సీ చేపట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అతడొక అద్భుతమైన ప్లేయర్. ప్రస్తుతం అతడు ఫామ్‌లో లేకపోవచ్చు. అయితే, కెప్టెన్ అయ్యేందుకు అతడికి అర్హత ఉంది. ప్రస్తుతానికి వరల్డ్‌కప్ టోర్నీ మీద దృష్టి పెట్టినందు వల్లే మేనేజ్‌మెంట్ అతడిని తప్పించింది" అని క్లార్క్ అభిప్రాయపడ్డాడు.

**రోహిత్ స్థానంలో సూర్య, గిల్**

కాగా రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన తర్వాత సూర్యకుమార్ యాదవ్ భారత టీ20 జట్టు సారథిగా అతడి స్థానాన్ని భర్తీ చేశాడు. ఇక టెస్టుల్లో రోహిత్ రిటైర్మెంట్ తర్వాత శుబ్‌మన్ గిల్ పగ్గాలు చేపట్టగా.. గతేడాది వన్డే కెప్టెన్సీ నుంచి రోహిత్‌ను తప్పించి గిల్‌కు ఆ బాధ్యతలు అప్పగించింది యాజమాన్యం. అయితే, క్లార్క్ అభిప్రాయ పడినట్లు వరల్డ్‌కప్ తర్వాత గిల్ సూర్య స్థానాన్ని భర్తీ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. కాగా ఫిబ్రవరి 7- మార్చి 8 వరకు భారత్- శ్రీలంకలు వేదికలుగా టీ20 ప్రపంచకప్-2026 నిర్వహణకు షెడ్యూల్ ఖరారైంది.

## కోహ్లీని వెనక్కి నెట్టేసిన కివీస్ బ్యాటర్.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో మిచెల్ టాప్



**ముంబై :** ఐసీసీ మెన్స్ వన్డే ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ బ్యాటర్ డారెల్ మిచెల్ తొలి స్థానాన్ని ఆక్రమించేశాడు. తాజాగా భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో రెండు సెంచరీలు చేసిన ఆ బ్యాటర్ .. విరాట్ కోహ్లీని వెనక్కి నెట్టేశాడు. అత్యంత వేగంగా వన్డేల్లో 9 సెంచరీలు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. కేవలం 54 ఇన్నింగ్స్‌ల్లో అతను 9 సెంచరీలు కొట్టాడు. భారత్‌తో జరిగిన సిరీస్‌లో మిచెల్ 352 రన్స్ స్కోరు చేశాడు. డారెల్ మిచెల్ 845 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో 795 పాయింట్లతో కోహ్లీ రెండో స్థానంలో నిలిచాడు. వన్డే క్రికెట్‌లో మిచెల్ మొదటి ర్యాంక్ దక్కించుకోవడం ఇది రెండోసారి.

స్పోర్ట్స్

## అయోమయంలోనే ఉన్నాం.. టీ20 వరల్డ్‌కప్‌లో ఆడేది డౌటే బంగ్లా కెప్టెన్ లింటన్ దాస్




**ఢాకా:** వచ్చే నెలలో ప్రారంభంకానున్న టీ20 వరల్డ్‌కప్‌లో ఆడేది డౌట్‌గానే ఉందని బంగ్లాదేశ్ కెప్టెన్ లింటన్ దాస్ అన్నారు. ఇండియాలో తాము ఆడబోమని బంగ్లా క్రికెట్ బోర్డు చెప్పడంతో.. ఆ దేశ ప్రాతినిధ్యంపై ప్రస్తుతం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో ఆడుతున్న ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను బీసీసీఐ తప్పించింది. ఆ ఘటన తర్వాత ఇండియా వేదికగా జరిగే మ్యాచుల్లో తాము ఆడబోమని బంగ్లాదేశ్ చెప్పింది. దీంతో వరల్డ్‌కప్ వివాదం మరింత ముదిరింది. వరల్డ్‌కప్ కోసం జట్టును ప్రకటించామని, కానీ తమ ఆడబోయే ప్రత్యర్థులు ఎవరు, ఏ దేశానికి వెళ్తున్నామని తెలిస్తే బాగుండేదని లింటన్ దాస్ అన్నాడు. తనలాగే యావత్ బంగ్లాదేశ్ అయోమయంలో ఉన్నట్లు పేర్కొన్నాడు. భారత్ వేదికగా జరగాల్సిన మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని బంగ్లాదేశ్ అభ్యర్థించింది. కానీ ఐసీసీ మాత్రం ఆ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నది. ఇండియాలో ఆడేందుకు బంగ్లాదేశ్ నిరాకరిస్తున్న విషయంపై ఆ దేశానికి మద్దతు ఇస్తున్నట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చెప్పింది. అయితే ఇవాళ జరిగే ఐసీసీ బోర్డు మీటింగ్‌లో బంగ్లా పాత్రపై నిర్ణయం తీసుకోనున్నారు.

ధర్మఘంట



# హెబ్బా పటేల్ రొమాంటిక్ థ్రిల్లర్.. ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్

హెబ్బా పటేల్, అనిరుధ్ శ్రీవాత్సవ్ జంటగా నటించిన రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మారియో. ఈ చిత్రాన్ని కల్యాణ్ జీ గోగన దర్శకత్వంలో తెరకెక్కించారు. సిల్వర్ స్క్రీన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో నిర్మించిన ఈ చిత్రం.. గతేడాది డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చింది. అయితే ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. కాగా.. నాటకం, తీస్ మార్ ఖాన్ లాంటి డిఫరెంట్ చిత్రాలతో దర్శకుడిగా కల్యాణ్ జీ ఆడియన్స్‌ను మెప్పించారు. తాజాగా ఈ మూవీ ఓటీటీకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ నెల 23 నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని ఓటీటీ సంస్థ అఫీషియల్‌గా ప్రకటించింది. ఈ మేరకు హెబ్బా పటేల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పంచుకుంది. కాగా.. ఈ చిత్రానికి సాయి కార్తీక్, రాకేందు మౌళి సంగీతమందించారు.




# తృప్తి దిమ్రితో షాహిద్ రొమాన్స్.. 'ఓ రోమియో' ట్రైలర్ రిలీజ్

బాలీవుడ్ వెండితెరపై మరో క్రేజీ కాంబినేషన్ సందడి చేయబోతోంది. స్టార్ హీరో షాహిద్ కపూర్, సెన్సేషనల్ బ్యూటీ తృప్తి దిమ్రి జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ రొమాంటిక్ డ్రామా 'ఓ రోమియో'. ఈ చిత్రం వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గతంలో 'కమినే', 'హైదర్', 'రంగూన్' వంటి క్లాసిక్ చిత్రాలను అందించిన టాలెంటెడ్ డైరెక్టర్ విశాల్ భరద్వాజ్ నాలుగోసారి షాహిద్ కపూర్‌తో జతకడుతుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాద్వాలా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. సినిమా విడుదల తేదీ దగ్గరపడటంతో మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తాజాగా విడుదలైన ఈ సినిమా ట్రైలర్ సినీ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ముంబై అండర్ వరల్డ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే పవర్‌ఫుల్ క్రైమ్ అండ్ లవ్ స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. ముఖ్యంగా షాహిద్ కపూర్ మునుపెన్నడూ లేని విధంగా అత్యంత భయంకరమైన 'వైల్డ్' లుక్‌లో కనిపిస్తూ షాక్ ఇచ్చారు. ఒళ్లంతా టాటూలు, రక్తపు మరకలతో ఉన్న ఆయన లుక్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఈ చిత్రంలో తృప్తి దిమ్రితో పాటు నానా పటేకర్, అవినాష్ తివారీ, విక్రాంత్ మస్సే, దిశా పటానీ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా ఒక ప్రత్యేక పాత్రలో మెరవనుండటం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

# ఎట్టకేలకి బాయ్‌ఫ్రెండ్ గురించి ఓపెన్‌గా చెప్పిన చిట్టి..

తెలుగు సినిమా రంగంలో గ్లామర్‌కు మాత్రమే పరిమితం కాకుండా, నటన, డ్యాన్స్, మ్యూజిక్ వంటి విభిన్న అంశాల్లో తన ప్రత్యేకతను చూపిస్తున్న హీరోయిన్లలో ఫరియా అబ్దుల్లా ఒకరు. అందంతో పాటు అభినయంతోనూ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ, మల్టీ టాలెంటెడ్ ఆర్టిస్ట్‌గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరుచుకుంటున్నారు. కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, తనలోని ప్రతిభను విస్తరించుకుంటూ ముందుకు సాగుతున్న ఫరియా, తాజాగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుని వార్తల్లో నిలిచారు. 2021లో విడుదలైన జాతిరత్నాలు చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది ఫరియా. ఆ సినిమాలో 'చిట్టి' పాత్రతో ఒక్కసారిగా ఫేమ్ అందుకున్న ఫరియా, ఆ తర్వాత తన ప్రతిభకు తగ్గ పాత్రలను ఎంచుకుంటూ కెరీర్‌ను కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్, బంగార్రాజు, రావణాసుర, ఆ ఒక్కటి అడక్కు, కల్కి, మత్తు వదలరా 2, గుర్రం పాపిరెడ్డి, అనగనగా ఒకరోజు వంటి చిత్రాల్లో నటించి, నటిగానే కాకుండా తన వర్సటాలిటీని నిరూపించుకున్నారు. ముఖ్యంగా మత్తు వదలరా 2, గుర్రం పాపిరెడ్డి సినిమాల్లో ఆమె చేసిన ర్యాప్ పాటలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డ్యాన్స్, మ్యూజిక్, ర్యాప్‌లోనూ ఫరియా చూపుతున్న ఆసక్తి ఆమెను మిగతా హీరోయిన్లకు భిన్నంగా నిలబెడుతోంది. ఇటీవల ఓ సినిమా ప్రమోషన్ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఫరియా అబ్దుల్లా, తన లవ్ లైఫ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడారు. ప్రస్తుతం తాను ప్రేమలో ఉన్నానని వెల్లడించిన ఆమె, ఆ రిలేషన్‌షిప్ తన పర్సనల్ లైఫ్‌తో పాటు ప్రొఫెషనల్ లైఫ్‌ను కూడా బ్యాలెన్స్ చేయడంలో ఎంతో సహాయపడుతోందని చెప్పారు. తన జీవితంలో ఈ దశకు ప్రేమే ప్రధాన ప్రాధాన్యతగా ఉందని ఫరియా పేర్కొన్నారు. ఇంకా తన ప్రియుడి గురించి మాట్లాడుతూ, అతడు ముస్లిం కాదని, హిందూ యువకుడని స్పష్టం చేశారు. అతడు తన బాల్య స్నేహితుడు కాదని, సినిమా ఇండస్ట్రీకి చెందిన వ్యక్తేనని తెలిపారు. తాను ప్రేమిస్తున్న వ్యక్తి ఒక యంగ్ కొరియోగ్రాఫర్ అని, ఇద్దరూ కలిసి వర్క్ చేస్తూ ఒక టీమ్‌లా ముందుకు సాగుతున్నామని చెప్పారు. తన మ్యూజిక్, డ్యాన్స్, ర్యాప్‌లో వచ్చిన అభివృద్ధికి అతడిచ్చే ప్రోత్సాహమే కారణమని ఫరియా స్పష్టంగా చెప్పడం గమనార్హం.





# మహేశ్‌రాజమౌళి 'వారణాసి'పై క్రేజీ అప్‌డేట్ ఇచ్చిన మేకర్స్..

టాలీవుడ్‌లో స్పెషల్ క్రేజ్ ఉన్న కాంబినేషన్ ఏదైనా ఉందంటే అది సూపర్‌స్టార్ మహేశ్ బాబు దర్శకధీరుడు రాజమౌళి జంట అనే చెప్పాలి. ఈ ఇద్దరి కలయికలో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'వారణాసి'పై ఇప్పటికే దేశవ్యాప్తంగా అంచనాలు భారీగా ఏర్పడ్డాయి. రెండు నెలల క్రితం హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రాండ్ ఈవెంట్‌లో ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, విడుదల సంవత్సరాన్ని కూడా మేకర్స్ వెల్లడించారు. అయితే రాజమౌళి సినిమాలు అనుకున్న షెడ్యూల్‌కు కచ్చితంగా పూర్తవుతాయా అనే సందేహం ప్రేక్షకుల్లో కొత్తది కాదు. గత చిత్రాల అనుభవం నేపథ్యంలో, 'వారణాసి' నిజంగా 2027లో విడుదల అవుతుందా? అనే ప్రశ్నలు సోషల్ మీడియాలో గట్టిగానే వినిపించాయి. ఈ నేపథ్యంలో తాజాగా చిత్రబృందం మరోసారి స్పందించి, సినిమా 2027లోనే ప్రేక్షకుల ముందుకు వస్తుందని స్పష్టత ఇచ్చింది. ఈ ప్రకటనతో కొంతమంది అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తుండగా, మరికొందరు మాత్రం ఇంకా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఉగాది లేదా శ్రీరామనవమి లాంటి పండుగ సీజన్‌లో సినిమా విడుదలయ్యే అవకాశముందని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. అయితే, ఇంకా ఏడాది మాత్రమే మిగిలి ఉండటంతో అంత భారీ ప్రాజెక్ట్‌ను ఆలోపు పూర్తి చేయగలరా అనే చర్చ కూడా జోరుగా సాగుతోంది. ఈ చిత్రంలో మహేశ్ బాబు సరసన గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇది మహేశ్ కెరీర్‌లోనే కాకుండా, ప్రియాంకకు కూడా ఒక ప్రత్యేకమైన ఇండియన్ ప్రాజెక్ట్‌గా మారనుంది. విలన్ పాత్రలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనుండటం మరో హైలైట్. అంతేకాదు, సినిమాలో ఒక కీలక ఘట్టంలో మహేశ్ బాబు రాముడి పాత్రలో కనిపిస్తారని రాజమౌళి ఇప్పటికే వెల్లడించడంతో ఈ అంశంపై కూడా భారీ ఆసక్తి నెలకొంది. 'వారణాసి'ని టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో, భారతీయ పురాణాలు, ఆధునిక సైన్స్‌ను మేళవిస్తూ రూపొందిస్తున్నారని సమాచారం. భారీ బడ్జెట్, అంతర్జాతీయ స్థాయి టెక్నికల్ టీమ్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అభిమానులు "రిలీజ్ ఆలస్యమైనా పర్వాలేదు, కానీ ఇది లైఫ్‌టైమ్ ఎక్స్‌పీరియన్స్ మూవీ కావాలి" అంటూ సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, మేకర్స్ 2027 డేట్‌కు కట్టుబడి ఉన్నామని మరోసారి స్పష్టం చేసినప్పటికీ, ఈ సినిమా చుట్టూ ఉన్న క్యూరియాసిటీ మాత్రం రోజు రోజుకీ పెరుగుతూనే ఉంది. 'వారణాసి' ఎప్పుడు వచ్చినా, అది భారతీయ సినిమాకు మరో మైలురాయిగా నిలుస్తుందనే నమ్మకం అభిమానుల్లో బలంగా ఉంది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108


# కంపు వాసన,కచ్చా రోడ్లతో మన మున్సిపాలిటీలు

తెలంగాణ రాష్ట్రంలో మున్సిపాలిటీల పరిధిలో రోడ్లు మరియు మురుగు వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కచ్చా రోడ్లు,గుంతలు,మురికి నీటి ప్రవాహాలు వల్ల రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోతోంది. ఇటీవల వర్షాల తర్వాత ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యాయి.ముఖ్యంగా మేడ్చల్-మల్కాజిగిరి,ఆదిలాబాద్,వరంగల్ వంటి జిల్లాల్లో మున్సిపాలిటీలలో దుర్గంధం మరియు ప్రమాదాలు సాధారణమయ్యాయి.మున్సిపాలిటీలలో రోడ్లు పూర్తిగా పాడవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఇటీవల ఏర్పడిన అలియాబాద్,మూడుచింతలపల్లి,ఎల్లంపేట మున్సిపాలిటీలలో రోడ్లు మరియు మురుగు నీటి వ్యవస్థలు అభివృద్ధి లేకుండా ఉన్నాయి.వర్షాలు పడినప్పుడు మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ విపరీతమైన దుర్గంధాన్ని వ్యాపింపజేస్తోంది.ఇది స్థానికుల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోంది.వరంగల్ జిల్లాలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారడంతో మురికి నీరు రోడ్లపై నిలిచి ఉండటం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. చుట్టుపక్కల నివసిస్తున్న వారు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు.



రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల స్థితి మరింత దారుణంగా ఉంది. 2025లో వర్షాల వల్ల 854 కి.మీ.రోడ్లు దెబ్బతిన్నాయి. జిహెచ్ఎంసి పరిధిలో 9,899 గుంతలు ఏర్పడ్డాయి.ప్రభుత్వం రూ.1,030 కోట్లు రిపేర్లకు కేటాయించినప్పటికీ,నిర్వహణ లోపాల వల్ల సమస్యలు కొనసాగుతున్నాయి.రోజుకు సగటున 70 ప్రమాదాలు,20 మరణాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం కచ్చ గుంతలు ప్రధాన కారణం. ఆదిలాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు దుస్థితికి చేరాయి,పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోనూ మరమ్మతులు జరగడం లేదు.హైదరాబాద్ నగరంలో కూడా చెత్త సమస్య తీవ్రంగా ఉంది.రోడ్ల పక్కన చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది.ఇది రవాణాను అస్తవ్యస్తం చేస్తోంది.జిహెచ్ఎంసి అధికారులు పలు ఫిర్యాదులు వచ్చినా స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.స్థానికులు దోమలు,కుక్కలు వంటి సమస్యలతో బాధపడుతున్నారు.ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి రూ.5,907 కోట్లు కేటాయించినప్పటికీ,అమలు లోపాల వల్ల మున్సిపాలిటీలలో మార్పు కనిపించడం లేదు. నిపుణులు మెరుగైన నిర్వహణ, ఆధునిక వ్యవస్థలు అవసరమని సూచిస్తున్నారు.ప్రజలు శాశ్వత పరిష్కారాలు కోరుతున్నారు. లేకుంటే ఈ సమస్యలు మరింత తీవ్రమవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.త్వరలో మున్సిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోటీలో ఉండే ప్రధాన పార్టీల అభ్యర్థులకు ఈ సమస్యలు స్వాగతం పలికే అవకాశం ఉంది.

# గన్నేరువరం మండల ఉప సర్పంచుల ఫోరం చైర్మన్ గా వంగల లక్ష్మారెడ్డి.





**ధర్మఘంట, జనవరి 21, కరీంనగర్:** గన్నేరువరం మండల ఉప సర్పంచుల ఫోరం చైర్మన్ గా వంగల లక్ష్మారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఎల్.ఎం.డీ కాలనీలో ఎం.ఎల్.ఏ క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉప సర్పంచుల సమావేశంలో గుండ్లపల్లి గ్రామ ఉపసర్పంచ్ వంగల లక్ష్మారెడ్డిని మండల ఉప సర్పంచుల చైర్మన్ గా ఎన్నుకున్నారు. మండలంలో 11 గ్రామ పంచాయతీలు ఉండగా, మెజార్టీ సంఖ్యలో 10 గ్రామాలకు చెందిన ఉప సర్పంచులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో గుండ్లపల్లి ఉపసర్పంచ్ వి.జ్యోతి, చీమలకుంటపల్లి ఉప సర్పంచ్ జి.ప్రవళిక, పీచుపల్లి ఉపసర్పంచ్ శ్రీనివాసరెడ్డి, గోపాల్ పూర్ ఉపసర్పంచ్ బి.శంకర్, మాదాపూర్ ఉపసర్పంచ్ కే.అనిత, యాస్వాడ ఉపసర్పంచ్ జి.భాగ్యలక్ష్మి, చాకలివానిపల్లె ఉప సర్పంచ్ కె.సంపత్, కాసింపేట్ ఉప సర్పంచ్ ఐలయ్య, గుండ్లపల్లి ఉప సర్పంచ్ లక్ష్మారెడ్డి, జంగపల్లి ఉప సర్పంచ్ ప్రభాకర్ ఉన్నారు.అనంతరం వీరంతా మర్యాదపూర్వకంగా మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలిశారు. ఈ సందర్భంగా మండల ఉపసర్పంచ్ ల ఫోరం చైర్మన్ వంగల లక్ష్మా రెడ్డితోపాటు ఉప సర్పంచులను ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ సన్మానించారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు బీజేపీకే ఉంది

## బిజెపి రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

**ధర్మఘంట, జనవరి 21 రాజన్న సిరిసిల్ల :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కేవలం భారతీయ జనతా పార్టీకి మాత్రమే ఉన్నదని, ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే మున్సిపాలిటీల మనుగడ సాగుతుందని భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. బుధవారం సిరిసిల్ల బిజెపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గడ్డబోయిన గోపి మాట్లాడుతూ సిరిసిల్ల పట్టణానికి కేంద్ర ప్రభుత్వం అర్బన్ డెవలప్మెంట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కింద 15 కోట్లు మున్సిపాలిటీలకు ఇచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా మూడు కోట్లు కలిపి మొత్తం మేమే మంజూరు చేసినట్లు వాటిని ఇనాగ్రేషన్ చేయడానికి సిద్ధపడటం సిగ్గుచేటు అన్నారు. సొమ్మొకరిది సోకొకడిది అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు కేవలం బిజెపికి మాత్రమే ఉందన్నారు. మున్సిపాలిటీలకు పట్టణ ప్రగతి కింద 30 లక్షలు నిధులు వస్తే వాటిని సిబ్బంది జీతాలకు వాడుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత్ స్కీం కింద సిరిసిల్ల మున్సిపాలిటీకి 104 కోట్లు మంజూరు





చేసిందని, అట్టి నిధులను రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు వేసి రేవంత్ రెడ్డి బామ్మర్ది షోద కంపెనీకి టెండర్ వచ్చేలా చేసినట్లు ఆరోపించారు. 14 ,15 ఫైనాన్స్ ద్వారా సిరిసిల్ల మున్సిపాలిటీకి వచ్చిన రెండు కోట్ల రూపాయలు దేనికి వెచ్చించారో సమాధానం చెప్పాలన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి పార్టీ అభ్యర్థులను గెలిపించి సిరిసిల్ల మున్సిపాలిటీ మరింత అభివృద్ధి చేసుకుందామని గోపి అన్నారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి పనులపై సిబిఐ విచారణ కోరుతామని రెడ్డబోయిన గోపి అన్నారు.

# అల్ఫోర్స్ టైనీ టాట్స్ లో ఘనంగా లిటిల్ లెజెండ్స్ లీగ్.

**ధర్మఘంట, జనవరి 21, కరీంనగర్:** విద్యార్థులకు ప్రాథమిక దశ నుండి క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని మరియు వివిధ క్రీడల పట్ల కలిగేటువంటి లాభాలను వారికి సమగ్రంగా తెలియజేయవలసిన అవసరం చాలా ఉందని అల్ఫోర్స్ విద్యా సంస్థను అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీ టాట్స్ ప్రాంగణంలో (ప్రైమరీ క్యాంపస్) నిర్వహించిన లిటిల్ లెజెండ్స్ పోటీల ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ క్రీడల పట్ల ఆసక్తి తగ్గడం లేదని సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు వివిధ క్రీడల పట్ల అవగాహన కలిగి ఉండడంతో వారు ఎంపిక చేసుకునేందుకు సులభంగా ఉంటుందన్నారు. విద్యార్థులందరూ వాటి పట్ల ఆసక్తిని ప్రదర్శించడమే కాకుండా వివిధ స్థాయిలలో




నిర్వహింపబడే పోటీలలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. వార్షిక ప్రణాళికల భాగంగా నేడు పాఠశాలలో విద్యార్థులకు అద్భుతమైన క్రీడ పోటీలను నిర్వహించడం చాలా హర్షించదగ్గ విషయమని తెలుపుతూ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన




వారికి ప్రత్యేకంగా నిర్వహించిన వేడుకలలో బహుమతులను ప్రధానం చేయడం జరుగుతుందని వారు చెప్పారు.క్రీడల పోటీల్లో భాగంగా చిన్నారులకు లెమన్ & స్పూన్, మ్యూజికల్ చైర్, బుక్ బ్యాలెన్స్, ఫ్రాగ్ జంపింగ్ & తదితర వినోదాత్మక క్రీడలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మన ఊరు విద్యలో ముందుండాలి

- ప్రతి ఒక్కరు గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలి
- సర్పంచ్ కొల్లపూరి రాములమ్మ



**ధర్మ ఘంట జనవరి 21,మునగాల :** మన ఊరు విద్యలో ముందుండాలని, ప్రతి ఒక్కరు గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని ముకుందాపురం గ్రామ సర్పంచ్ కొల్లపూరి రాములమ్మ అన్నారు. మండల కేంద్రంలోని ముకుందాపురం గ్రామంలో గురుకుల ఐదో తరగతి మరియు మిగిలివున్న 6వ,7వ,8వ,9వ తరగతుల ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ కోరకు గురుకుల ప్రచారంలో భాగంగా మునగాల ప్రిన్సిపల్ గుండా శ్రీరామ్ గురుకుల సిబ్బంది ఆధ్వర్యంలో ముకుందాపురం గ్రామంలో వీధి వీధి తిరుగుతూ ర్యాలీ నిర్వహించి అప్లికేషన్ చేసుకోగలరని , చివరి తేదీ ఈనెల 25 తారీకు వరకు ఉందని అన్నారు .గురుకులాల్లో ఉన్నటువంటి వసతులు సౌకర్యాల గురించి విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులకు గ్రామ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ పెద్దలు,గ్రామ ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ వ్యవస్థను అస్తవ్యస్థం చేస్తే చర్యలు ఖాయం

పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటీ మాచన రఘునందన్



**ధర్మఘంట జనవరి 21 మునుగోడు:** డీలర్లు చౌక దుకాణాలను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తే క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడమే గాక,అవసరమైతే కేసులు నమోదుకు కూడా వెనుకాడబోమని పౌర సరఫరా శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాహశీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా మునుగోడు పట్టణంలో ఆయన మాట్లాడుతూ..కార్డు దారులను విఐపిలుగా పరిగణించాలని సూచించారు.సమయపాలన పట్ల నిర్లక్ష్యంగా ఉంటే ఫిర్యాదులకు ఆస్కారం కలుగుతుందన్నారు.ప్రజా పంపిణీ వ్యవస్థను బాధ్యతాయుతంగా నిర్వహిస్తే ప్రజల ఆదరణ పెరుగుతుందని స్పష్టం చేశారు.ఇష్టారాజ్యంగా నిర్వహిస్తే,డీలర్ షిప్ రద్దుకు సిఫారసు చేసే పరిస్థితికి ఆస్కారం కలుగుతుందన్నారు. డీలర్లు కూడా చిన్న చిన్న పొరపాట్లకు అవకాశం లేకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ఆరోపణలు వచ్చిన రత్తిపల్లి గ్రామ రేషన్ దుకాణంపై సమగ్ర నివేదికను రూపొందించి సమర్పించనునట్టు తెలిపారు.

## రాంరెడ్డిపల్లిలో నర్సరీ పనులను ప్రారంభించిన సర్పంచ్ లపంగి నర్సింహా



**ధర్మఘంట జనవరి 21మర్రిగూడ :** నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీలో 2026-27 సంవత్సరానికి నర్సరీ పనులను బుధవారం సర్పంచ్ లపంగి నర్సింహా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2026-27 సంవత్సరానికి గాను 7వేల మొక్కలు పెంచుతున్నట్లు తెలిపారు.నాణ్యమైన విత్తనాలు నాటి,లక్ష్యానికి అనుగుణంగా పూలు, పండ్ల మొక్కలను పెంచాలని సిబ్బందికి సూచించారు.నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం అందరి బాధ్యత అన్నారు.అనంతరం భీమనగొని బుచ్చమ్మ పార్థివ దేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొగాకు పెద్ద సైదులు,పంచాయతీ కార్యదర్శి నజీర్,ఫీల్డ్ అసిస్టెంట్ సల్వోజ్ యాదయ్య,వార్డు సభ్యులు ఎరుకల నిరంజన్,లపంగి మహేందర్,కొత్త లింగస్వామి,పగిళ్ల దవలమ్మ,నాగిళ్ళ అంజమ్మ, పగిళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్...

**సాంఘిక పరిజ్ఞానంతో విద్యార్థులలో నైతికత అభివృద్ధి.....**

**విజేతలకు అభినందనలు..**






**కోదాడ జనవరి 21,ధర్మఘంట:** బుధవారం నాడు పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కోదాడలో, సాంఘిక శాస్త్ర ఫోరం సారథ్యంలో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహణ జరిగింది. మండల విద్యాధికారి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి .సలీం షరీఫ్, జిహెచ్ఎం కాపుగల్లు ఎమ్. రామారావు పాల్గొని మాట్లాడినారు. సాంఘిక శాస్త్ర విభాగాలు చరిత్ర పౌరనీతి ఆర్థికం భూగోళ శాస్త్రాల అధ్యయనం ద్వారా విద్యార్థులలో నైతికత అభివృద్ధి జరుగుతుందని, నేటి విద్యార్థులు రేపటి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలిపినారు. మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్ లో ఇంగ్లీష్ మీడియంలో బి. హరి ప్రథమ స్థానం జిల్లా పరిషత్తు బాలల ఉన్నత పాఠశాల కోదాడ, ద్వితీయ స్థానం సువర్ణ జెడ్ పి ఎస్ ఎస్ నల్లబండగూడెం, వీర ఉపేంద్ర సాయి జడ్.పి.హెచ్.ఎస్ కూచిపూడి, తృతీయ స్థానం కె. మాధురి జడ్.పి.హెచ్.ఎస్ కాపుగల్లు, పూజ శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ బాలికలు కోదాడ, తెలుగు మీడియంలో ప్రథమ స్థానం డి .పావని జడ్.పి.హెచ్.ఎస్ కాపుగల్లు, ద్వితీయ స్థానం శ్రీ విందు జడ్.పి.హెచ్.ఎస్ తమ్మర, తృతీయ స్థానం ఎస్. వరలక్ష్మి జడ్.పి.హెచ్.ఎస్ తమ్మరబండ పాలెం విద్యార్థులకు మెమొంటోలు అందించి, అభినందించారు. కోదాడ మండల సోషల్ ఫోరం కన్వీనర్ ఎస్. జ్యోతి, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు తీగల నరేష్, బడుగుల సైదులు, కందిమల రవి, శ్రీనివాసరావు, సతీష్, చంద్రశేఖర్ రెడ్డి, సత్యవతి నాగజ్యోతి ,స్వప్న, కరుణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వరంగల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్ రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు



**ధర్మఘంట వరంగల్, జనవరి 21:** వరంగల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్ రెడ్డి ఇంట్లో ఏసీబీ అధికారులు(రాజదీ ఞఖఙసం) బుధవారం సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఏసీబీ ఈ సోదాలు నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది. గత నెలలో లంచం తీసుకుంటూ వెంకట్ రెడ్డి ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ క్రమంలో ఆయన్ను విచారించగా.. భారీగా ఆస్తులను కూడబెట్టినట్లు అధికారులు గుర్తించారు. అందులో భాగంగానే మంచిరేవులలోని ఆయన నివాసంతో పాటు మరికొన్ని చోట్ల ఏసీబీ దాడులు చేపట్టింది. హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సమయంలో ఓ ప్రైవేట్ పాఠశాల గుర్తింపు పత్రాల పునరుద్ధరణ కోసం దాదాపు రూ.60,000 లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు వెంకట్ రెడ్డి. అదే సమయంలో ఆయన ఉంటున్న ఇంట్లో సోదాలు జరుపగా పెద్ద మొత్తంలో నగదు బయటపడింది. అటు.. నల్గొండ జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలోనూ వెంకట్ రెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం.. వెంకట్ రెడ్డి ఇంట్లో సోదాలు కొనసాగుతుండగా.. విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఘనంగా ఖేల్ కి జోష్.



**ధర్మఘంట, జనవరి 21, కరీంనగర్:** క్రీడల ద్వారా విద్యార్థులకు ఒత్తిడి నుండి ఉపశమనం లభించడమే కాకుండా మానసికంగా శారీరకంగా అభివృద్ధి చెందుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో "అల్ఫోర్స్ ఖేల్ కి మస్తీ" పేరుతో ఏర్పాటు చేసిన క్రీడాపోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు ఎన్నో లాభాలు చేకూర్చడమే కాకుండా వారికి చదువు పట్ల ఆసక్తిని పెంపొందిస్తుందన్నారు. మన భారత దేశంలో క్రీడా రంగానికి ఎనలేని ప్రాముఖ్యత ఉన్నదని, చాలామంది క్రీడారంగంలో రాణించడం ద్వారా విజేతలగా ఉన్నారని వారు చెప్పారు.విద్యార్థులకు నూతనోత్సాహం పెంపొందించడానికి, స్నేహపూర్వకమైన వాతావరణం కల్పించడానికి నేడు పాఠశాలలో వివిధ రకాల క్రీడాలను నిపుణులైన వ్యాయామ ఉపాధ్యాయులతో నిర్వహించడం జరిగినదని వారు చెప్పారు. వేడుకలలో భాగంగా విద్యార్థులకు ఫుట్బాల్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డి, స్కిప్పింగ్, చెస్, క్యారమ్స్,తదితర పోటీలను నిర్వహించడం జరిగింది.అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి బహుమతులను త్వరలో నిర్వహించే ప్రత్యేక వేడుకలో ప్రధానం చేయడం జరుగుతుందని వారు చెప్పారు.పాఠశాల వార్షిక ప్రణాళికలో భాగంగా నిర్వహించిన క్రీడలను తల్లిదండ్రులు స్వాగతించారు,ఎల్లప్పుడూ విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీస్తున్నటువంటి అల్ఫోర్స్ విద్యాసంస్థల యాజమాన్యానికి వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేరేళ్లపల్లిలో భారీ అగ్నిప్రమాదం

**షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె పూర్తిగా దగ్ధం**

**గృహవాసులకు తృతులో తప్పిన ప్రమాదం**

**ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్న పొగాకు నాగేష్**



**నాంపల్లి/ధర్మఘంట: జనవరి: 21** నల్గొండ జిల్లా నాంపల్లి మండలం నేరేళ్లపల్లి గ్రామంలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో గ్రామానికి చెందిన పొగాకు నగేష్ అనే వ్యక్తి నివాసం ఉంటున్న గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.స్థానికుల కథనం ప్రకారం.. ఇంట్లో వాళ్ళు ప్రమాదవశాత్తు బయటపడ్డారు అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. గమనించిన గ్రామస్థులు వెంటనే అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ, ఫైర్ ఇంజన్ వచ్చేలోపే మంటలు గుడిసె అంతటా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న బియ్యం, బట్టలు, నగదు మరియు ఇతర నిత్యావసర వస్తువులతో పాటు సర్వస్వం పూర్తిగా బూడిదయ్యాయి. కళ్ళముందే ఇల్లు కాలిపోవడంతో బాధితుడు పొగాకు నగేష్ కన్నీరుమున్నీరవుతున్నారు. కష్టపడి కూడబెట్టుకున్న ఆస్తి అంతా కాలిపోవడంతో ఇప్పుడు నిలువనీడ లేక రోడ్డున పడ్డాననిఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డ తనను ప్రభుత్వం ఆదుకోవాలని, తక్షణ సహాయం అందించి న్యాయం చేయాలనిజూ నగేష్ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# ‘శౌర్య’ ఇండోర్ గేమ్స్ హాల్‌ను ప్రారంభించిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.





**ధర్మఘంట, జనవరి 21, కరీంనగర్ :** పోలీస్ అధికారులు, సిబ్బంది సంక్షేమంలో భాగంగా, వారి మానసిక ఉల్లాసం కోసం కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలో అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన ‘శౌర్య‘ ఇండోర్ గేమ్స్ హాల్‌ను బుధవారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ప్రారంభించారు. కమిషనరేట్ లోని అస్త్ర కన్వెన్షన్ హాలు పక్కన నిరుపయోగంగా ఉన్న పాత యూనిట్ హాస్పిటల్ భవనాన్ని సీపీ ప్రత్యేక చొరవతో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. దీనికి ‘శౌర్య ఇండోర్ గేమ్స్ హాల్‘ అని నామకరణం చేసి, సిబ్బందికి అన్ని రకాల క్రీడా సౌకర్యాలు అందుబాటులోకి వచ్చేలా పునర్నిర్మించారు.ఈ క్రీడా వేదికలో అధికారులు, సిబ్బంది కోసం ఈ క్రింది వసతులను కల్పించారు. టేబుల్ టెన్నిస్ మరియు స్నూకర్స్, క్యారం బోర్డ్స్ మసాజ్ చైర్ (విశ్రాంతి కోసం), టీవీ హాల్ ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా సీపీ గారు మాట్లాడుతూ.. ఈ ఇండోర్ గేమ్స్ హాల్ హోమ్ గార్డ్ స్థాయి నుండి కమిషనర్ వరకు అందరికీ అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. నిరంతరం విధులతో బిజీగా ఉండే పోలీసులు తమ మానసిక ఒత్తిడిని దూరం చేసుకునేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, తద్వారా వారు మరింత ఉత్సాహంగా, సమర్థవంతంగా విధులు నిర్వహించగలరని ఆయన అభిప్రాయపడ్డారు. పోలీసుల ఆరోగ్యం మరియు మానసిక ఉల్లాసంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, ఈ హాల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినందుకు కమిషనరేట్ సిబ్బంది సీపీ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం, అడిషనల్ డిసిపిలు వెంకటరమణ, భీంరావు ఏసిపిలు, ఇన్స్పెక్టర్లు మరియు కరీంనగర్ కమిషనరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌సిసి క్యాడెట్‌లకు ప్రశంసా పత్రాలు అందజేసిన

# కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.






**ధర్మఘంట, జనవరి 21, కరీంనగర్ :** గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు, ఎన్నికల సమయంలో ట్రాఫిక్ విధుల్లో అత్యంత సమర్థవంతంగా, క్రమశిక్షణతో విధులు నిర్వహించిన ఎన్.సి.సి క్యాడెట్‌ల సేవలను గుర్తించి, వారిని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అభినందించారు. బుధవారం కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలునందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో క్యాడెట్‌లకు ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎన్నికల వంటి కీలక సమయాల్లో పోలీసు శాఖకు అండగా నిలిచి, శాంతిభద్రతల పరిరక్షణలో ఎన్‌సిసి క్యాడెట్లు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వారిలోని సేవా దృక్పథం, సమయపాలన అభినందనీయమని పేర్కొన్నారు. క్యాడెట్‌లను సమన్వయం చేస్తూ పోలీసు శాఖకు పూర్తి సహకారాన్ని అందించిన ఎన్‌సిసి అధికారులను సీపీ గారు శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలు, నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా భవిష్యత్తులో కూడా ఎన్‌సిసి క్యాడెట్ల సేవలను వినియోగించుకుంటామని సీపీ వెల్లడించారు. సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావడం వల్ల వారికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు వెంకటరమణ, భీంరావు, కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ కృష్ణ, సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, మేజర్ రవీంద్ర బాబు ఇతర పోలీస్ అధికారులు, ఎన్.సి.సి ప్రతినిధులు పాల్గొన్నారు.

# టీఎన్జీవోస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరించిన మంత్రి కోమటిరెడ్డి





**ఉద్యోగుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం..**

**ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకం**

**రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**ధర్మ ఘంట జనవరి 21, నల్గొండ:** ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నింటినీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.మినిస్టర్స్ క్వార్టర్ లో బుధవారం జిల్లా టీఎన్జీవో యూనియన్ 2026 సంవత్సరం నూతన డైరీ,క్యాలెండర్ ను మంత్రి ఆవిష్కరించారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఉన్న టీఎన్జీవోస్ యూనియన్ బిల్డింగ్ పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెల వేతనాలు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు.ఉద్యోగులు బాధ్యతగా పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు.ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షులు నాగిళ్ల మురళి,కార్యదర్శి జె.శేఖర్ రెడ్డి,ఎన్ డి సీ ఎం ఎస్ మాజీ చైర్మన్ బోళ్ల వెంకట రెడ్డి,సెంట్రల్ యూనియన్ ఉపాధ్యక్షుడు సిహెచ్. నర్సింహ చారి,విజయ్,టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు ఏడుదొడ్ల వెంకట్రామిరెడ్డి,కోశాధికారి జయరాజు,అసోసియేట్ అధ్యక్షులు డి.ఐ రాజు,దశరథ,ప్రదీప్,లక్ష్మయ్య,లింగయ్య, నారాయణస్వామి,రాణదేవ్,మధుసూదనాచారి,సైదులునాయక్,భాస్కర్,అజీముద్దీన్,జానిపాషా,రమ్య,సుధ,రుణాదేవి ,కరుణశ్రీ,లక్ష్మి,సునీత,సుమలత,సంధ్య,రాము,వెంకటరెడ్డి వెంకటరమణ,సురేందర్,భిక్షం,శ్రీనివాస్,నందు,యశ్వంత్, రంజిత్, రాజశేఖర్ రెడ్డి,కిరణ్,దుర్గయ్య,నిఖిల్,యాదగిరి,సత్యనారాణ,నాగరాజు,సుమన్,శంకర్ రెడ్డి,బాలకృష్ణ,నజీర్,ప్రవీణ్,సందీప్ నాల్గవ తరగతి ఉద్యోగుల అధ్యక్షులు బిక్షం,మణి,కృష్ణ,రాజమల్లు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ అవగాహనలో మీడియా పాత్ర కీలకం

**మోత్కూరు ఇన్స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు**

**ధర్మ ఘంట, జనవరి 21 మోత్కూరు:** ట్రాఫిక్ భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడంలో మీడియా పాత్ర కీలకమని మోత్కూరు ఇన్స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం మోత్కూరు పోలీస్ స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ అవేర్నెస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, గ్రామాలు పట్టణాలు అనే భేదం లేకుండా ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించేలా విస్తృత ప్రచారం అవసరమని అన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించడం తమ బాధ్యతగా భావించాలని సూచించారు.ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలను నిరంతరం చేపట్టుతూ, ప్రజల్లో భద్రత పట్ల చైతన్యం కల్పించేందుకు మీడియా పోలీసులు సమన్వయంతో పనిచేస్తే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని ఆయన అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



# నన్ను రాజకీయంగా బలి చేయడానికే కర్ల రాజేశ్ మరణం

**ఉత్తమ్ దంపతుల ప్రోద్బలంతోనే ఈ హత్య**

**కర్ల రాజేష్ ది ముమ్మాటికి పోలీస్ హత్యనే**

**అఖిలపక్ష సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్**




**ధర్మ ఘంట,జనవరి 21,కోదాడ:-** బొల్లం మల్లయ్య యాదవ్ అనే వ్యక్తిని రాజకీయంగా బలి చేయడానికి ఉత్తమ్ దంపతుల ఆదేశాలతోనే అమాయకుడైన దళిత యువకుడు కర్ల రాజేష్ ని పోలీసులు చిత్ర హింసలకు గురిచేసి అతని హత్యకు కారణమయ్యారని కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. కర్ల రాజేష్ లాకప్ డెత్ కారకులైన పోలీసులపై మరియు ఇతర శాఖల అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం కోదాడ పట్టణంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్యఅతిథిగా ఏర్పాటు చేసిన అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వేల కోట్ల రూపాయల కుంభకోణాలు, కోదాడలో ఎన్నో అక్రమాలు జరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వం, కేవలం సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన 12 లక్షల రూపాయల విషయంలో కార్ల రాజేశ్ అనే ఒక దళిత యువకుడిని లక్ష్యంగా చేసుకుని అతన్ని చిత్రహింసలకు గురిచేసిందని విమర్శించారు.

ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉత్తమ్ దంపతుల ప్రత్యక్షపరోక్ష ప్రోద్బలం ఉందని, వారి ఆదేశాల మేరకే స్థానిక పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ దళితబహుజన యువకులను వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. కేవలం 1 లక్ష రూపాయలకు సంబంధించిన అంశంలో కర్ల రాజేష్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి 30 రోజుల పాటు నిర్బంధించి, శారీరకంగా మరియు మానసికంగా తీవ్రంగా హింసిస్తూ, ఈ కేసులో మల్లయ్య యాదవ్ పేరు చెప్పాలని పోలీసులు బలవంతం చేశారని తెలిపారు. రాజేష్ తన పేరు చెప్పకపోవడంతోనే మరింత చిత్రహింసలకు గురిచేసి చివరకు అతని ప్రాణాలు తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితంలో ఏ సంఘటనకైనా కృంగిపోని నేను రాజేశ్ మరణంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాను. ఒక దళిత యువకుడు రాజేశ్ అనే వ్యక్తిని ఈ రాజ్యం హత్య చేసిందని, ఈ విషయంకు రాజకీయ రంగు అంటుకోకూడదని మనసులో బాధ ఉన్నా రాజేశ్ కుటుంబానికి న్యాయం జరగాలని అంత్యక్రియల్లో కూడా పాల్గొనలేదు ఆ కుటుంబాన్ని పరామర్శించలేదు. ఇంత పెద్ద సంఘటన జరిగిన తర్వాత కూడా ప్రభుత్వంలో కూడా స్థానిక ప్రజాప్రతినిధులలో కూడా చలనం రాలేదు. మాదిగ జాతిపిత, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారు స్వయంగా రంగంలోకి దిగి పెద్ద పెద్ద దర్యాప్తు సంస్థలు చేయలేని విధంగా స్పష్టమైన ఆధారాలు సేకరించి ప్రభుత్వానికి సమర్పిస్తే కానీ ప్రభుత్వంలో చలనం రాలేదు. స్పష్టమైన ఆధారాలు చూపించినప్పటికీ, రాజేశ్ మరనానికి ప్రత్యక్ష కారకులైన చిలుకూరు ఎస్ ఐ సురేశ్ రెడ్డి పై చర్యలు తీసుకోకుండా సంబంధం లేని పోలీసు అధికారుల మీద తూతూ మంత్రంగా చర్యలు తీసుకున్నారని, చనిపోయి ఇప్పటికీ 60 రోజులు గడుస్తూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టినా ఎస్ఐ సురేశ్ రెడ్డి పై చర్యలు తీసుకోకుండా అడ్డుకుంటున్నది మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దంపతులు కాదా అని ప్రశ్నించారు. రాజకీయంగా నన్ను అణగదొక్కాలని ఉత్తమ్ గత 20 సంవత్సరాలుగా చేయని ప్రయత్నం లేదని, అవేవి సఫలం కాకపోవడంతో ఇలాంటి చిల్లర ప్రయత్నాలు చేశారని, రాజకీయంలో కోట్ల రూపాయలు నష్టపోయిన నేను ఈ 12 లక్షల రూపాయలకు ఆశపడ్డానంటే ప్రజలు ఎలా దీనిని నమ్ముతారని ఉత్తమ్ దంపతులను ప్రశ్నించారు. రాజేశ్ కుటుంబానికి న్యాయం జరిగే విషయంలో మా పోరాటాలు మేము నిర్వహిస్తామని, అలాగే మంద కృష్ణ మాదిగ గారు ఏ పిలుపునిచ్చినా దానికి మా పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# నేర నియంత్రణకు ప్రత్యేక దృష్టి..






**పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించేలా చర్యలు**

**ప్రత్యేక కేసుల్లో ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు**

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

ధర్మ ఘంట,జనవరి 21, నల్గొండ: నేర నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించి,వాటిని నియంత్రించేందుకు మరింత కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లా పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ నేర సమీక్షా సమావేశంలో నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు,పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితి,కేసుల విచారణలో అధికారుల చొరవ,నేరస్తులకు కోర్టుల ద్వారా శిక్షలు పడేలా చేపడుతున్న ముందస్తు చర్యలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పెరుగుతున్న వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి,వాటి నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటూ శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు. నిఘా వ్యవస్థలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో,కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటును మరింత ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. నేరం చేసినవారికి శిక్ష,నేరం చేయని వారికి రక్షణ అన్న లక్ష్యంతో పోలీస్ శాఖ పని చేయాలని,మహిళలు,చిన్నారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ నాణ్యమైన,సత్వర సేవలు అందించాలని అన్నారు. పోక్సో, గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణను వేగవంతం చేసి కోర్టుల్లో చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన రోడ్డు భద్రత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖలు, ప్రజలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు. జిల్లాలో దొంగతనాల నివారణకు పగలు,రాత్రి పెట్రోలింగ్‌ను అప్రమత్తంగా నిర్వహించాలని, రౌడీ షీటర్లు, అనుమానితులు,పాత నేరస్థులపై కఠిన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్ లోన్ యాప్ మోసాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే అక్రమ గంజాయి,జూదం,పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా,అక్రమ ఇసుక రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారులు తదితర బాధితులు ఇకపై పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే వారి ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానాన్ని పోలీస్ శాఖ అమల్లోకి తీసుకొచ్చిందని తెలిపారు. మహిళలు,పిల్లలపై జరిగే నేరాలు,శారీరక దాడులు,ఆస్తి వివాదాలు, పోక్సో చట్టం,ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసులు,బాల్య వివాహాల నిషేధ చట్టం,దొంగతనం,ర్యాగింగ్ నిరోధక చట్టం కింద నమోదయ్యే కేసుల్లో ఈ విధానం అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్. బి డిఎస్పీ మల్లారెడ్డి,నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర రాజు,దేవరకొండ డిఎస్పీ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


# మున్సిపల్ ఎన్నికల్లో మళ్లీ బీసీలకు అన్యాయమే...

## జిల్లా జేఏసీ చైర్మన్ నల్ల మధు యాదవ్

**ధర్మ ఘంట, జనవరి 21,నల్గొండ:** మున్సిపల్ ఎన్నికల్లోను బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం జిల్లా జేఏసీ చైర్మన్ నల్ల మధు యాదవ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు జరుగుతున్న అన్యాయంపై కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 15% ఉన్న అగ్రకులాలకు 61 మున్సిపల్ చైర్మన్ స్థానాలు,60 శాతం ఉన్న బీసీలకు 38 శాతం ఇది ఎక్కడి న్యాయం అని ప్రశ్నించారు. బీసీలకు ద్రోహం చేస్తున్న రాజకీయ పార్టీలను రాజకీయంగా బొంద పెడతాం అని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో ను బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా మోసం చేసిందని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ అమలు జరిగే వరకు ఇక ఎన్నికలు నిర్వహించనని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం,నేడు మాట తప్పి బీసీలను మరో మారు మోసం చేసి మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తుందని తీవ్రంగా మండిపడ్డారు. ఒకవేళ 42 శాతం రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసి ఉంటే బీసీలకు 52 మున్సిపల్ చైర్మన్ స్థానాలు దక్కేవని గుర్తు చేశారు. గత 2020లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు అమలు జరిగితే,2026 లో జరిగే ఎన్నికల్లో మాత్రం ఒక్క శాతం తగ్గించి 31 శాతం కే బీసీలను పరిమితం చేశారని మండిపడ్డారు. బీసీలకు అన్యాయం చేసిన పార్టీలకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని బీసీలకు సూచించారు.



# గంజాయి రవాణా కేసులో నిందితుడి అరెస్ట్.




**ధర్మ ఘంట, జనవరి 21 మోత్కూరు:** గంజాయి సరఫరా కేసులో గత కొంతకాలంగా పోలీసులను తప్పించుకుంటూ పరారీలో ఉన్న నిందితుడు భువనగిరి కి చెందిన మహేష్‌ను మోత్కూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మోత్కూరు ఇన్స్పెక్టర్ సి. వెంకటేశ్వర్లు తెలిపారు. వారు బుధవారం వెల్లడించిన వివరాల ప్రకారం. ఈ నెల 4వ తేదీన మున్సిపాలిటీ పరిధిలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో, స్థానిక యువకుడు సందీప్‌కు గంజాయి సరఫరా చేసేందుకు ఓ వ్యక్తి వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు సందీప్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే, ప్రధాన సప్లయర్ మహేష్ అక్కడి నుంచి తప్పించుకున్నాడు. పరారీలో ఉన్న మహేష్ కోసం గాలింపు చేపట్టిన పోలీసులు, అతను భువనగిరి ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మహేష్‌పై ఇదివరకే భువనగిరిలో పలు కేసులు నమోదైనట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. మహేష్ అరెస్టుతో గంజాయి రవాణా వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి విక్రయం లేదా రవాణా చేసిన పక్షంలో కఠిన చర్యలు తప్పవని ఇన్స్పెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# క్రీడలు ఆరోగ్యానిస్తాయి:-సబ్ జడ్జి కె.సురేష్.



**కోదాడ జనవరి 21,ధర్మఘంట:-** రిపబ్లిక్ డే సందర్భంగా న్యాయవాదులకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలను సీనియర్ సివిల్ జడ్జి కె సురేష్ బుధవారం నాడు కోదాడ కోర్టులో క్యారమ్స్ ఆడి ప్రారంభించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి వత్తిడిలో పడి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని,ఆటల ద్వారా మానసిక ప్రశాంతత ను,శారీరక, మానసిక ఉల్లాసం కోసం క్రీడలు దోహదం చేస్తామన్నారు. ఎప్పుడూ కేసులు,కక్షిదారులు అంటూ న్యాయవాదులు తమ విలువైన సమయాన్ని కోర్టులోనే గడుపుతున్నారని,ఇలాంటి సందర్భాల్లోనే న్యాయవాదులు తమ నైపుణ్యాలను వెలికితీసి, ఆహ్లాదకరమైన జీవితాన్ని గడుపుతూ, ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జిస్ కె భవ్య, ఎండి ఉమర్, ఎస్ డి జాకీయా సుల్తానా, బార్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు సిహెచ్ లక్ష్మినారాయణ రెడ్డి, రామిశెట్టి రామకృష్ణ, ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య, యడ్లపల్లి, కోడూరు వెంకటేశ్వరరావు,బండారు రమేష్ బాబు, హుస్సేన్,నవీన్, ఎస్ వి చలం,సీనియర్ న్యాయవాదులు యలక సుధాకర్ రెడ్డి, దేవబత్తిని నాగార్జున రావు, పాలేటి నాగేశ్వరరావు, ఈదుల కృష్ణయ్య,సాధు శరత్ బాబు,ఎం.రాజారాం, దొడ్డ శ్రీధర్,ఆవుల మల్లిఖార్జున్, పాషా,పెద్దబ్బాయి,ధనలక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి - డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి




**ధర్మ ఘంట జనవరి 21 కోదాడ టౌన్ :-** కోదాడ టౌన్ మరియు కోదాడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, ప్రజలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినూత్న కార్యక్రమమే అరైవ్ అలైవ్ అని దీనిని పోలీస్ శాఖ తరపున విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం నందు కోదాడ డివిజన్ డిఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ సీఐ శివ శంకర్, మోటార్ వెహికల్ ఆర్టిసి డివిజన్ మేనేజర్, పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ పాల్గొన్నారు.

ధర్మఘంట

## ఆధునిక సౌకర్యాలతో స్పర్శ్ పిల్లల హాస్పిటల్ ప్రారంభం

ప్రారంభించిన డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్

సూర్యాపేట మెడికల్ హబ్ గా మారుతుంది



**ధర్మ ఘంట జనవరి 21,సూర్యాపేట జిల్లా ప్రతినిధి :** జిల్లా కేంద్రంలో నిర్మల హాస్పిటల్ రోడ్ లో ఆదునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన స్పర్శ్ పిల్లల హాస్పిటల్ ను బుధవారం ప్రముఖ వైద్యులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట మెడికల్ హబ్ గా మారుతుందని అన్నారు. సూర్యాపేట లో గత పది సంవత్సరాల కాలంలో దాదాపుగా 200 ప్రైవేట్ హాస్పటల్ ప్రారంభమయ్యాయని, సూర్యాపేటలో కార్డియాలజీ న్యూరాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజి, నెప్రాలజి వంటి వైద్య సేవలు లభిస్తున్నాయని, మోకాళ్ళ చిప్పలు మార్చే వైద్యం సూర్యాపేట వైద్యులు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో సూర్యాపేటలో బైపాస్ సర్జరీ కూడా లభిస్తుందని అన్నారు. .సూర్యాపేటలో స్థానికుడైన తిరునగరు భరత్ ఎంబిబిఎస్ ఎండి పూర్తి చేసి స్థానిక ప్రజలకు తక్కువ ధరలో వైద్యం అందించడం కోసం స్పర్శ్ పిల్లల హాస్పిటల్ ను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. చిన్న పిల్లల వైద్యం కోసం చాలామంది హైదరాబాదు కు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, స్పర్శ హాస్పిటల్ లో తక్కువ ధరలో నాణ్యతగల వైద్యాన్ని పేదలకు అందించి ప్రముఖ హాస్పిటల్ గా పేరు సంపాదించుకోవాలని ఆయన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ చైర్మన్ డాక్టర్ ఆనంద్ దాంగ్డె, నిర్వాహకులు డాక్టర్ తిరునగరు భరత్, తిరునగరు శ్రీనివాస్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మేడారం జాతరకు ఖని బస్టాండ్ నుండి ఎక్స్ ప్రెస్ బస్ సౌకర్యం..

=డిపో మేనేజర్ ఎం. నాగభూషణం




**ధర్మఘంట జనవరి:21 రామగుండం** గోదావరిఖని పట్టణ, పరిస ప్రాంత ప్రజల సౌకర్యార్థం గోదావరిఖని బస్ స్టాండ్ నుండి బుధవారం నుండి ఉదయం 5:30 గంటలకు, 11:00 గంటలకు ఎక్స్ ప్రెస్ బస్సు మేడారంకు బయలుదేరి వెళ్లనున్నాయని గోదావరిఖని డిపో మేనేజర్ ఎం ఒక ప్రకటనలో తెలిపారు.మేడారం నుంచి ఉదయం 11 గంటలకు, సాయంత్రం 4 గంటలకు బస్సులను ఏర్పాటు చేశామని అయన పేర్కొన్నారు.కాగా భక్తులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా అయన కోరారు.

## నల్గొండలో హుడా డేట్స్, నట్స్ షాప్ ప్రారంభం





**ధర్మ ఘంట జనవరి 21,నల్గొండ :** నల్గొండ పట్టణంలోని ప్రకాశం బజార్ తారక జ్యువెలర్స్, లైఫ్ స్టైల్ స్టీల్ ప్యాలెస్,ఓల్డ్ కలెక్టరేట్ రోడ్డులో మంగళవారం మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్మల మోహన్ రెడ్డి,హుడా డేట్స్, నట్స్ షాప్ నిర్వాహకులు మహమ్మద్ సల్మాన్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న జీవన శైలి విధానంలో ప్రస్తుత కాలం డయాబెటిస్,గుండె, మొదలైన రోగాలకు తమ శరీరాలు నిలయాలుగా మారుతున్నాయని అందుకు భిన్నంగా పౌష్టిక ఆహార పదార్థాలను స్వీకరించినట్లయితే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చు అని తెలిపారు.మంచి నాణ్యత,రుచి, తాజాగల డ్రై ఫ్రూట్స్ లో అనేక రకాల ప్రోటీన్స్,విటమిన్స్,ఐరన్,ఫైబర్ పోషకాలు పుష్కలంగా లభిస్తాయన్నారు.ఎండు ద్రాక్ష వలన మూత్ర నాల ఆరోగ్యాన్ని కాపాడతాయన్నారు.ఈ అవకాశం పట్టణ,గ్రామీణ కస్టమర్లు,సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ అబ్దుల్ ఖాజర్, మహమ్మద్ ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.

# ఫౌండేషన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ధర్మఘంట జనవరి 21, నల్గొండ:** తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ జిల్లా కేంద్రంలో నిర్వహించే 2025-26 సంవత్సరానికి ఐదు (5) నెలల ఫౌండేషన్ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. స్టడీ సర్కిల్ ఫౌండేషన్ కోర్సు కరపత్రాలను జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అన్ని పోటీ పరీక్షలతో పాటుగా, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కొరకు బ్యాంకింగ్, ఆర్.ఆర్ బీ,ఎస్.ఎస్.సీ అన్ని ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ తో పాటు భోజన వసతి సౌకర్యాలతో పాటు స్టడీ మెటీరియల్స్ అందిస్తున్నట్లు తెలిపారు.జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ స్త్రీ/పురుష అభ్యర్థులు ఆన్లైన్లో ఫ్త్రిజూ:౹/ంర్బుఎఎఇఅతీఎశ్రీవ.ఎశీ.ఱఅ ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.అన్ని వర్గాల అభ్యర్థులు కనీసం ఏదైనా జనరల్ లేదా ప్రొఫెషనల్ కోర్సులలో డిగ్రీ పూర్తి చేసిన వారై ఉండాలని,వార్షిక ఆదాయం మూడు లక్షలలోపు ఉండాలని తెలిపారు.కళాశాలల్లో అడ్మిషన్ కలిగి,చదువు కొనసాగిస్తున్న వారు ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నవారు గాని దరఖాస్తు చేసుకోవద్దని స్పష్టం చేశారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 8 న నిర్ణీత సెంటర్ నందు ఆఫ్ లైన్ ద్వారా ఉ.11.00 గం. నుండి మ.1.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన వంద మంది అభ్యర్థులకు ఫిబ్రవరి 20 నుండి జూలై 19 వరకు ఉచిత రెసిడేన్షియల్ కోచింగ్ ఇస్తారని తెలిపారు.ఇతర వివరాలకు డైరెక్టర్ స్టడీ సర్కిల్ ఫోన్ నెంబర్ 9396621492 లో సంప్రదించాలని సూచించారు.జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అధికారి బి శశికళ, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస రావు , హౌస్సింగ్ పి.డి రాజ్ కుమార్,సూపరిశేడెంట్ సుధీర్ కుమార్,ఎస్సి కార్పొరేషన్ సుపెరిండెంట్ గోవర్ధన్ రెడ్డి , దేవరకొండ ఎ ఎస్ డబ్ల్యూ కరుణ శ్రీ,ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి. నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.

# నేడు మండల కేంద్రాల్లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాలను విజయవంతం చేయండి

ఎం ఆర్ పి ఎస్ జిల్లా కమిటీ డిమాండ్

ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డా. మున్నంగి నాగరాజు మాదిగ



ధర్మఘంట,జనవరి 21,సూర్యాపేట: బుధవారం విద్యానగర్ లోని మహావీర్ హాల్లో ఏర్పాటుచేసిన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని ముఖ్య అతిథిగా వారు మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ల రాజేష్ లాకప్ డెత్ మృతికి కారకులైన పోలీసులపై సీబీఐ విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దోషులను కఠినంగా శిక్షించేంత వరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. నేడు సూర్యాపేట జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో రాజకీయ పార్టీలు, ప్రజా, కుల, విద్యార్థి సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసేందుకు మండల నాయకత్వం ప్రణాళికలు రూపొందించు కోవాలని సూచించారు. అనంతరం ఈనెల 25 న అన్ని మండల కేంద్రాల ప్రధాన కూడళ్లల్లో మనవ హారాలు నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. చిలుకూరి ఎస్సై సురేష్ రెడ్డి, సీఐ, లింగం, కోదాడ డి.ఎస్.పి, జిల్లా ఎస్పీపై శాఖా పరమైన చర్యలు తీసుకునేంతవరకు ప్రజా ఉద్యమాన్ని నిర్మించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఎమ్మెస్ పి జిల్లా అధ్యక్షులు రాజన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వినయ్ బాబు మాదిగ, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ , ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి ఎంఎస్పి బొజ్జ సైదులు మాదిగ, ఎంఎస్పి రాష్ట్ర నాయకులు ఎర్ర వీరస్వామి మాదిగ, ములకలపల్లి రవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా మహిళలు మరింత అభివృద్ధి

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ధర్మ ఘంట జనవరి 21, నల్గొండ :** గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల ద్వారా మహిళలు మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ముందుకు తీసుకువెళ్లడంలో డిపిఎంలు, ఏపీఎంలు ముఖ్యపాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా చేపట్టే కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు.స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సాధ్యమైనంత మందిని సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని,కొత్త సంఘాలు ఏర్పాటు చేసి గ్రామైక్య సంఘాల సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. బుక్కుల నిర్వహణ,రుణాలు పొందడం, తిరిగి చెల్లించడం,రికార్డుల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలని, జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులందరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస్ అక్షరమాల కార్యక్రమంలో చదువుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఉల్లాస్ అమ్మ అక్షరమాల పై ప్రతి గ్రామ సంఘంలో తప్పనిసరిగా చర్చించాలని చెప్పారు.జిల్లాలో ఇక్రిశాట్ సహకారంతో మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి చిరుధాన్యాలు,వేరుశనగ,ఇతర పంటలు పండించే ప్రాంతాలను గుర్తించి ప్రాసెసింగ్ యూనిట్ ల ఏర్పాటుకు అయ్యే ఖర్చు,ఇతర వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.దివ్యాంగుల ధ్రువ పత్రాల జారీలో భాగంగా ఇంకా 914 మందికి ఇవ్వాల్సి ఉందని,ఎప్పటికప్పుడు ధ్రువపత్రాలు జారీ చేస్తూనే, సదరం శిబిరాల నిర్వహణలో కొత్తగా వచ్చిన వాటిని కూడా అదే సమయంలో ప్రాసెస్ చేయాలని చెప్పారు.జిల్లాలో గ్రామైక్య సంఘాల భవనాలు, మండల మహిళా సమాఖ్యల భవనాలు, వ్యవసాయ మార్కెట్ గోదాముల నిర్మాణం,ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల భవనాల నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులతో సంప్రదించి ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పాఠశాల టాయిలెట్లు, ప్రహరీల నిర్మాణం,గ్రామపంచాయతీలు,అంగన్వాడీ బిల్డింగ్ ల నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిపై నివేదిక సమర్పించాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు ఎప్పటికప్పుడు ఏపీఎంలతో అన్ని అంశాలపై నిరంతరం సమీక్షించాలని,మహిళలను ఆర్థికంగా ముందుకు తీసుకు వెళ్లే అంశాలలో ఏపీఎంలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ,నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి,నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటీండెంట్ నేత నరసింహారావు,జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు ,ఏపీఎంలు ఈ హాజరయ్యారు.

## ఎన్ జి కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ప్రారంభం...

**సేవా దృక్పథంతో పనిచేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలి**

**ఎంపీడీవో ఆవ వేద రక్షిత**




**ధర్మ ఘంట,జనవరి 21 కనగల్ :** ఎన్ఎస్ఎస్ వాలంటరీలు సేవా దృక్పథంతో పనిచేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఎంపీడీవో ఆవ వేద రక్షిత, మహాత్మా గాంధీ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ రమణారెడ్డి లు అన్నారు.మండలంలోని దోరేపల్లి, పగడిమర్రి గ్రామాల్లో బుధవారం నల్లగొండ ఎన్జీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు.ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ పరిశుభ్రత చెట్లు నాటడం,మత్తు పదార్థాల నిషేధం విద్యా ప్రాధాన్యతను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఈనెల 27 వరకు 7 రోజులపాటు ఎన్ఎస్ఎస్ శిబిరం కొనసాగుతుందని ప్రిన్సిపల్ డాక్టర్ సముద్రాలు ఉపేందర్, ప్రోగ్రాం ఆఫీసర్స్ నర్సింగ్ కోటయ్య,కంబాలపల్లి శివరాణి తెలిపారు.అనంతరం దోరేపల్లి హైస్కూల్లో మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు బక్క ఎల్లమ్మ, నాగబెల్లి నాగమణి సైదులు,కదిరే సైదులు కిసాన్ సేల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్ రెడ్డి,ఎఫ్ ఏ కన్నెబోయిన నరసింహ,కదిరే నాగరాజు,అంకుష్ వార్డు సభ్యులు తదితరులు ఉన్నారు.